

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 17-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 303 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 8.17 తదుపరి నవమి; నక్షత్రం: కృత్తిక ఉ. 8.47 తదుపరి రోహిణి; వర్జ్యం: రా. 1.11-2.50; దుర్ముహూర్తం: ఉ. 6.45-8.17; అమృతఘడియలు: శేషం 7.57, తె. 6.07 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





'గో ఫస్ట్' రేసులో స్పైస్‌జెట్

బిడ్ దాఖలు చేసిన సంస్థ చైర్మన్ అజయ్ సింగ్

పోటీలో స్కై వన్ కూడా..

న్యూఢిల్లీ: దేశీయ బడ్జెట్ ఎయిర్‌లైన్ స్పైస్‌జెట్ తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మూతపడి, దివాలా ప్రక్రియలో ఉన్న 'గో ఫస్ట్' ఎయిర్‌లైన్స్‌ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. కంపెనీ సీఎండీ అజయ్ సింగ్ ఇందుకోసం ఇప్పటికే బిడ్ దాఖలు చేశారు. బిజీ బీ ఎయిర్‌వేస్ అనే సంస్థతో కలిసి ఆయన వ్యక్తిగత హోదాలో ఈ బిడ్ దాఖలు చేశారు. స్పైస్‌జెట్‌తో పాటు గో ఫస్ట్ కొనుగోలు కోసం షార్జా కేంద్రంగా పనిచేసే స్కై వన్ ఎఫ్‌జెడ్ఈ కూడా బిడ్ దాఖలు చేసింది. అయితే ఈ రెండు సంస్థలు ఎంత మొత్తానికి బిడ్లు సమర్పించాయనే విషయం వెల్లడి కాలేదు.

ఎందుకీ కొనుగోలు?

నిజానికి స్పైస్‌జెట్ ఇప్పటికే అనేక సమస్యల్లో ఉంది. ఆర్థిక పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉంది. ఖర్చుల హేతుబద్ధీకరణ పేరుతో 1,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. ఈ సమస్యల నుంచి బయటపడేందుకు ఇటీవలే ఇన్వెస్టర్ల నుంచి రూ.744 కోట్లు సమీకరించింది. ఇవి చాలక మరో రూ.1,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతోంది.

అయినా గో ఫస్ట్ కోసం పోటీపడుతోంది. ఈ కొనుగోలు ద్వారా దేశీయ విమానాశ్రయాల్లో గో ఫస్ట్‌కు ఉన్న స్లాట్లు, అంతర్జాతీయ ప్రయాణ హక్కులు దక్కితే ఎయిర్ ఇండియా, ఇండిగో పోటీని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని స్పైస్‌జెట్ అంచనా. ఈ కారణంతోనే మూతపడిన గో ఫస్ట్ కోసం పోటీపడుతోందని భావిస్తున్నారు.

మాకే వస్తుంది: స్కై వన్

స్పైస్‌జెట్ పోటీలో ఉన్నా గో ఫస్ట్ కొనుగోలు మీద స్కై వన్ చాలా ఆశలు పెట్టుకుంది. 'ప్రపంచ విమానయాన రంగంలో మాకు అపార అనుభవం ఉంది. కాబట్టి గో ఫస్ట్ మాకే వస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని ఆ సంస్థ చైర్మన్ జైదీప్ మీర్‌చందానీ ఒక ప్రకటనలో తెలిపారు. స్కై వన్‌కు ప్రయాణికుల విమానాలతో పాటు సరుకుల రవాణా విమానాల్లోనూ మంచి ప్రవేశం ఉంది.

2023-24లో టెక్ పరిశ్రమ ఆదాయం

రూ.21 లక్షల కోట్లు

వృద్ధికి ఢోకా లేదు..కొత్తగా 60,000 కొలువులు: నాస్కామ్

ముంబై: ఆటుపోట్లు ఉన్నా టెక్నాలజీ పరిశ్రమ దూసుకుపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ఈ పరిశ్రమ ఆదాయం 25,400 కోట్ల డాలర్లకు (సుమారు రూ.21.08 లక్షల కోట్లు) చేరుకుంటుందని టెక్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ అంచనా వేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 3.8 శాతం ఎక్కువ. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు టెక్నాలజీపై చేసే ఖర్చులు 50 శాతం తగ్గించుకున్నాయి. దీంతో భారత ఐటీ కంపెనీలకు వచ్చే కాంట్రాక్టులూ 6 శాతం పడిపోయాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నా దేశీయ టెక్ పరిశ్రమ ఆదాయం 3.8 శాతం వృద్ధి రేటుతో రూ.21.08 లక్షల కోట్లకు చేరడం విశేషం.



కలిసొచ్చే అంశాలు

హార్డ్‌వేర్ రంగాన్ని మినహాయించినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం టెక్ పరిశ్రమ ఆదాయం 19,900 కోట్ల డాలర్లకు (సుమారు రూ.16.51 లక్షల కోట్లు) చేరనుంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 3.3 శాతం ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరం దేశీయ కంపెనీల నుంచి లభించే ఆదాయమే 5.9 శాతం (930 కోట్ల డాలర్లు) పెరిగి 5,440 కోట్ల డాలర్లకు చేరుతుందని నాస్కామ్ అంచనా. 'ఎగుమతుల వృద్ధి రేటు కొద్దిగా తగ్గినా, దేశీయ మార్కెట్ ఆదాయం చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగడం ఇందుకు ప్రధాన కారణం. దేశీయ మార్కెట్ ఆదాయం గతంలో ఎన్నడూ ఇంత వేగంగా పెరగలేదని భావిస్తున్నా' అని నాస్కామ్ ప్రెసిడెంట్ దేబ్‌జానీ ఘోష్ అన్నారు. రాజకీయ సుస్థిరత, నిపుణులైన ఉద్యోగులు లభించడం, ప్రభుత్వం అనుసరిస్తున్న సులభతర వాణిజ్య విధానమూ ఇందుకు దోహదం చేయనుంది.

కొత్త కొలువులు

ఇంజనీరింగ్ కాలేజీల నుంచి ఏటా బయటికి వచ్చే గ్రాడ్యుయేట్లలో ఎక్కువ మంది ఏదో ఒక టెక్ కంపెనీలో ప్లేస్‌మెంట్ కోసం ఆరాటపడతారు. అమెరికా, ఐరోపా దేశాల ఆర్థిక కష్టాలతో ఈ సంవత్సరం భారత టెక్ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు తగ్గాయి. దీంతో కంపెనీలూ ప్లేస్‌మెంట్లు తగ్గించాయి. కొన్ని కంపెనీలైతే ఈ సంవత్సరం ప్లేస్‌మెంట్ల కోసం ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్లడమే మానేశాయి. ఉన్న ఉద్యోగులకే కొత్త టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి నెట్టుకొస్తున్నాయి. ఇన్ని సమస్యలున్నా ఈ ఆర్థిక సంవత్సరమూ దేశీయ టెక్ కంపెనీలు 60,000 మంది ఉద్యోగులను తీసుకుంటాయని నాస్కామ్ అంచనా. దీంతో దేశీయ టెక్ పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య ఈ ఆర్థిక సంవత్సరం చివరికి 54.3 లక్షలకు చేరనుంది. బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సీ)లు భారత్‌లో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లు (జీసీసీ) ఇందుకు తోడ్పడతాయని ఘోష్ తెలిపారు.

దిద్దుబాటు తప్పదు

ప్రస్తుతం టెక్ కంపెనీల్లో కొనసాగుతున్న ఉద్యోగుల తీసివేతలపైనా నాస్కామ్ చీఫ్ ఘోష్ మాట్లాడారు. కొవిడ్ సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్నందున, ఇప్పుడు ప్రాజెక్టులు లేకపోవడంతో కంపెనీలు వారిని తొలగిస్తున్నారు. ఇది దిద్దుబాటు (కరెక్షన్) మాత్రమే తప్ప తీసివేతలు కాదన్నారు. పరిశ్రమ అభివృద్ధికి ఇలాంటి దిద్దుబాట్లు తప్పవన్నారు. ప్రస్తుతం టెక్ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనాలిసిస్, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో మాత్రమే పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఉన్నట్టు ఆమె చెప్పారు. కంపెనీలు కొత్తగా ఉద్యోగులను తీసుకునే బదులు, ఉన్న ఉద్యోగులకే ఈ డొమైన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉపయోగించుకుంటున్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే కంపెనీలు 6.5 లక్షల మంది ఉద్యోగులకు ఏఐలో శిక్షణ ఇచ్చి ఉపయోగించుకుంటున్నట్టు చెప్పారు.

వచ్చే నెల 15లోగా

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారులకు ఆర్‌బీఐ సూచన

ఆంక్షల అమలుకు మరో 15 రోజులు గడువు

ఇతర బ్యాంకులకు మారిపోండి

ముంబై: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) విషయంలో విధించిన ఆంక్షల అమలుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరో 15 రోజులు గడువు ఇచ్చింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయం ప్రకారం ఆంక్షలు మార్చి 15 నుంచి అమలులోకి వస్తాయి. ఈ లోగా తమ ఖాతాలను ఇతర బ్యాంకుల్లోకి మార్చుకోవాలని పీపీబీఎల్ ఖాతాదారులు, మర్చంట్లకు ఆర్‌బీఐ సూచించింది. కస్టమర్ల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని గడువు పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. పీపీబీఎల్ విదేశీ మారక నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నదంటూ జనవరి 31వ తేదీన ఆర్‌బీఐ ప్రకటించిన ఆంక్షల గడువు ఈ నెల 29 వరకు ఉంది. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు ప్రజలకు మరింత గడువు అవసరం అవుతుందని భావించినట్టు ఆర్‌బీఐ తాజా ప్రకటనలో తెలిపింది. మార్చి 15వ తర్వాత కూడా కస్టమర్ల సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు, కరెంట్ అకౌంట్లు, ప్రీపెయిడ్ సాధనాలు, ఫాస్టాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డుల్లో ఉన్న సొమ్ము పూర్తయ్యే వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అనుమతించనున్నట్టు ఆర్‌బీఐ వెల్లడించింది. అలాగే పీపీబీఎల్ కస్టమర్లు, సాధారణ పౌరుల అనుమానాలు నివృత్తి చేసే 30 ఎఫ్ఏక్యూలను కూడా ఆర్‌బీఐ శుక్రవారం విడుదల చేసింది.

ఎఫ్ఏక్యూలు..

- మార్చి 15 తర్వాత కస్టమర్లు తమ పీపీబీఎల్ ఖాతాలోకి సొమ్ము బదిలీ చేసే అవకాశం ఉండదు. వడ్డీలు వినహా స్వీప్-ఇన్ విధానంలో భాగస్వామ్య బ్యాంకుల నుంచి సొమ్ము జమ చేయడం, వాపసు చేయడం, క్యాష్ బాక్ వంటివి కూడా అనుమతించరు.
- వచ్చే నెల 15 లోగా కస్టమర్లు అసౌకర్యాన్ని నివారించుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.
- భాగస్వామ్య బ్యాంకులతో పీపీబీఎల్ కస్టమర్లు నిర్వహిస్తున్న ఖాతాలోని సొమ్మును పీపీబీఎల్‌కు వాపసు తెచ్చుకోవడానికి (స్వీప్-ఇన్) రూ.2 లక్షల గరిష్ఠ పరిమితికి లోబడి అనుమతిస్తారు. అయితే తాజా డిపాజిట్లను మాత్రం అనుమతించరు.
- మార్చి 15వ తేదీ తర్వాత కస్టమర్ల వేతనాలు, పెన్షన్లు కూడా పీపీబీఎల్ ఖాతాలో జమ కావు. పీపీబీఎల్ ద్వారా ఈఎంఐలు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు చేసుకునే వారు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఫాస్టాగ్ కస్టమర్లు తమ ఖాతాలోని సొమ్ము పూర్తయ్యే వరకు దాన్ని ఉపయోగించుకుని మార్చి 15 లోగానే ఇతర బ్యాంకుకు చెందిన ఫాస్టాగ్‌ను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది.
- పేటీఎం క్యూఆర్‌కోడ్, పేటీఎం సౌండ్ బాక్స్, పేటీఎం ఖాతాతో అనుసంధానం చేసిన పేటీఎం పీఓఎస్ టెర్మినల్ ఉపయోగించే వ్యాపారులు మార్చి 15 తర్వాత ఆ సర్వీసు ఉపయోగించుకునే వీలుండదు. ఇతర ప్రత్యామ్నాయాలు అన్వేషించుకోవాలి. ఇతర బ్యాంకు ఖాతాతో అనుసంధానమైన క్యూఆర్ కోడ్ తీసుకోవాలి. అయితే మీ నిధుల బదిలీ కార్యకలాపాలు ఇతర బ్యాంకు ఖాతాతో అనుసంధానమై ఉంటే మాత్రం మార్చి 15 తర్వాత కూడా దాన్ని యధాతథంగా ఉపయోగించుకోవచ్చు.

నోడల్ ఖాతా యాక్సిస్ బ్యాంక్‌కు బదిలీ

పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఓసీఎల్) తమ నోడల్ ఖాతాను పీపీబీఎల్ నుంచి యాక్సిస్ బ్యాంక్‌కు మార్చుకుంది. దీనివల్ల పేటీఎం క్యూఆర్, సౌండ్ బాక్స్, కార్డ్ మెషీన్లు మార్చి 15 తర్వాత కూడా పని చేస్తాయని రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో ఓసీఎల్ తెలిపింది. వ్యాపారులకు నిరంతరాయంగా సెటిల్మెంట్ చేయడానికి వీలుగా యాక్సిస్ బ్యాంక్‌లో ఎస్క్రో ఖాతాను ప్రారంభించినట్టు తెలియచేసింది. ఓసీఎల్ పూర్తి యాజమాన్య సంస్థ పేటీఎం పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (పీపీఎస్ఎల్) ఇప్పటికే యాక్సిస్ బ్యాంక్ సేవలను ఉపయోగించుకుంటోంది.

పేటీఎం ఫాస్టాగ్ ఇక బంద్

జాబితా నుంచి తొలగించిన ఎన్‌హెచ్ఏఐ

టోల్ వసూలు బాధ్యతలు నిర్వర్తించే ఎన్‌హెచ్ఏఐ అనుబంధ సంస్థ ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్ఎంసీఎల్) తన అధీకృత బ్యాంకుల జాబితా నుంచి పేటీఎంను తొలగించింది. దీంతో ఇకపై ప్రజలు పేటీఎం ఫాస్టాగ్ సేవలను ఉపయోగించుకునే అవకాశం ఉండదు. ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రయాణాలు చేసేందుకు వీలుగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను వదిలి తమ జాబితాలోని 32 ఇతర అధీకృత బ్యాంకుల నుంచి ఫాస్టాగ్స్ కొనుగోలు చేసుకోవాలని ప్రజలకు సూచించింది. దేశం మొత్తం మీద 8 కోట్ల మంది ఫాస్టాగ్ యూజర్లుండగా అందులో పీపీబీఎల్ వాటా 30 శాతం ఉంది.

ఏపీలో హెచ్‌యూఎల్

పామాయిల్ ప్లాంట్

రూ.300 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ పామ్ సాగుతో పాటు పామాయిల్ ఉత్పత్తిని చేపట్టేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వంతో జట్టు కట్టేందుకు ఎఫ్ఎంసీజీ దిగ్గజ సంస్థ హిందుస్థాన్ యూనీలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) సన్నాహాలు చేస్తోంది. ఇటీవల నెల్లూరులో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో హెచ్‌యూఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దేవ్ బాజ్‌పాయ్, యోగేష్ మిశ్రా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం భేటీ అయ్యింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగ పురోభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తాము కట్టుబడి ఉన్నట్లు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. రైతులు, పారిశ్రామిక రంగానికి నేరుగా లబ్ధి చేకూర్చే విధంగా పామాయిల్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి ఈ సందర్భంగా వారికి తెలిపారు. రాష్ట్రంలో 15 వేల మందికి పైగా రైతులను భాగస్వాములుగా చేర్చుకుని కనీసం 30 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని హెచ్‌యూఎల్ భావిస్తోంది. ఇందులో భాగంగా ఆయిల్ పామ్ నర్సరీలు, సేకరణ కేంద్రాలతో పాటు పామాయిల్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రానున్న సంవత్సరాల్లో రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. ప్రతిపాదిత ప్లాంట్ ద్వారా 1000 మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. హెచ్‌యూఎల్ ఇప్పటికే రాజమండ్రిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిందని, తాజాగా పామాయిల్ ప్లాంట్‌ను నెలకొల్పాలని చూస్తోందని కంపెనీ ఈడీ దేవ్ బాజ్‌పాయ్ తెలిపారు. కంపెనీ స్కిన్ ఉత్పత్తుల పోర్టుఫోలియోకు అవసరమైన ఉత్పత్తులను వ్యూహాత్మకంగా ఇక్కడి నుంచి సేకరించాలని చూస్తున్నట్లు దేవ్ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,290 ▲	57,100 ▲	77,000 ▲
ముంబై	61,743 ▲	56,557 ▲	70,922

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ	
హైదరాబాద్	551
17వ తేదీ	
చిత్తూరు	603
గోదావరి	542
విజయవాడ	542
విశాఖపట్నం	555
వరంగల్	553

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	124
వరంగల్	124
కరీంనగర్	124
మహబూబ్‌నగర్	124
కర్నూలు	124
విశాఖపట్నం	122
గోదావరి	129
విజయవాడ	129
గుంటూరు	129
ఒంగోలు	129
చిత్తూరు	132

స్పోర్ట్స్

అశ్విన్ అర్ధంతరంగా..

రాజ్‌కోట్: టెస్టుల్లో 500 వికెట్లు పూర్తి చేసిన ఉత్సాహంలో ఉన్న ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ తాజా టెస్టుకు దూరమయ్యాడు. కుటుంబంలో నెలకొన్న అత్యవసర మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా అతడు వెంటనే చెన్నైకి బయలుదేరాడు. ఈ కష్టకాలంలో అశ్విన్‌కు తామంతా అండగా ఉంటామని బీసీసీఐ తెలిపింది.

వాళ్లూ మొదలెట్టారు

మూడో టెస్టు

ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 207/2

డకెట్ మెరుపు శతకం ● భారత్ తొలి ఇన్నింగ్స్ 445



బెన్ డకెట్ (133 బ్యాటింగ్)

రాజ్‌కోట్: పిచ్ ఎలాంటిదైనా బజ్‌బాల్ గేమ్‌తో దూసుకెళ్లే ఇంగ్లండ్‌కు ఫ్లాట్ వికెట్ ఎదురైతే పరిస్థితి ఎలా ఉంటుంది? బ్యాటింగ్‌కు స్వర్గధామంగా ఉన్న ఎస్‌సీఏ స్టేడియంలో స్టోక్స్ సేన ఓవర్‌కు 6 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళుతూ ఔరా.. అనిపిస్తోంది. ఓపెనర్ బెన్ డకెట్ (118 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్సర్లతో 133 బ్యాటింగ్) సంచలన ఇన్నింగ్స్‌తో చెలరేగుతున్నాడు. స్వీప్, రివర్స్ స్వీప్, స్విచ్ హిట్.. వాట్ నాట్ అనే తరహాలో స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా బ్యాట్ ఝుళిపిస్తూ అజేయ సెంచరీతో నిలిచాడు. దీంతో ఈ జట్టు శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 35 ఓవర్లలోనే 207/2 స్కోరుతో నిలిచింది. డకెట్ ఇన్నింగ్స్‌లో బౌండరీ రూపంలోనే 96 పరుగులు నమోదు కావడం విశేషం. పోప్ (39) సహకరించాడు. క్రీజులో డకెట్‌తో పాటు రూట్ (9 బ్యాటింగ్) ఉన్నాడు. ఇంగ్లండ్ ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు భారత్ 445 పరుగులకు ఆలౌటైంది. జడేజా (112) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. ధ్రువ్ జురెల్ (46), అశ్విన్ (37), బుమ్రా (26) ఇంగ్లండ్ బౌలర్లను విసిగించారు. ఉడ్‌కు 4, రెహాన్‌కు 2 వికెట్లు దక్కాయి.

అకట్టుకున్న జురెల్: 326/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన భారత్ తొలి అర్ధగంటలోనే వరుస ఓవర్లలో కుల్దీప్ (4), జడేజా వికెట్లను కోల్పోయింది. కానీ తొలి సెషన్‌లో జట్టును అరంగేట్ర జురెల్-అశ్విన్ కాపాడారు. జురెల్ ఒత్తిడి లేకుండా ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోవడం ఆకట్టుకుంది. స్కోరు 400 దాటాక అశ్విన్, జురెల్‌లను స్పిన్నర్ రెహాన్ స్వల్ప తేడాలో పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత చివర్లో బుమ్రా కాస్త దూకుడుగా ఆడి సిరాజ్‌తో పదో వికెట్‌కు 30 రన్స్ జోడించి ఉడ్ చేతిలో అవుటయ్యాడు.

డకెట్ సూపర్ సెంచరీ: మరో ఆరు ఓవర్లలో రెండో సెషన్ ముగుస్తుందనగా ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ ఆరంభమైంది. మొదటి 4 ఓవర్లలో డకెట్, క్రాలే (15) ఆచితూచి ఆడారు. ఐతే చివరి సెషన్ తొలి ఓవర్ నుంచే డకెట్ గేరుమార్చి ఎదురుదాడికి దిగాడు. 14వ ఓవర్‌లో క్రాలేను అశ్విన్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సిరాజ్ ఓవర్‌లో డకెట్ రెండు వరుస ఫోర్లతో శతకం పూర్తి చేశాడు. చివరకు పోప్‌ను సిరాజ్ ఎల్బీ చేయడంతో రెండో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రూట్‌తో కలిసి డకెట్ మరో వికెట్ పడకుండా రోజును ముగించాడు.



అశ్విన్ (1/37)

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) ఉడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) ఉడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) ఉడ్ 0; పటీదార్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 5; జడేజా (సి అండ్ బి) రూట్ 112; సర్ఫరాజ్ (రనౌట్) 62; కుల్దీప్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 4; జురెల్ (సి) ఫోక్స్ (బి) రెహాన్ 46; అశ్విన్ (సి) అండర్సన్ (బి) రెహాన్ 37; బుమ్రా (ఎల్బీ) ఉడ్ 26; సిరాజ్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 130.5 ఓవర్లలో 445 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-22, 2-24, 3-33, 4-237, 5-314, 6-331, 7-331, 8-408, 9-415, 10-445. **బౌలింగ్:** అండర్సన్ 25-7-61-1; ఉడ్ 27.5-2-114-4; హార్ట్‌లీ 40-7-109-1; రూట్ 16-3-70-1; రెహాన్ 22-2-85-2.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రజత్ (బి) అశ్విన్ 15; డకెట్ (బ్యాటింగ్) 133; పోప్ (ఎల్బీ) సిరాజ్ 39; రూట్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 35 ఓవర్లలో 207/2. వికెట్ల పతనం:** 1-89, 2-182. **బౌలింగ్:** బుమ్రా 8-0-34-0; సిరాజ్ 10-1-54-1; కుల్దీప్ 6-1-42-0; అశ్విన్ 7-0-37-1; జడేజా 4-0-33-0.

ఇంగ్లండ్‌కు ఎక్స్‌ట్రా రన్స్

భారత్ ఇన్నింగ్స్‌లో అశ్విన్ కారణంగా ఇంగ్లండ్‌కు ఐదు పరుగులు పెనాల్టీ రూపంలో జత చేరాయి. దీంతో ఆ జట్టు బ్యాటింగ్‌కు దిగకుండానే ఖాతా తెరిచినట్టయ్యింది. 102వ ఓవర్‌లో అశ్విన్ ఆఫ్ సైడ్ దిశగా ఆడి పిచ్ మధ్య భాగం గుండా పరుగు కోసం వెళ్లి వెనక్కి వచ్చాడు. ఇది గమనించిన అంపైర్ వెంటనే భారత్‌కు 5 రన్స్ పెనాల్టీ విధించాడు. ఎంసీసీ రూల్ ప్రకారం బ్యాటర్ ఏ కారణంతోనైనా పిచ్ పాడయ్యేలా ఇలా మధ్యలో నుంచి రన్ తీయకూడదు. ఇలా రెండుసార్లు చేస్తే పెనాల్టీ విధిస్తారు. తొలి రోజు ఆటలో జడేజా కూడా ఇలాగే చేయడంతో పెనాల్టీ తప్పలేదు.

1

భారత గడ్డపై ఒకే సెషన్‌లో 100+ పరుగులు సాధించిన తొలి విదేశీ బ్యాటర్‌గా డకెట్. అలాగే భారత్‌పై వేగంగా (88 బంతుల్లో) టెస్టు సెంచరీ చేసిన ఇంగ్లండ్ బ్యాటర్. గ్రాహం గూచ్ (95 బంతులు) రికార్డు దాటాడు.

టెస్టు బౌలర్లలో అత్యధిక పరుగులు (18,371) సమర్పించుకున్న బౌలర్‌గా అండర్సన్. అనిల్ కుంబ్లే (18,355)ను అధిగమించాడు.

ఇషాన్ ధిక్కారం



- ద్రవిడ్, జై షా ఆదేశాలు బేఖాతర్
- రంజీ మ్యాచ్ ఆడని కిషన్

న్యూఢిల్లీ: హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బీసీసీఐ కార్యదర్శి జై షా ఆదేశాలను వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ బేఖాతరన్నాడు. మానసిక సమస్యలతో సుదీర్ఘకాలంగా విశ్రాంతి తీసుకుంటున్న ఈ జార్ఖండ్ ఆటగాడు..పునరాగమనానికి రంజీట్రోఫీ ఆడి మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని ద్రవిడ్, జై షా చేసిన సూచనను పట్టించుకోలేదు. రాజస్థాన్‌తో శుక్రవారం జంషెడ్‌పూర్‌లో మొదలైన జార్ఖండ్ గ్రూప్ 'ఎ' రంజీ ఆఖరి పోరు ఆడాలని కిషన్‌ను వారు ఆదేశించారు. కానీ అందుకు బదులుగా అతడు హార్దిక్ పాండ్యాతో కలిసి బరోడాలో సాధన చేస్తున్నాడు.

సదర్లాండ్ రికార్డు 'డబుల్'



పెర్త్: మహిళల క్రికెట్‌లో ఆస్ట్రేలియాకు చెందిన 22 ఏళ్ల అనబెల్ సదర్లాండ్ చరిత్ర సృష్టించింది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఆమె అత్యంత వేగం (248 బంతుల్లో)గా డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా నిలిచింది. గతంలో ఆసీస్‌కే చెందిన కారెన్ రోల్టన్ (306 బాల్స్) పేరిట ఈ రికార్డు ఉండేది. మొత్తంగా అనబెల్ 210 పరుగులు సాధించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 575/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రెండో రోజు ఆట ముగిసేసరికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 67/3 స్కోరుతో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఈ జట్టు 76 రన్స్‌కే కుప్పకూలింది.

అశ్విన్ అదరహో

భారత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ టెస్టుల్లో 500 వికెట్ల క్లబ్‌లో చేరాడు. రెండో రోజు ఓపెనర్ క్రాలే వికెట్‌తో అతడీ ఘనత సాధించాడు. అలాగే టీమిండియా నుంచి అనిల్ కుంబ్లే (619) తర్వాత ఈ ఫీట్ సాధించిన రెండో బౌలర్. అంతర్జాతీయ క్రికెట్‌లో మురళీధరన్ (800) అగ్రస్థానంలో కొనసాగుతుండగా అశ్విన్‌ది తొమ్మిదో స్థానం. అలాగే ఈ ఫార్మాట్‌లో అతి తక్కువ టెస్టు (98)ల్లోనే 500 వికెట్లు తీసిన రెండో బౌలర్. మురళీధరన్ (87) ముందున్నాడు. ఇక మెక్‌గ్రాత్ (25,528) తర్వాత తక్కువ బంతుల్లో (25,714)నే ఈ ఫీట్ సాధించిన రెండో బౌలర్‌గా నిలిచాడు.

నాన్నకు అంకితం

500 వికెట్ల ఈ ఫీట్‌ను తన తండ్రి రవిచంద్రన్‌కు అంకితమిస్తున్నట్టు అశ్విన్ తెలిపాడు. తన ఆటను చూసిన ప్రతిసారీ ఆయన విపరీతమైన టెన్షన్‌కు గురయ్యేవాడని, దాదాపు గుండెపోటు వచ్చినంత పనయ్యేదని అన్నాడు. తన వల్లే ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నదన్నాడు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో తన తండ్రి ఎప్పుడూ అండగా నిలిచారని చెప్పాడు. కాగా అరుదైన ఘనత సాధించిన అశ్విన్‌పై ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ ఘనత అశ్విన్ పట్టుదలకు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. ఇక సచిన్, రవిశాస్త్రి, కుంబ్లే, లక్ష్మణ్, సెహ్వాగ్ తదితరులు అశ్విన్‌ను అభినందించారు.

అమ్మాయిలు సాధించారు..



సింధు బృందానికి పతకం ఖరారు

- పురుషుల జట్టు పరాజయం
- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

షా ఆలమ్ (మలేసియా): భారత బ్యాడ్మింటన్ మహిళల జట్టు ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకాన్ని అందుకోనుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌ను చిత్తుచేసి కనీసం కాంస్యాన్ని ఖాయం చేసుకుంది. తొలి సింగిల్స్‌లో సింధు 21-7, 16-21, 21-12తో యాన్‌పై, డబుల్స్‌లో అశ్విని/తనీషా జోడీ 21-10, 21-14తో టింగ్/యెంగ్ జంటపై గెలవగా, అస్మిత 21-12, 21-13తో యెంగ్ సమ్‌ను ఓడించి భారత్‌కు 3-0 ఆధిక్యాన్ని అందించింది. అప్పటికే భారత్ విజయం ఖరారవడంతో తర్వాతి రెండు మ్యాచ్‌లను ఆడించలేదు. సెమీస్‌లో జపాన్‌తో భారత్ తలపడనుంది. ఇక, భారత పురుషుల జట్టు జపాన్‌తో పోరులో 2-3తో ఓటమిపాలై పతకం లేకుండానే వెనుదిరిగింది. తొలి సింగిల్స్‌లో ప్రణయ్ ఓడగా.. తొలి డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ జోడీ, రెండో సింగిల్స్‌లో లక్ష్యసేన్ భారత్‌కు 2-1 ఆధిక్యాన్ని అందించారు. కానీ, రెండో డబుల్స్‌లో అర్జున్/ధ్రువ్ ఓడడంతో ఇరుజట్లు 2-2తో సమంగా నిలిచాయి. దీంతో కచ్చితంగా గెలవాల్సిన ఆఖరి సింగిల్స్ పోరులో శ్రీకాంత్..మొమోటా చేతిలో ఓటమిపాలయ్యాడు.

జట్టు బస్సులో మద్యం తాగుతూ..



హైదరాబాద్ మహిళల కోచ్ విద్యుత్ జయసింహ నిర్వాకం

వేటు వేసిన హెచ్‌సీఏ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీమ్ బస్సులో మద్యం సేవించాడన్న ఆరోపణలతో హైదరాబాద్ మహిళల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ విద్యుత్ జయసింహపై వేటు పడింది. మద్యం తాగుతున్న వీడియోలు శుక్రవారం వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవడంతో జయసింహను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు జయసింహ హెచ్‌సీఏ క్రికెట్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఉత్తర్వుల్లో జగన్ పేర్కొన్నారు. విద్యుత్, దిగ్గజ క్రికెటర్ ఎంఎల్ జయసింహ కుమారుడు. ప్రస్తుతం నెట్‌లో చక్కర్లు కొడుతున్న కోచ్ వీడియో గతనెలలో తీసినట్టుగా తెలుస్తోంది. ఆ సమయంలోనే కొందరు క్రికెటర్లు హెచ్‌సీఏలోని ఒక కీలక వ్యక్తి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన కార్యాలయంలోనే సమావేశం నిర్వహించి క్రికెటర్లకు సర్దిచెప్పినట్టు సమాచారం. కానీ, కోచ్ చర్యలను తీవ్రంగా పరిగణించిన కొందరు మహిళా క్రికెటర్లు ఈనెల 15న మరోసారి హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులకు ఫిర్యాదు చేయడం, మీడియాను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మహిళా క్రికెటర్లతో హెచ్‌సీఏ సభ్యులు మాట్లాడుతున్నారని, సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తిచేసి చర్యలు తీసుకుంటామని జగన్ చెప్పారు. ఇక, జయసింహపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చినట్టు హెచ్‌సీఏ సభ్యుడు వంకా ప్రతాప్ తెలిపారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను కోచ్ విద్యుత్ ఖండించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ మాజీ క్రికెటర్ కుమార్తెను జట్టులోకి తీసుకోవడానికి తాను నిరాకరించడంతోనే తనపై ఇలా కుట్రపూరితంగా వ్యవహరించాడని అతను అన్నాడు.

మహీప్, రికీ హాఫ్ సెంచరీలు

ఆంధ్ర 260/7

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఓపెనర్ మహీప్ కుమార్ (81), కెప్టెన్ రికీ భుయ్ (79 నాటౌట్) అర్ధ శతకాలతో మెరిశారు. శుక్రవారం కేరళతో ప్రారంభమైన రంజీ క్వార్టర్స్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు తొలి రోజు ఆట ముగిసేసరికి 89.3 ఓవర్లలో 7 వికెట్లకు 260 పరుగులు చేసింది. ఓపెనర్ రేవంత్ రెడ్డి, రషీద్ డకౌట్ కాగా, కరణ్ షిండే (43), అశ్విన్ హెబ్బర్ (28), విహారి (24) భారీ స్కోర్లు చేయడంలో విఫలమయ్యారు. బాసిల్ థంపి, వైశాఖ్ చందన్ చెరో రెండు వికెట్లు తీయగా, జలజ్ సక్సేనా, అఖిల్, అక్షయ్ తలో వికెట్ పడగొట్టారు..

జిమ్నాస్టిక్స్ వరల్డ్ కప్ ఫైనల్లో దీప, ప్రణతి

కైరో: స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్, ప్రణతీ నాయక్ ఆపరేటస్ వరల్డ్ కప్ వాల్ట్ ఫైనల్‌కు అర్హత సాధించారు. శుక్రవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో దీప 13.449 పాయింట్లు, ప్రణతి 13.166 పాయింట్లు స్కోరు చేశారు.

మనూ భాకర్ కంచు మోత

న్యూఢిల్లీ: భారత ఏస్ షూటర్ మనూ భాకర్ ఐఎస్ఎస్ఎఫ్ 10 మీటర్ల వరల్డ్‌కప్‌లో కాంస్య పతకం సాధించింది. స్పెయిన్‌లోని గ్రెనెడాలో శుక్రవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ పిస్టల్ ఫైనల్లో భాకర్ 215.1 స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

తిరుమలలో వైభవంగా రథసప్తమి



భక్తజనం మధ్య సూర్యప్రభ వాహనం 3

శనివారం | 17-2-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

వృద్ధులపై వల

ఇంటి నుంచి ఓటేసే 12డీ ఫామ్ ఓటర్లపై వైసీపీ కన్ను!

ఇందులో దివ్యాంగులు కూడా..

వలంటీర్లతో ఓట్లు కొల్లగొట్టే యత్నాలు

జగన్‌కు ఓటేయకపోతే పెన్షన్ రాదని భయపెట్టేలా వ్యూహం

రాష్ట్రంలో ఆ ఓటర్లు 10.60 లక్షలు

ప్రతి నియోజకవర్గంలో 5 వేల మంది



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వైసీపీ నేతలు, మద్దతుదారుల అక్రమాలు ఎన్నో వెలుగు చూశాయి. కార్యకర్తల నుంచి పెద్దల వరకూ డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు నమోదు చేసిన ఘటనలు బయటపడ్డాయి. ప్రతిపక్షపార్టీల సానుభూతిపరుల ఓట్లను తొలగించడంతో పాటు పెద్దఎత్తున దొంగ ఓట్లు నమోదు చేసినట్టు ఆరోపణలు కూడా వచ్చాయి. వైసీపీ తాజాగా వయోవృద్ధులు, దివ్యాంగుల ఓట్లపై కన్నేసింది. వారి ఓట్లను ఎలాగైనా ఫ్యాన్ గుర్తుకు వేయించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వినియోగించుకోలేని 80 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంట్లో నుంచే ఓటేసేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ అవకాశం ఇచ్చింది. ఏపీలో ప్రతి నియోజకవర్గంలో ఈ కేటగిరీల ఓట్లు 5 వేల పైచిలుకు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వయోవృద్ధుల ఓట్లు 5.76 లక్షలు, దివ్యాంగుల ఓట్లు 4.87 లక్షలున్నాయని ఇప్పటికే ఎన్నికల సంఘం ప్రకటించింది. వయోవృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా ఇంట్లో నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు 12డీ ఫామ్

మిగతా 10వ పేజీలో...

స్థానికంగా ఉన్నా ఓటుపై వేటు!

విశాఖ 'పశ్చిమ'లో వ్యవహారం వెలుగులోకి

ఇబ్బడి ముబ్బడిగా ఫామ్-7 దరఖాస్తులు

163 మంది నుంచి 4,409 అభ్యంతరాలు

ఎన్నికల అధికారులకు టీడీపీ ఫిర్యాదు

క్షేత్రస్థాయిలో అధికారుల కమిటీ విచారణ

తప్పుడు దరఖాస్తులు చేసినట్టు నిర్ధారణ

10 మందిపై క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశం

మరో 13 మందికి హెచ్చరికతో సరి

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపునకు చేసిన కుట్ర బట్టబయలైంది. అధికార పార్టీ సానుభూతిపరులుగా భావిస్తున్నవారు పదుల సంఖ్యలో ఫామ్-7ఏ దాఖలు చేసినట్టు నిర్ధారణ అయ్యింది. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. తప్పుడు అభ్యంతరాలు తెలిపిన

మిగతా 10వ పేజీలో...



ఉండవల్లి నివాసంలో రాజశ్యామల యాగం నిర్వహిస్తున్న చంద్రబాబు దంపతులు

జగన్‌రెడ్డీ.. నీ సినిమా అయిపోయింది

కాస్కో... అసలు సినిమా ఇప్పుడు మొదలైంది: చంద్రబాబు 9

టికెట్ రాలేదని నిరుత్సాహపడొద్దు!

పొత్తులతో నష్టపోయినవారికే పెద్దపీట

పార్టీని నమ్ముకుంటే కచ్చితంగా గుర్తింపు

'రా కదలిరా' తర్వాత మరో యాత్ర 9

టీడీపీ నేతలతో బాబు టెలీ కాన్ఫరెన్స్

వచ్చే వారమే ఎన్డీయేలోకి టీడీపీ!

19 లేదా 20న ఢిల్లీకి బాబు, పవన్

పొత్తు, సీట్లపై అధికారిక ప్రకటన?

బీజేపీతో పొత్తు తేలాకే టీడీపీ ఎంపీ అభ్యర్థులపై స్పష్టత 9

ఎవరినో భుజాన మోయం!

మా నాయకుడే ఏపీ సీఎం కావాలి 9

బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యలు

అది నిర్ణయించేది మోదీ, షా, నడ్డాయే

ఆ మాటలతో పార్టీకి సంబంధం లేదు

రాష్ట్ర బీజేపీ మీడియా ఇన్‌చార్జి స్పష్టీకరణ



విజయనగరంలో శంఖారావం సభకు హాజరైన జనం. (ఇన్‌సెట్) 'సూపర్ సిక్స్' కార్డులతో లోకేశ్

ఉమ్మడి మోసం

ప్రజలను మభ్యపెట్టడానికే: లోకేశ్

3 రాజధానుల పనైపోయింది

ఇప్పుడు హైదరాబాద్ ఇంకో పదేళ్లు కేపిటల్‌గా ఉండాలట!

విపక్ష నేతగా ఉన్నప్పుడు అమరావతికి జగన్ మద్దతు

గద్దెనెక్కగానే 3 ముక్కలాట

రాజధాని ఏదంటే చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితికి తీసుకొచ్చారు

భూములిచ్చిన రైతులకు నాలుగేళ్లుగా వేధింపులు

రాష్ట్రాన్ని పదేళ్లు వెనక్కి నెట్టారు

ఉత్తరాంధ్రను మాఫియా డాన్లకు అప్పగించారు

టీడీపీ యువ నేత ధ్వజం

విజయనగరం, రామతీర్థం, గంట్యాడల్లో శంఖారావం

అశోక్ గజపతిరాజును వైసీపీ నేతలు అవమానించారు. ఆయన వంటి మంచి వ్యక్తిపై తప్పుడు కేసులు పెట్టి వేధించినవారిని వదిలిపెట్టం.

ఉత్తరాంధ్ర గంజాయి వ్యాపారానికి అడ్డాగా మారింది. తూర్పు గోదావరి ఎమ్మెల్సీ అనంతబాబు ఇక్కడ గంజాయి పండిస్తున్నాడు.

- లోకేశ్

విజయనగరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఉమ్మడి రాజధాని పేరిట వైసీపీ నేతలు మరో మోసానికి దిగారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. మూడు రాజధానుల పనైపోయిందని, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టేందుకు హైదరాబాద్‌ను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర జిల్లాలను మాఫియా డాన్ల చేతుల్లో పెట్టారని, వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. 'శంఖారావం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన విజయనగరం జిల్లా విజయనగరం, రామతీర్థం, గంట్యాడల్లో జరిగిన సభల్లో

మిగతా 9వ పేజీలో...

అయ్యో.. అన్నదాతా!



రాష్ట్రంలో 46 లక్షల ఎకరాలు బీడు

ఓ వైపు కరువు, మరోవైపు తుఫాన్‌తో గతేడాది అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వర్షాభావంతో దాదాపు 46 లక్షల ఎకరాలు బీళ్లుగా మారగా, వేసిన పంటలూ చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఆ తర్వాత తుఫాన్ దెబ్బకు మరింత నష్టం జరిగింది. ఖరీఫ్‌లో అన్ని పంటల దిగుబడులు తగ్గగా.. రబీలోనూ ఏ మేరకు దిగుబడి వస్తాయో తెలియని పరిస్థితి. రైతులు తీవ్రంగా నష్టపోయి కష్టాల్లో ఉన్నా.. జగన్ సర్కారు ఇప్పటి వరకూ నయా పైసా కూడా నష్టపరిహారం ఇవ్వలేదు.

2023-24లో భారీగా తగ్గిన సాగు

440 మండలాల్లో వర్షాభావమే కారణం

103 కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకొన్న జగన్ సర్కార్

మిచౌంగ్ తుఫాన్‌తో మరింత నష్టం

లక్షల టన్నుల్లో తగ్గిన ఉత్పత్తి

రైతులకు పైసా కూడా అందని పరిహారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 2023-24లో తీవ్ర వర్షాభావం కారణంగా వ్యవసాయం నిరాశాజనకంగా మారింది. పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. ఖరీఫ్, రబీ సీజన్లలో 46 లక్షల ఎకరాల్లో రైతులు పంటలే వేయలేకపోయారు. ఖరీఫ్‌లో 89.37 లక్షల ఎకరాలకు గాను 62.45 లక్షల (73%) ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. దాదాపు 27 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. రబీలో 57.5 లక్షల

మిగతా 10వ పేజీలో...



ఎయిర్ డిఫెన్స్ టాక్టికల్ కంట్రోల్ రాడార్

ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు 84,560 కోట్లు

ఆమోదం తెలిపిన రక్షణ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భద్రతా బలగాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మల్టీమిషన్ మారిటైం ఎయిర్‌క్రాఫ్టలతో సహా రూ.84,560 కోట్లతో పలు రక్షణ ఉత్పత్తుల కొనుగోలు ప్రతిపాదలకు రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) శుక్రవారం ఆమోదం తెలిపింది. కొత్త తరం యాంటీ-ట్యాంక్ మైన్స్ ఎయిర్ డిఫెన్స్ టాక్టికల్ కంట్రోల్

మిగతా 8వ పేజీలో...

అన్నీ ప్రీపెయిడ్ మీటర్లే.. 8

19.79 కోట్ల కనెక్షన్లకు బిగించాలని కేంద్రం నిర్ణయం

రీచార్జ్ మొత్తం అయిపోయాక సందేశాలు ఇచ్చి డిస్‌కనెక్షన్

ఆర్‌డీఎస్ఎస్ కింద గైడ్‌లైన్స్

పేటీఎంకు మరో 15 రోజులు గడువు 11

ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు మరింత సమయం: ఆర్బీఐ

కాంగ్రెస్ ఖాతాల స్తంభన!

ఐటీ శాఖ ఆదేశాలు.. 2018-19లో రూ.210 కోట్ల పన్ను చెల్లించలేదని చర్య

ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసిన కాంగ్రెస్ పార్టీ

ఖాతాల్లో రూ.115 కోట్లు ఉంచాలి

ఆపై సొమ్మునే వాడాలని ట్రిబ్యునల్ ఆదేశం

విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదా

కరెంటు బిల్లులు కట్టేందుకూ డబ్బుల్లేవు

ప్రజల విరాళాల్నీ స్తంభింపజేశారు: మాకెన్

ప్రజాస్వామ్యాన్ని కోర్టులే కాపాడాలి: ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు మరికొన్ని వారాల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్న సమయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేసింది.



అయితే, ఐటీ అప్పీలేట్ ట్రిబ్యునల్ ఈ చర్యను కొన్ని మినహాయింపులతో నిలిపి వేస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ వ్యవహారంపై ఐటీ శాఖ అధికారికంగా వివరాలను వెల్లడించలేదు. కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్ మీడియాతో మాట్లాడుతూ, గత లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2018-19 ఆర్థిక సంవత్సరానికి

మిగతా 8వ పేజీలో...

ఎన్ఆర్ఐతో వివాహానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మోసాలను అరికట్టేందుకు సమగ్ర చట్టం ఉండాలి

కేంద్ర న్యాయశాఖకు లా కమిషన్ సిఫారసులు 8

కట్టుదిట్టమైన నిబంధనలతో కూడిన నివేదిక సమర్పణ

సీపీఎస్ X పోలీస్!

రేపు 'చలో విజయవాడ'కు ఉద్యోగుల పిలుపు

రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్ల ఆవిష్కరణ

10 అనుమతి లేదంటూ పోలీసుల నోటీసులు

పాల్గొంటే క్రిమినల్ చర్యలంటూ బెదిరింపులు

మరోవైపు 'చలో బెజవాడ'కు మౌఖిక అనుమతులు

ప్రభుత్వ ద్వంద్వ విధానాలపై ఏపీసీపీఎస్ఈఏ ఫైర్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బలపడిన బంధం

అరబ్ ఎమిరేట్స్, ఖతార్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు గల్ఫ్‌తో మన బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. దేశంలో సార్వత్రిక ఎన్నికల సంరంభం ఆరంభం కాబోతున్న నేపథ్యంలో, మోదీ రెండోవిడత పదవీకాలంలో బహుశా ఇదే ఆఖరు విదేశీపర్యటన కావచ్చు. అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబీలో 'ఏహ్లన్ మోదీ' పేరిట ఆయనకు స్వాగతం పలుకుతూ, మరోపక్క ఆ దేశపాలకులను కూడా కీర్తిస్తూ ఏర్పాటైన ఓ భారీ కార్యక్రమంలో భారత ప్రధాని పాల్గొన్నారు. అనంతరం అద్భుతమైన స్వామినారాయణ్ ఆలయ ఆరంభోత్సవంలోనూ పాలుపంచుకున్నారు. ఆ తరువాత ప్రత్యేకంగా ఖతార్ వెళ్ళి ఎనిమిదిమంది భారతీయ మాజీ నౌకాదళ సిబ్బందిని క్షేమంగా తిప్పిపంపినందుకు ఆ దేశాధినేతకు తన సంతోషాన్ని కృతజ్ఞతలను తెలియచేశారు.

అరబ్ ఎమిరేట్స్ అభివృద్ధిలో కోట్లాదిమంది భారతీయ శ్రామికుల పాత్ర కాదనలేనిది. వారి సేవలకు, భారతదేశంతో స్నేహానికి ఆ దేశం ఎంతో ప్రాధాన్యం ఇస్తూవచ్చింది. నరేంద్రమోదీ ప్రధాని అయిన మరుసటి ఏడాదే ఆ దేశంలో కాలూని ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేశారు. 1981లో ఇందిరాగాంధీ పర్యటన తరువాత భారత ప్రధాని ఎవరూ ఆ దేశానికి వెళ్లలేదు. ఆ లోటు పూర్తిగా తీర్చడానికి ఇప్పటివరకూ మోదీ చేసిన ఏడు పర్యటనలూ ఉపకరించి, ఇరుదేశాల ఆర్థికవ్యాపార సంబంధాలతో పాటు, స్నేహం కూడా హెచ్చింది. ఎమిరేట్స్‌వృద్ధిలో ముప్పై శాతం పైచిలుకు ప్రవాసభారతీయుల పాత్ర అక్కడి పాలకులకు తెలుసు. ప్రవాసుల అభీష్టాన్ని గౌరవించి హిందూ ఆలయ నిర్మాణానికి వారు స్థలం ఇచ్చారు. ఒక సంప్రదాయ ఇస్లామిక్ దేశంలో పాలకుల సంపూర్ణ సహకారాలతో, పాతిక ఎకరాలకుపైగా విస్తరించిన ప్రాంగణంలో భారీ ఆలయం నిర్మాణం కావడం ఒక విశేషమైన ఘట్టం. గల్ఫ్‌లో ఇదే అతిపెద్ద హిందూ ఆలయం. దుబాయ్‌లో ఇప్పటికే రెండు ఆలయాలున్నప్పటికీ, మతనిష్ఠ అధికంగా ఉన్న అబుదాబీలో ఇంతటి భారీ నిర్మాణానికి అవకాశం ఇవ్వడం విశేషం. ఒక ముస్లిం పాలకుడు స్థలాన్నిస్తే, చీఫ్ ఆర్కిటెక్ట్‌గా ఒక కేథలిక్, ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఓ సిక్కు, రూపకర్తగా ఓ బౌద్ధుడు వ్యవహరిస్తే పార్సీ కంపెనీ దీని నిర్మాణాన్ని చేపట్టింది. మసీదుల కింద ఆలయాలున్నాయంటూ మనదేశంలో వాటిని కూల్చే ఉద్యమాలు జరుగుతూంటే, మతరాజ్యమని అనుకుంటున్నచోట పాలకుల సహకారంతో ఇలా ఓ పరమత ప్రార్థనామందిర నిర్మాణం జరగడం, ఆరంభోత్సవంలో భారత ప్రధానితో పాటు అక్కడి పెద్దలూ ఉండటం విశేషం. స్థానికుల కంటే ప్రవాసులే అధికంగా ఉన్నచోట, వలసవచ్చినవారి మత ఆకాంక్షలను గౌరవించడానికి, వారి అభీష్టాన్ని నెరవేర్చడానికి ఎంతో ఔదార్యం కావాలి.

ఖతార్ సైతం మనతో ఎంతో ఆత్మీయంగా వ్యవహరించింది. ఎమీర్ జోక్యం లేకపోయివుంటే మరణశిక్షపడిన ఎనిమిదిమంది మాజీ నౌకాదళ అధికారులు క్షేమంగా స్వదేశానికి చేరగలిగేవారు కాదు. ఒకపక్క న్యాయస్థానాల్లో పోరాడుతూ, మరోవైపు దౌత్యం నెరపుతూ గూఢచర్యం ఆరోపణలతో మరణశిక్షపడిన వారిని ఎట్టకేలకు మనం వెనక్కుతెచ్చుకోగలిగాం. ఉభయదేశాల మధ్యా ఉన్న స్నేహం, వాణిజ్యబంధం అందుకు ఉపకరించాయి. స్థానికుల కంటే ప్రవాసులే ఐదురెట్లు అధికంగా ఉన్న ఆ దేశంలో, భారతీయులు ఎనిమిది లక్షల మంది ఉండటం వెనుక ఖతార్ ఎమీర్ ప్రోత్సాహం కాదనలేనిది. 2008లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పర్యటనతో ద్వైపాక్షికబంధం విశేషమైన మార్పుచెందితే, 2016లో మోదీ పర్యటన తరువాత అది మరింత దృఢపడింది. వివిధ రంగాల్లో ఉభయదేశాల సహకారం పెరిగి, ద్వైపాక్షిక వాణిజ్యం 18 బిలియన్ డాలర్లకు చేరుకుంది. రెండేళ్ళక్రితం ఇరుదేశాలూ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని సైతం చేసుకున్నాయి. మనదేశం దిగుమతిచేసుకొనే ద్రవీకృత సహజవాయువులో 40శాతం ఖతార్‌నుంచే వస్తున్నది. 1999లో గ్యాస్ సరఫరాకు సంబంధించి చేసుకున్న ఒప్పందం మరో నాలుగేళ్ళలో ముగిసిపోబోతున్న నేపథ్యంలో, ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాల్సిన గడువు గత ఏడాది డిసెంబరుతో పూర్తయింది. ఇటీవలే, 2048వరకూ అమలులో ఉండే విధంగా ఏకంగా 78బిలియన్ డాలర్ల విలువైన భారీ ఒప్పందం ఉభయదేశాల మధ్యా కుదిరింది. దీనికీ, ఈ ఎనిమిది మంది అధికారుల విడుదలకూ సంబంధం ఉన్నదన్న అనుమానాలను అటుంచితే, భారతప్రధాని ఈ పర్యటనలో ప్రత్యేకంగా ఖతార్ వెళ్ళి ఆ దేశాధినేతకు మనవారిని క్షేమంగా వెనక్కుపంపినందుకు ధన్యవాదాలు తెలియచేయడం సముచితం.

కులమే విదేశీ శక్తుల కుట్ర, కులగణన కాదు!

పాండవులు పదమూడేళ్ల అరణ్య అజ్ఞాతవాసాలు ముగించుకొని ఇంద్రప్రస్థానికి చేరుకున్న తర్వాత కౌరవుల దగ్గరికి రాయబారం పంపారు: 'మేమూ కురువంశ వారసులమే, మాకు దక్కాల్సిన న్యాయమైన వాటా మాకు ఇవ్వాల్సిందే' అనే డిమాండును కౌరవ సభలో పెట్టారు. సోదరులకు దక్కాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వడానికి మనసొప్పని కౌరవులు నానా రకాల సాకులు చెప్పి తిరస్కరించి యుద్ధానికి, వినాశనానికి కారకులయ్యారు. 'కులగణన విదేశీ శక్తుల ఎజెండా' శీర్షికన డా. కె.అరవింద రావు రాసిన వ్యాసం (ఫిబ్రవరి 4, 2023) చదివితే దేశంలోని మెజార్టీ వర్గ ప్రజలకు ఆ పురాణాల పాత ముచ్చట యాదికొస్తున్నది. నాటి పాండవులు ఐదుగురు, కౌరవులు వందమంది. కానీ నేడు 'కులగణన చేసి సామాజిక సంపదలో మా న్యాయమైన వాటా తేల్చండి' అని అడుగుతున్న వారు జనాభాలో 90 శాతం కాగా, ఆ న్యాయమైన కోర్కెలను తిరస్కరించి అన్యాయాన్ని కొనసాగించదలుచుకున్నవారు పదిశాతపు మైనారిటీయే! ఇదీ నేటి విషాదం.

'దేశంలో అద్వానీ రథయాత్ర సమయంలో ఒక సాంస్కృతిక జాగరణ జరిగే సమయంలో వి.పి. సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేసింది' అని అరవిందరావు రాసారు. ఆగష్టు 7, 1990న వి.పి. సింగ్ మండల్ కమిషన్ నివేదిక అమలు నిర్ణయాన్ని పార్లమెంటులో ప్రకటించి, ఓబీసీ అభ్యర్థులకు 27శాతం రిజర్వేషన్లను తీసుకొచ్చాడు. మరో యాభై రోజులు గడిచాక సెప్టెంబరు 25, 1990న గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అద్వానీ రథయాత్ర ప్రారంభించాడు. ఈ క్రోనాలజీ తేల్చి చెబుతున్నది ఏమిటంటే— అద్వానీ రథయాత్ర తీసుకురాదలచిన సాంస్కృతిక జాగరణను ఓబీసీ రిజర్వేషన్లు అడ్డుకోలేదు; ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడానికే నాటి అగ్రవర్ణాల ప్రోద్బలంతో అద్వానీ రథయాత్ర మొదలుపెట్టారు!

హిందూ మతం కులాన్ని నిర్మించిందన్న ప్రచారం బ్రిటిష్‌వాడు సృష్టించినదంటూ మరో అబద్ధమాడారు వ్యాస రచయిత. 12వ శతాబ్దికి చెందిన పల్నాటి బ్రహ్మనాయుడు వెలమ కులానికి చెందినవాడని, మాల కులానికి చెందిన కన్నమదాసును దత్తత తీసుకున్నాడని, సమాజంలో నెలకొన్న కుల విభేదాలను నిర్మూలించడానికి చాపకూడు నిర్వహించాడని చరిత్రలో నమోదు అయివున్నది. 16వ శతాబ్దికి చెందిన పోతులూరి వీరబ్రహ్మం, వేమనలు కులం పేరిట నాటి సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టారు. మరి ఈ చరిత్ర అంతా బ్రిటిష్‌వాడి రాక పూర్వమే కదా!?



సామాజిక వివక్ష కారణంగా సమ అభివృద్ధికి నోచుకోని వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి తోడ్పడడంతో పాటు ఆయా వర్గాల ప్రజల మధ్య అనవసర గొడవలను నివారించి దేశ ఐక్యతకు సహకరిస్తుంది కులగణన.

హిందూ మత గ్రంథాల్లో నాలుగు వర్ణాల గురించే ఉన్నదని కులాల సృష్టి బ్రాహ్మణులు చేయలేదని అంబేడ్కర్ కూడా అన్నాడని వ్యాసకర్త రాసారు. వర్ణ వ్యవస్థ పాదులోంచే కుల వ్యవస్థ రూపుదాల్చుకున్నదని మన సమాజ పరిణామ క్రమం స్పష్టీకరిస్తున్నది. దేవుడి పేరుతో, మతం పేరుతో సమాజంపై సంపూర్ణ ఆధిపత్యం సంపాదించిన బ్రాహ్మణ వర్గాల నిర్దేశకత్వంలోనే వర్ణ వ్యవస్థ రూపుదిద్దుకున్నది. వర్ణ వ్యవస్థలో బాధిత సమూహమైన శూద్ర వర్ణంలోని ప్రజల్ని మరింత చీల్చడం కోసం, పైనున్న వర్ణాల దోపిడీ నిరాటంకంగా కొనసాగించడం కోసమే నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ఏర్పడింది. వర్ణ వ్యవస్థయినా, కుల వ్యవస్థయినా రెంటిలో సారం ఒకటే. 'ఏకమేవతు శూద్రస్య ప్రభుః కర్మసమాదిశత్ ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషా మనసూయయా' (మనుస్మృతి 1–91) – 'అసూయ లేకుండా బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ వర్ణాల వారికి సేవ చేయడమే శూద్రుల, శూద్రకులాల వారి విధి అని బ్రహ్మ ఆదేశించా'డన్న ఈ నియమమే అటు వర్ణ వ్యవస్థలోనూ ఇటు కుల వ్యవస్థలోనూ అమలయింది. సాటి సోదరుడిని బానిసగా మార్చిన ఆ పాప కార్యానికి మూలం వేరేచోట ఉండవచ్చునంటూ బుకాయిస్తే సరిపోతుందా?

సామాన్య శక పూర్వం 1700 ప్రాంతంలో మధ్య ఆసియా ప్రాంతం నుండి ఆర్యులు భారతదేశానికి వలస వచ్చి స్థానిక తెగలపై ఆధిపత్యం సాధించి చాతుర్వర్ణ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఆ వర్ణ విభజనలో ఉన్నత స్థానాన్ని తమకు అట్టిపెట్టుకొని, నిమ్న స్థాయిని మూలవాసులకు ఆపాదించారు. వర్ణవ్యవస్థలోని బాధితుల మధ్యన మరిన్ని విభజనలు తెస్తూ కుల వ్యవస్థను మొదలుపెట్టారు. ఈ వర్ణ–కుల వ్యవస్థ విదేశీ ఆర్యుల సృష్టి తప్ప మరొకటి కానేకాదన్నది చరిత్ర నిరూపించిన సత్యం. ఆ కుల వ్యవస్థ రుద్దిన అన్యాయాల పరిధిని తేల్చడం కోసమే, చేయాల్సిన చికిత్సను నిర్ధారించడం కోసమే బాధిత సమూహాలు నేడు కులగణన కోరుతున్నాయి. కులమే విదేశీ శక్తుల కుట్ర తప్ప, కులగణన కాదు! కులగణన నేడు ఒక దేశభక్తియుత కర్తవ్యం! సామాజిక వివక్ష కారణంగా సమ అభివృద్ధికి నోచుకోని వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి తోడ్పడడంతో పాటు ఆయా వర్గాల ప్రజల మధ్య అనవసర గొడవలను నివారించి దేశ ఐక్యతకు సహకరిస్తుంది కులగణన. సాటి సోదరులను మోసగించి ఇప్పటివరకు అన్యాయంగా దండుకు తింటున్న వారే లెక్కలు తీయడాన్ని అడ్డుకుంటున్నారు.

• ఆర్. రాజేశమ్
సామాజిక న్యాయ వేదిక కన్వీనర్

ఆర్థిక వాస్తవాలు-రాజకీయ లక్ష్యాలు



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

కొంత మంది వ్యక్తులు కొన్ని కొన్ని సందర్భాలలో ప్రవర్తించే తీరు వింతగా, ఉన్మాదపూరితంగా ఉండవచ్చు. అయితే ఆ పిచ్చి ప్రవర్తనల వెనుక ఒక అర్థవంతమైన కారణం తప్పక ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన తరుణంలో తన చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ప్రభుత్వం ఒక మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. దానితో పాటు, కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ – జూలై కాలానికి ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ (అనామతు పద్దు)నూ ప్రవేశపెడుతుంది. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం గత ఐదేళ్లలో ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నిర్వహించిన తీరుతెన్నుల సింహావలోకనానికి, ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌కు ఒక మార్గదర్శక ప్రణాళికను ఆవిష్కరించే సందర్భంగా ఉంటుంది. ఈ నెల 2న లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో ఆ రెండు బాధ్యతలనూ కొంచెం కొంచెంగా నిర్వర్తించారు. దరిమిలా ఫిబ్రవరి 8న 2014కు ముందు, తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై ప్రభుత్వం ఒక శ్వేతపత్రాన్ని, నరేంద్ర మోదీ పదేళ్ల పాలనపై కాంగ్రెస్ పార్టీ 'పది సంవత్సరాల అన్యాయకాలం' పేరిట ఒక బ్లాక్ పేపర్‌ను విడుదల చేశాయి. మోదీ సర్కార్ పదేళ్ల పాలన ఆఖరి ఘట్టంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్వేతపత్రం ఆ పదేళ్ల (2014–24)లో దేశ ఆర్థిక వ్యవస్థ సాఫల్య వైఫల్యాలపై ఉండగలదని ఎవరైనా ఆశిస్తారు. ఆశ్చర్యకరంగా ఆ శ్వేతపత్రం యూపీఏ ప్రభుత్వాల పదేళ్ల (2004–2014) పాలనపై ఉన్నది. ప్రభుత్వ శ్వేతపత్ర లక్ష్యం యూపీఏ పదేళ్ల పాలనను అభివృద్ధి రహిత కాలంగా చిత్రించడమే సుమా! అయితే ఆ ప్రభుత్వాలు సాధించిన విజయాలను కూడా అది చర్చలోకి తీసుకువచ్చింది. మరి యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాల పాలన తీరుతెన్నులను పోల్చి చూడడం అనివార్యమవుతుంది. అటువంటి పరిశీలనలో కొన్ని రంగాలలో యూపీఏ ప్రభుత్వాలు ఎన్డీఏ ప్రభుత్వం కంటే చాలా మెరుగైన ఫలితాలు సాధించాయని స్పష్టమవుతుంది. మోదీ సర్కార్ శ్వేతపత్రమే అందుకొక తార్కాణం.

ఆర్థికాభివృద్ధి విషయమై చర్చించేటప్పుడు అందరూ దృష్టి పెట్టే అంశె ఒకటి ఉంది. అది: స్థిరమైన ధరలలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు. ఈ విషయంలో యూపీఏ ప్రభుత్వాల పనితీరే చాలా చాలా మెరుగ్గా ఉంది. 2004–05 ఆధార సంవత్సరంగా తీసుకుని పది సంవత్సరాలలో జీడీపీ వృద్ధి రేటును గణిస్తే అది 7.5 శాతంగా ఉన్నది. 2015లో బీజేపీ ప్రభుత్వం ఈ ఆధార సంవత్సరాన్ని 2011–12కి మార్చింది. యూపీఏ ప్రభుత్వాలు సాధించిన విజయాలను తక్కువగా చూపడానికే ఈ మార్పు చేశారన్నది స్పష్టం అయితేనేం సగటు వృద్ధిరేటు 6.7 శాతంగా ఉన్నది. మరి పది సంవత్సరాల కాలంలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన సగటు వృద్ధిరేటు 5.9 శాతంగా ఉన్నది. ఈ రెండు వృద్ధిరేట్ల మధ్య తేడాకు ప్రాధాన్యమున్నది పది సంవత్సరాల కాలంలో ఏడాదికి ఈ వ్యత్యాసం 1.6 శాతం (లేదా 0.8 శాతం) చొప్పున ఉంటే స్థూల దేశీయోత్పత్తి పరిమాణంలోను, తలసరి ఆదాయంలోను, వస్తు సేవల పరిమాణంలోను, ఎగుమతుల పరిమాణం/ విలువలోను, ఆర్థిక, రెవెన్యూ లోటుల్లోను, ఇంకా వివిధ అంశాలలోను వ్యత్యాసం గణనీయంగా ఉంటుంది. ఇలా రెండు ప్రభుత్వాల హయాంలలోనూ వివిధ అంశాలను పోల్చి చూస్తే ఆర్థిక వ్యవస్థను ఏ ప్రభుత్వం ఎలా నిర్వహించింది అన్న విషయమై వాస్తవాలు వెల్లడవుతాయి.

ఉదాహరణకు జాతీయ రుణం విషయాన్నే చూద్దాం. యూపీఏ ప్రభుత్వాల పాలన ఆఖరి సంవత్సరంలో ఇది రూ.58.6 లక్షల కోట్లు కాగా ఎన్డీఏ ప్రభుత్వ హయాం ఆఖరి సంవత్సరంలో అది రూ.173.3 లక్షల కోట్లుగా ఉన్నది! అలాగే స్థూల దేశీయోత్పత్తి– రుణ నిష్పత్తిని చూస్తే యూపీఏ ప్రభుత్వాల హయాం ఆఖరి సంవత్సరంలో అది 52 శాతంగా ఉండగా ఎన్డీఏ ప్రభుత్వ పదేళ్ల పాలన ఆఖరులో అది 58 శాతంగా ఉన్నది. స్థూల దేశీయోత్పత్తిలో కుటుంబ పొదుపు మొత్తాల శాతం యూపీఏ ప్రభుత్వాల హయాంలో 23 శాతం కాగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది 19 శాతంగా మాత్రమే ఉంది. వ్యవసాయ వేతనాల పెరుగుదల యూపీఏ ప్రభుత్వాల హయాంలో 4.1 శాతం కాగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది 1.3 శాతంగా ఉన్నది. యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో రూ.2.2 లక్షల కోట్లు మాఫీ చేయగా ఎన్డీఏ ప్రభుత్వం రూ.14.56 లక్షల మాఫీ చేసింది. ఆరోగ్య భద్రతపై యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో చేసిన ఖర్చు మొత్తం ప్రభుత్వ వ్యయాలలో 1.7శాతంగా ఉండగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది కేవలం 1.7శాతంగా మాత్రమే ఉన్నది. విద్యారంగ వ్యయాలు కూడా ఇటువంటి తేడానే చూపిస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో విద్యపై చేసిన ఖర్చు మొత్తం వ్యయాలలో 4.6శాతం మేరకు ఉండగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది 2.9 శాతంగా మాత్రమే ఉన్నది.

ఇంకా చాలా విషయాలలో ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు అధ్వాన్నంగా ఉన్నది. మొత్తం జాతీయ రుణం, కుటుంబ పొదుపుల మొత్తం, బ్యాంకు రుణాల మాఫీ, విద్యా వైద్యాలపై వ్యయాలు మొదలైన అంశాలు ఎన్డీఏ ప్రభుత్వ తప్పుడు విధానాలను, ఆర్థిక వ్యవస్థను సక్రమంగా, సమర్థంగా నిర్వహించకపోవడాన్ని ఎత్తి చూపుతున్నాయని నేను భావిస్తున్నాను. ఎన్డీఏ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఖ్య తగ్గిపోవడం గమనార్హం. సరే, కొన్ని రంగాలలో ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు మెరుగ్గా ఉందనే విషయాన్ని కొట్టివేయలేము. యూపీఏ ప్రభుత్వాలు సాధించిన సార్థక విజయాలు ఎన్నిటినో ప్రభుత్వ శ్వేతపత్రం సరిగ్గా ప్రస్తావించ లేదు. అయితే పెద్ద నోట్ల రద్దు, సూక్ష్మ, మధ్య చిన్న తరహా పరిశ్రమల విధ్వంసంతో సహా ఎన్డీఏ ప్రభుత్వ ఘోర వైఫల్యాలను కప్పి పుచ్చింది. ముఖ్యంగా జన్‌ధన్ బ్యాంక్ ఖాతాలు (గతంలో 'నో ఫ్రిల్స్ ఎకౌంట్), ఆధార్ కార్డులు,



'2014 కు ముందు, తరువాత దేశ ఆర్థిక స్థితిగతుల'పై ప్రభుత్వ శ్వేతప్రతమూ, 'పది సంవత్సరాల అన్యాయకాలం' అంటూ నరేంద్ర మోదీ పాలనపై కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్'.. రెండూ నిష్పాక్షిక ఆర్థిక సమీక్ష కంటే నిర్దిష్ట రాజకీయ లబ్ధి పొందడానికే ప్రాధాన్యమిచ్చాయి. ఈ రెండు ప్రతాలలోను లేవనెత్తిన అంశాలను గత పదేళ్లలో పార్లమెంటులో చర్చించి ఉండవలసింది. అయితే అలా జరగలేదు. చర్చకు ప్రభుత్వం అనుమతించకపోవడమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

మొబైల్ విప్లవం యూపీఏ ప్రభుత్వాల కృషి ఫలితమేనన్న వాస్తవాన్ని గుర్తించడంలో ప్రభుత్వ శ్వేతపత్రం విఫలమయింది.

యూపీఏ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను ముఖ్యంగా 2008–12 సంవత్సరాల మధ్య సమర్థంగా నిర్వహించలేదని ప్రభుత్వ శ్వేతపత్రం ఆరోపించింది. 2008 సెప్టెంబర్ మధ్య రోజుల్లో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లు కూలిపోయాయి. ఈ పరిణామంతో ఆర్థిక మాంద్యం ఒక సునామీలా విజృంభించింది. అది ప్రపంచ వ్యాప్తంగా ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థకూ ఎనలేని నష్టాన్ని కలిగించింది. పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని, సంపన్న దేశాలు అనుసరిస్తున్న 'క్వాంటిటేటివ్ ఈజింగ్' విధానం అమలులో భాగంగా ఆ రుణాలు ఖర్చుచేయడం జరిగింది. దీంతో ద్రవ్యోల్బణం భారీగా పెరిగిపోయింది. జనవరి 2009 నుంచి జూలై 2012 దాకా దేశ ఆర్థిక మంత్రిగా ప్రణబ్ ముఖర్జీ ఉన్నారు. ద్రవ్యోల్బణంతో పాటు ద్రవ్యలోటు కూడ బాగా పెరిగిపోయింది. అయితే ఆ సంక్షోభ కాలంలో ప్రణబ్ అమలుపరిచిన విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ఉద్యోగాల సృష్టికి దోహదం జరిగింది. అయితే ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం రూపేణా అందుకు మూల్యం చెల్లించవలసివచ్చింది. సరే, కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' ఏక పక్షంగా ఉన్నది. వ్యవసాయ రంగం దురవస్థ, పెరిగిన ద్రవ్యోల్బణం, పెచ్చరిల్లిన నిరుద్యోగిత, ఆశ్రిత పక్షపాతం మొదలైన వాటిని వివరంగా పేర్కొంది. అలాగే కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగపరచడం, రాజ్యాంగ సంస్థలను బలహీనపరచడం, మన భూ భాగాలలోకి చైనా చొరబాటు, మణిపూర్ విషాదం మొదలైన ఘటనలు, పరిణామాలను ప్రత్యేకంగా పేర్కొంది. అది నిజంగా ఎన్డీఏ ప్రభుత్వ పది సంవత్సరాల అన్యాయ కాలంపై బ్లాక్ పేపర్ అనడంలో సందేహం లేదు.


దేశ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితి చాలా స్పష్టంగా ఉన్నప్పటికీ '2014కు ముందు, తరువాత దేశ ఆర్థిక స్థితిగతుల'పై ప్రభుత్వ శ్వేతపత్రమూ, దానికి ప్రతిస్పందనగా 'పది సంవత్సరాల అన్యాయకాలం' శీర్షికతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేళ్ల పాలనపై కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' రెండూ నిష్పాక్షిక ఆర్థిక సమీక్ష కంటే నిర్దిష్ట రాజకీయ లబ్ధి పొందడానికే ప్రాధాన్యమిచ్చాయి. ఈ రెండు పత్రాలలోను లేవనెత్తిన అంశాలను గత పదేళ్లలో పార్లమెంటు ఉభయ సభలలో చర్చించి ఉండవలసింది. అయితే అలా జరగలేదు. ముఖ్యమైన అంశాలపై చర్చకు ప్రభుత్వం అనుమతించకపోవడమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టంలో ఆ అంశాలపై చర్చకు రంగాన్ని ఆ రెండు పత్రాలూ సిద్ధం చేశాయి. ఆ అంశాలపై చర్చ జరుగుతుందా, ధనం, మతం, విద్వేష ప్రసంగాలు, అధికార దుర్వినియోగం ఇత్యాది విషయాలు ఆ కీలక ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తాయా అన్న ప్రశ్నకు కాలం మాత్రమే సమాధానం చెప్పగలదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,

భట్టుమూర్తి 'వసుచరిత్ర'ను పూజించిన ఘంటసాల!

ఆంధ్ర పంచకావ్యాల్లో 'వసుచరిత్ర' రెండవది. 'రామరాజభూషణ' బిరుదాన్ని పొందిన భట్టుమూర్తి (ప్రబంధాంకం మూర్తిరాజు) ఈ ప్రబంధాన్ని రాశారు. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన తిరుమల దేవరాయలవారికీ గ్రంథం అంకితం చేశారు. భట్టుమూర్తి అష్టదిగ్గజ కవులలో ఒకరు.

ఈ కవి 1510–1585 సంవత్సరాల మధ్య జీవించినట్లు తెలుస్తున్నది. స్వస్థలం కడప జిల్లాలో గల భట్టుపల్లె. తండ్రి సూరపరాజు. భట్టుమూర్తి బాల్యం నుంచి అసమానమైన కవితాధారతో గణుతికెక్కిన దాఖలాలున్నాయి. అనేక నిఘంటువులు నోటిలోనే ఉండేవని సాహిత్యవ్యాసాలు చెపుతున్నాయి. విజయనగర సామ్రాజ్యంలో భట్టుమూర్తి కవిత్వం మూడు పూలు, ఆరు కాయలుగా శోభించింది. ముఖ్యంగా శ్లేష కవిత్వంలో అందెవేసిన చేయి. ఒక్క సాహిత్యమే కాదు! సంగీతంలోనూ, జ్యోతిషం లోనూ నిష్ణాతుడనిపించుకొన్నారు.



పండితప్రకాండుడైన భట్టుమూర్తి వీధులలో వెడుతున్నప్పుడు వేదపండితులు సైతం వేదాల్ని వల్లించేవారు కాదట. ఎక్కడ తప్పుదొర్లి భట్టుమూర్తి కంటిలో పడవలసి వస్తుందేమోనని సందేహించేవారట. జనశ్రుతిలో 'అట'గా నున్న దీనిని పుట్టపర్తి వారు తమ పుస్తకం 'వసుచరిత్ర–సాహితీ సౌరభం' లో పేర్కొన్నారు. ఏది ఏమైనా అంతటి పుంభావసరస్వతి భట్టుమూర్తి. ఈ వసుచరిత్ర ఆవిర్భవించాక– ఇదే ఫక్కీలో మరికొన్ని పిల్ల వసుచరిత్రలు శ్రీకారం చుట్టుకున్నాయి. వసుచరిత్రకు వ్యాఖ్య రాసిన ఉద్దండ పండితులు శిష్టు కృష్ణమూర్తి– కావ్యంలో ఒక్కొక్కచోట ఎనిమిది అర్థాలు కూడా చూపించారు. ఇతర భాషాకవులు కూడా ఈ కావ్యాన్ని అనువదించకుండా ఉండలేకపోయారు. సంస్కృతంలో కాళహస్తి కవి, తమిళంలో అంబలత్రాడు మయ్యన్, కన్నడంలో లక్ష్మీశుడు, మరాఠీలో గుండేరావు హర్కారే, ఆంగ్లంలో కావలి వెంకటరామస్వామి అనువాదకులుగా ఉన్నారు.

భట్టుమూర్తి మరికొన్ని గ్రంథాల్ని వెలయించారు. నరసభూపాలీయం (కావ్యాలంకార సంగ్రహం), హరిశ్చంద్రనలోపాఖ్యానం (ద్వ్యర్థికావ్యం) రామరాజభూషణుని పాండితీప్రకర్షకు పతాకస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చాయి. పైగా దానశీలి. దేవాలయాలు, సరస్సులూ నిర్మించారు.

ఈ 'వసుచరిత్ర' ప్రబంధం ఆవిర్భవించి నాలుగువందలేండ్లయిన సందర్భంగా 1973 ప్రాంతంలో భీమవరం శ్రీరామరాజభూషణ సాహిత్యపరిషత్తు వారొక సభను ఘనంగా నిర్వహించారు. అదే స్ఫూర్తితో వసుచరిత్ర చతుశ్శతజయంతి మహోత్సవం 1973, డిసెంబర్ 25న ఈ వ్యాసకర్త ప్రధాన కార్యదర్శిగా ఉన్న తాడేపల్లిగూడెం తెలుగు సాహితీ సమాఖ్య పక్షాన నిర్వహించారు. ఆనాటి సభను డా. బెజవాడ గోపాలరెడ్డి, డా. బిరుదురాజు రామరాజు, డా. పసల సూర్యచంద్రరావు, కనమలూరి వెంకటశివయ్య ప్రభృతులు అలంకరించగా, ఘంటసాల వారు ప్రధాన భూమిక పోషించారు. అప్పటికే వారు అస్వస్థులుగా ఉన్నారు. అయినా 'సంగీతకళా రహస్యనిధి' రామరాజభూషణుని పట్ల భక్తిభావంతో వారు విచ్చేసి వ్యాసపీఠంపై వసుచరిత్ర ప్రబంధాన్ని ఉంచి పూజ చేశారు. కరుణశ్రీ "పుట్ట బోయెడి బుల్లిబుజ్జాయి కోసమై..." అనే పద్యం గానం చేశారు. సభానంతరం 'గిరికావసురాజీయం' రూపకం ప్రదర్శితమైంది. అదొక రసాత్మక సన్నివేశం. వసుచరిత్రలో కొన్ని పద్యాల్ని వీణపై వాయించేవారట. "లలనాజనాపాంగ.." మొదలైన పద్యాలు చదువుతుంటేనే సంగీతం మనకు వినిపిస్తుంది. అదీ భట్టుమూర్తిలోని సంగీతకళా రహస్యం. ఈ కవి గురించి జాషువా ఏమన్నారో చూడండి.

"దాటవశంబుగాని కవితానియోమోన్నత భిత్తికత్ నిరాఘాటి జవంబున న్నెగసి గంతులు వెట్టెడు నీదు శ్లేషవాగ్ధాటికి పెద్దనాది కవిదంతులు తత్తరమందలేదె! ఆ నాటికి నేటికింక నొకనాటికి నీకెదురేది సత్కవీ!"

○ రసరాజు

(రేపు– విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్ర ప్రాంగణంలో రామరాజభూషణుని

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

'సీమ' ప్రాజెక్టులపై ఎందుకంత ద్వేషం?

'కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించబోమని' ఫిబ్రవరి 12న తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించారు. ఈ తీర్మానంపై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ సభ్యులు పోటీపడి రాయలసీమ ప్రాజెక్టులపై విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామరస్య పద్ధతిలో ఒక ప్రజాస్వామ్య విధానంతో నీటి సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు భావించారు. వాస్తవానికి గతంలో కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వం.. రాయలసీమ ప్రాజెక్టులను తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తూ వచ్చారు. తెలంగాణ సమాజంలో నీళ్ల సెంటిమెంటును ఒక తీవ్ర స్థాయికి తీసుకెళ్లారు. కేసీఆర్ కంటే మేమింకా ఎక్కువ వ్యతిరేకిస్తున్నామని నిరూపించుకోవటానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తున్నది.

ఈ తీర్మానంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో సీపీఐ పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ "2014 విభజన చట్టంలోనే కృష్ణా, గోదావరి జలాలపై కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణపై ప్రొవిజన్ పెట్టారు. అప్పుడెందుకు వ్యతిరేకించలేదని, కృష్ణాజలాలలో 50–50 వాటా కావాలని ఎందుకు అడగలేదని... ఆత్మపరిశీలన చేసుకోవాలని" అన్నారు. అయితే కూనంనేని కూడా పోతిరెడ్డిపాడు కాలువ విస్తరణను వ్యతిరేకించారు. కూనంనేని అన్నట్లు విభజన సందర్భంగా ఆ రోజు కాంగ్రెస్ కాని టీఆర్ఎస్ కాని ఎందుకు వ్యతిరేకించలేదు?

కృష్ణా, గోదావరి నదీ జలాలు నిర్వహణ, అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం విధి, విధానాలను రూపొందించి విభజన చట్టంలో పొందుపరిచింది. సెక్షన్–84: గోదావరి, కృష్ణానది జలవనరుల నిర్వహణకు అపెక్స్ కౌన్సిల్: బోర్డు పనిని పర్యవేక్షించడం కోసం కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తుంది. సెక్షన్–85: రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు విధులు: రాష్ట్రం ఏర్పాటైన 60 రోజుల్లోగా ప్రస్తుత, భవిష్యత్తులో వచ్చే ప్రాజెక్టులకు పరిపాలన, క్రమబద్ధీకరణ, నిర్వహణ పనితీరు పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం విడిగా గోదావరి జలనిర్వహణ బోర్డు, కృష్ణానది నిర్వహణ బోర్డును ఏర్పాటు చేస్తుంది. ఈ బోర్డులు కేంద్ర ప్రభుత్వం పరిపాలనా నియంత్రణలో స్వయం ప్రతిపత్తి గల సంస్థలుగా పనిచేస్తాయి. 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న సూత్రాల ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం అప్పగించే ఇతర కర్తవ్యాలను కూడా ఇవి నిర్వహిస్తాయి. 11వ షెడ్యూల్ సెక్షన్–85(7)(ఇ) నీటి నిర్వహణ మండళ్ల విధానాలు, నీటి లభ్యత ఆధారంగా కృష్ణా వాటర్ డిస్‌ప్యూట్స్ ట్రిబ్యునల్–2, చేసిన కేటాయింపుల ఆధారంగా కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ నోటిపై చేసే నిర్వహణ ఏర్పాట్లకు రెండు రాష్ట్రాలు కట్టుబడి ఉండాలి. కృష్ణా–గోదావరి నదులపై ప్రాజెక్టులకు అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు ట్రిబ్యునళ్ళు ఇప్పటికే కేటాయించిన నికరజలాల్లో ఎలాంటి మార్పు ఉండరాదు. (డి) గోదావరి, కృష్ణా నదులపై ఇప్పటికే నిర్మించిన, నియమిత తేదీ నాటికి చేపట్టిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపులకు నష్టం కలగలదనీ, జల వివాద ట్రిబ్యునల్ కేటాయింపులకు భంగం కలగకూడదు. (పార్లమెంటు ఆమోదించిన ఈ విభజన చట్టం ప్రకారం బచావత్ నీటి కేటాయింపులను మార్చడానికి వీలులేదు. కాబట్టి కృష్ణా జలాలపై కేంద్ర ప్రభుత్వం వేసిన కొత్త ట్రిబ్యునల్ చట్టవిరుద్ధం) సెక్షన్ 86– రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సిబ్బంది ఏర్పాటు. సెక్షన్–87: రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు పరిధి: ఈ బోర్డు పరిధి గోదావరి, కృష్ణానదులకు విస్తరించి ఉంటుంది. ప్రాజెక్టులు, బ్యారేజీలు డ్యామ్‌లు, రిజర్వాయర్లు, నిర్మాణాలు, నీటిని విడుదల చేసే వ్యవస్థలో కాలువలు, విద్యుత్ పంపిణీ లైన్లు మొదలైనవి ఈ బోర్డు పరిధిలో ఉంటాయి. సెక్షన్–88: రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అధికారం: చట్టం ప్రకారం బోర్డుకు అవసరమైన నియమనిబంధనలు రూపొందించుకోవచ్చు. సెక్షన్–89: నీటివనరుల కేటాయింపులు: (ఎ) ఇప్పటివరకు ట్రిబ్యునల్ కూడా కేటాయింపులు చేయని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేస్తుంది. (బి) నీటి ప్రవాహం తగ్గిన సందర్భంలో ఆయా ప్రాజెక్టుల వారీగా నీటి విడుదలకు విధి విధానాలను నిర్ణయిస్తుంది.

దీనికి సంబంధించి ముసాయిదా బిల్లును 2013 డిసెంబర్ 16న ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత లోక్‌సభ, రాజ్యసభలలో బిల్లు ఆమోదానికి పెట్టారు. ఈ ముసాయిదా బిల్లులో రాయలసీమ ప్రాజెక్టుల ప్రస్తావన లేనందున "విభజన వల్ల రాయలసీమ ప్రయోజనాల కోసం కృష్ణానదిపై నిర్మించిన నీటి ప్రాజెక్టులు దెబ్బతింటాయని" వెంకయ్యనాయుడు.. కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ దృష్టికి తీసుకెళ్ళడం వల్ల విభజన చట్టం 11వ షెడ్యూల్‌లో హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరునగరి, వెలిగొండ, కల్వకుర్తి, నెట్టెంపాడు... ఈ ఆరు ప్రాజెక్టులను చేర్చారు. ఈ సందర్భంగా తెలంగాణలోని టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సహా ఏ రాజకీయ పార్టీ కూడా ఎస్ఎల్‌బీసీ, పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులను విభజన చట్టంలో చేర్చాలని డిమాండ్ చెయ్యలేదు. బిల్లు ఆమోదం తర్వాతనైనా పార్లమెంటులో చర్చచేసి తెలంగాణ ప్రాజెక్టులు, నీటిపంపకాలు, కృష్ణా జలాల్లో 50–50 వాటా కావాలని... అందుకు కొత్త ట్రిబ్యునల్ వేయమని ఎందుకు అడగలేదు? ఈ రోజు ఇంత రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాడు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉంది, మరి ఆ పార్టీ ఎందుకు అడగలేదు? కృష్ణా, గోదావరి బోర్డులను కేంద్రం ఆధీనంలో పనిచేయాలని విభజన చట్టంలో పెట్టింది తమ పార్టీయేనని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరిచిపోయినట్టుంది.

వాస్తవానికి తెలంగాణలోని దక్షిణ ప్రాంతానికి, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతానికి కృష్ణాజలాల్లో అన్యాయం జరిగిన మాట వాస్తవం. ఈ రెండు ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించకపోవటం వల్ల ట్రిబ్యునళ్లలో అన్యాయం జరిగింది. దానికి కారణం పాలకుల నిర్లక్ష్యం. అందుకోసం రాయలసీమను బలిచేయడం, రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లు రాకుండా పదే పదే తెలంగాణలోని పార్టీలు అడ్డుకోవటం న్యాయం కాదు. తెలంగాణ దక్షిణ ప్రాంతానికి, రాయలసీమకు కృష్ణా జలాలలో న్యాయం జరిగే విధంగా, రెండు రాష్ట్రాలు కూర్చుని సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోచ్చు. అందుకు 'అపెక్స్' కౌన్సిల్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పరచింది. అలాకాకుండా కృష్ణాబేసిన్ బయట ప్రాంతమైన రాయలసీమకు కృష్ణా జలాలు తరలించకూడదని, తెలంగాణ రాజకీయ నాయకులు వితండవాదానికి దిగడం సరైనది కాదు. జాతీయ, అంతర్జాతీయ జలచట్టాలలో ఎక్కడా కూడా అలాంటి నియమ నిబంధనలు లేవు. ఈ అంశానికి సంబంధించి మొదటి బచావత్ ట్రిబ్యునల్ ముందు కృష్ణానది బేసిన్ బయట ఉన్న రాయలసీమ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయకూడదని కర్ణాటక రాష్ట్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అభ్యంతరాన్ని బచావత్ ట్రిబ్యునల్ కొట్టివేస్తూ రాయలసీమ ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయిస్తూ తీర్పు ఇచ్చింది. ఒక నదీ బేసిన్‌లోని నీటిని ఏ ప్రాంతానికైనా తరలించవచ్చునని పేర్కొన్నది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కూడా స్పష్టం చేశాయి.

తెలంగాణలోని అన్ని పార్టీలూ రాయలసీమ ప్రాజెక్టులను ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? ఈ ప్రాజెక్టులు ఏవి కొత్తవి కాదు. ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు 1983లో తెలుగుగంగ, 1988లో హంద్రీనీవా, గాలేరు నగరి, ప్రాజెక్టులు ప్రారంభించారు. వీటితో పాటు ప్రకాశం జిల్లాకు వెలిగొండ, తెలంగాణకు కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు కృష్ణానది మిగులు జలాలపై నిర్మించినవి. రాయలసీమలోని ప్రాజెక్టులకు మిగులు జలాలను, వరద జలాలను తరలిస్తున్నారు. పోతిరెడ్డిపాడు కాలువ వెడల్పు, రాయలసీమ పంపింగ్ స్కీం పథకాలకు నీటిని ఆంధ్రప్రదేశ్ వాటాకు లోబడే తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణానదిలో వరదలు వచ్చే 30, 40 రోజుల్లోనే నీటిని ఎత్తిపోసుకొని నిలువ చేసుకోవాలి. అందుకు తగిన విధంగా కాలువ వెడల్పు చేసుకోవటం, కొత్త కాలువలు నిర్మించటం జరగాలి. తీవ్ర కరువు ప్రాంతమైన రాయలసీమకు వరద జలాలు తరలించుకుంటే తెలంగాణ రాజకీయ నాయకులకు ఎందుకంత వ్యతిరేకత? ఒకవేళ నికర జలాలు తీసుకున్నా ఆంధ్రప్రదేశ్ వాటాగా వచ్చే నీటిలోనే రాయలసీమ ప్రాజెక్టులకు చట్టబద్ధంగానే నీటిని తరలిస్తారు. కొంచెమైనా మానవత్వం లేకుండా, తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రజల సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవటాన్ని తెలంగాణ మేధావులు ఖండించాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించడానికి కృషి చేయాలి.

తీవ్ర కరువుప్రాంతమైన రాయలసీమకు వరద జలాలు తరలించుకుంటే తెలంగాణ రాజకీయ నాయకులకు ఎందుకంత వ్యతిరేకత? ఒకవేళ నికరజలాలు తీసుకున్నా ఆంధ్రప్రదేశ్ వాటాగా వచ్చే నీటిలోనే రాయలసీమ ప్రాజెక్టులకు చట్టబద్ధంగా నీటిని తరలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మానవత్వం లేకుండా, తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రజల సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవటాన్ని తెలంగాణ మేధావులు ఖండించాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించడానికి కృషి చేయాలి.



▪ మాయకుంట్ల శ్రీనివాసులు

ఏడు వాహనాలపై మలయప్ప విహారం

▸▸ తిరుమలలో కనుల పండువగా రథసప్తమి



చక్రస్నాన వేడుక, చంద్రప్రభ వాహనంపై మలయప్ప

తిరుమల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వరుడు ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు ప్రధాన వాహనాలెక్కి ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తకోటిని అనుగ్రహించారు. ఒకే రోజు ఏడు వాహనసేవలతో పాటు చక్రస్నానం కూడా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గురువారం సాయంత్రం నుంచే గ్యాలరీల్లో భక్తుల రాక మొదలైన నేపథ్యంలో అర్ధరాత్రికే మాడవీధులు దాదాపుగా నిండిపోయాయి. శుక్రవారం వేకువజామున 5.30గంటలకు వాహన మండపం నుంచి సూర్యప్రభ వాహనంలో మలయప్ప స్వామి బయల్దేరి వాయవ్య మూలకు వేంచేశారు. సరిగ్గా 6.42 గంటలకు సూర్యకిరణాలు స్వామిని తాకడంతో అర్చకులు శాస్త్రోక్త కైంకర్యాలు జరిపించారు. అనంతరం చిన్నశేష, గరుడ, హనుమ వాహనాలపై స్వామివారు విహరించారు. మధ్యాహ్నం పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. సాయంత్రం కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై స్వామివారు విహరించారు. రాత్రి జరిగిన చంద్రప్రభ వాహన విహారంతో సేవలు ముగిశాయి.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ దుర్గాప్రసాదరావు శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. సూర్యప్రభవాహనసేవలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.



తిరుమల ఆలయం ముందుజస్టిస్ దుర్గాప్రసాద్, జస్టిస్ రవీంద్రబాబు



పింగళి మనవడు నరసింహం దంపతులను సత్కరిస్తున్న గవర్నర్ నజీర్

జగ్గయ్యపేటలో 150 అడుగుల

జాతీయపతాక స్తూపం

ఆవిష్కరించిన గవర్నర్ నజీర్



జాతీయపతాక స్తూపం ఆవిష్కరణలో గవర్నర్

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 16: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పుట్టిన ప్రాంతంలో 150 అడుగుల జాతీయపతాక స్తూపాన్ని ఆవిష్కరించటం ఎంతో గర్వంగా ఉందని రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఆయన శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట తిరంగా పార్క్‌లో నిర్మించిన 150 అడుగుల జాతీయపతాక స్తూపాన్ని ఆవిష్కరించి, త్రివర్ణపతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగిస్తూ పింగళి వెంకయ్య రూపొందించిన మువ్వన్నెల జెండా దేశ ప్రజలను ఐక్యం చేసిందని అన్నారు. పంజాబ్‌లో అటారి-వాఘా సరిహద్దులో 418 అడుగుల జాతీయపతాక స్తూపం దేశంలో అతి పెద్దదని, ఇప్పుడు రెండో స్తూపాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశం ఆజాదికా అమృతోత్సవాల వేళ ప్రధాని మోదీ ఘర్ ఘర్‌గా తిరంగా కార్యక్రమంతో దేశభక్తి స్ఫూర్తిని రగిలించారని, 2047 నాటికి వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే నాటికి వికసిత భారత్ సంకల్పం చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య మనవడు జీవీ నరసింహం దంపతులను సత్కరించారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, విజయవాడ ఎంపీ కేసినేని నాని, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్నకు స్వర్ణరథం సేవలు

▸▸ కానుకగా ఇచ్చిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి



శ్రీశైలం, ఫిబ్రవరి 16: శ్రీశైలం మల్లికార్జున స్వా మి, భ్రమరాంబ దేవిలకు నెల్లూరు జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కానుకగా ఇచ్చిన స్వర్ణరథాన్ని శుక్రవారం ఉదయం ఆలయ అధికారులు ప్రారంభించారు. ముందుగా స్వర్ణరథానికి సంప్రోక్షణ, పూజాధికాలను నిర్వహించారు. అనంతరం శివపార్వతులను స్వర్ణరథంపై అధిష్ఠింపజేసి ప్రధాన ఆలయం రాజగోపురం నుంచి నందిగుడి వరకు అక్కడి నుంచి ప్రధానాలయం వరకు ఊరేగించారు. స్వర్ణరథం విలువ రూ.11 కోట్లు ఉంటుందని సమాచారం.

ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల భద్రతకు చర్యలు చేపట్టాలి

▸▸ ఆర్టీసీ ఎండీకి ఏపీపీటీడీ ఈయూ లేఖ

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న 7 వేల మంది పైచిలుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. సంస్థలో అనేక విభాగాలలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా.. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కంటే కూడా జీతాలు దారుణంగా ఉన్నాయన్నారు. ఆర్టీసీలో ఇప్పటికీ థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ ద్వారా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను భర్తీ చేసుకుంటున్నారని, ఈ విధానం వల్ల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతున్నారని అన్నారు. కాంట్రాక్టర్ సమయానికి జీతాలు ఇవ్వటం లేదని, స్కిల్డ్ అన్‌స్కిల్డ్, సెమిస్కిల్డ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పేరుతో చెల్లిస్తున్న జీతాలు యథావిధిగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చేరడం లేదన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఒక లేఖను అందించారు.

దసరాకు వస్తున్న దేవర



తన మాస్ అవతార్‌తో జూనియర్ ఎన్టీఆర్ మరో సారి సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'దేవర'కు సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం తొలి భాగాన్ని దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదల చేయనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ నెట్టింట అభిమానులను అలరిస్తోంది. ఈ పోస్టర్ చూస్తుంటే యాక్షన్ సీన్లు హై లెవల్‌లో ఉంటాయనీ, ఎన్టీఆర్‌ను మరింత మాస్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారనీ అర్థమైంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు కొరటాల శివ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ ఈ సినిమా నిర్మిస్తున్నారు. సంగీతం:అనిరుధ్, ఛాయాగ్రహణం: రత్నవేలు, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: సాబు సిరిల్.



యుద్ధరంగానికి సిద్ధం

ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కాంబినేషన్‌లో వస్తున్న బాలీవుడ్ మల్టీస్టారర్ 'వార్ 2' చిత్రం వచ్చే వారం సెట్స్‌పైకి వెళ్లనుంది. శుక్రవారం చిత్రయూనిట్ ఈ విషయాన్ని ప్రకటించింది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ గతంలో నటించిన 'వార్' చిత్రానికి ఇది సీక్వెల్. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవలే జిమ్‌లో గాయ పడిన హృతిక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. 'వార్ 2' షూటింగ్ మొదలైతే ఇక నాకు ఊపిరి తీసుకునే గ్యాప్ కూడా ఉండదేమో' అని హృతిక్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. వచ్చే ఏడాగి ఆగస్టు 14న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు.

ఆయనకి 70.. ఆవిడకు 65

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్, అలనాటి అందాల తార జయప్రద ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'లవ్ • 65'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ అందిస్తున్న ఈ హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు వి.ఎన్.ఆదిత్య దర్శకత్వం వహిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల ఈ చిత్రానికి సహ నిర్మాత. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఆయనకి 70



ఏళ్లు నిండాయి. ఆవిడకి 65 ఏళ్లు దాటి ఉంటాయి. ఈ ఇద్దరూ కాలనీ నుంచి పారిపోయే ఆసక్తికరమైన సన్నివేశంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పోలీసుల విచారణలో వారు ఒకరినొకరు ప్రేమించుకున్నారనీ, జీవితాంతం తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నారనీ తేలుతుంది. వినోదంతో పాటు మనసుని కదిలించే భావోద్వేగాలు చిత్రంలో ఉన్నాయని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన, క్రిష్, నిహంత్రీ రెడ్డి, నారాయణ రావు, ప్రదీప్, సాయి శ్రీనివాస్, ప్రీతీ నిగమ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. అజయ్, సునీల్ ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తారు. త్వరలో విడుదలయ్యే ఈ చిత్రానికి కథ: సుధీర్ చింటూ, మాటలు: లక్ష్మీ భూపాల, సంగీతం: అనూప్ రూబెన్స్, ఎడిటింగ్: జునైద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కొల్లి సుజిత్‌కుమార్.

టాలీవుడ్‌లో హీరోయిన్లకు గౌరవం లేదు

- రాధికా ఆప్టే



వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో ఉండే బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే హీరోయిన్ల పట్ల తెలుగు సినీ రంగం వ్యవహార శైలిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ టాలీవుడ్ పరిశ్రమలో హీరోయిన్లకు ఎలాంటి గౌరవం ఉండదని అన్నారు. హీరోయిన్లను అపరిచితుల్లాగా చూస్తారనీ, సినిమాల్లో మహిళా పాత్రలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదని చెప్పారు. హీరో కన్నా రెండు గంటలు ముందే షూటింగ్ స్పాట్‌లో ఉండాలి, ఇండస్ట్రీలో పురుషాధిపత్యం ఎక్కువ, కనీస సమాచారం ఇవ్వకుండా వాళ్లకు నచ్చినట్లు షూటింగ్స్ క్యాన్సిల్ చేయడం వల్ల చాలా సార్లు ఇబ్బందిపడ్డాను అని ఆరోపించారు. అందుకే అప్పటి నుంచి తెలుగు సినిమాలకు నా అవసరం లేదు అని భావించి దూరమయ్యాను అని రాధిక చెప్పారు.

నష్టపరిహారం చెల్లించండి



తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహించిన 'కీడా కోలా' చిత్రబృందానికి ఎస్పీ చరణ్ లీగల్ నోటీసులు పంపారు. అనుమతి లేకుండా తన తండ్రి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గొంతును ఏఐ టెక్నాలజీ ద్వారా రీ క్రియేట్ చేసి వాడుకున్నందుకు 'కీడాకోలా' యూనిట్, సంగీత దర్శకుడు వివేక్ సాగర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి జనవరిలోనే నోటీసులు పంపినట్లు ఆయన తెలిపారు. 'మా నాన్న గొంతుకు జీవం పోసిన ఏఐ టెక్నాలజీని స్వాగతిస్తున్నాం. ఇలా చేసేముందు మా అనుమతి తీసుకొని ఉండాల్సింది. వ్యాపారం కోసం ఇలాంటి పనులు చేయడం సమంజసం కాదు' అని ఆయన పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఒక గొప్ప వ్యక్తి గొంతును ఉపయోగించుకోవడం చట్ట విరుద్ధమన్నారు. ప్రతిగా తమకు క్షమాపణలు చెప్పడంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

డిఫరెంట్ థ్రిల్లర్

మోహన్ భగత్, సుప్రీత, సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రలు పోషించిన 'ఆరంభం' చిత్రం టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేశారు. అజయ్ వి నాగ్ దర్శకత్వంలో అభిషేక్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ 'థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్ కలిగిన 'ఆరంభం' టీజర్ ఆసక్తికరంగా ఉంది. కొన్ని క్యారెక్టర్స్ లో గ్రే షేడ్స్ ఉన్నాయి. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ కొత్తగా ఉన్నాయి' అంటూ



టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఇప్పటిదాకా వినని ఓ కథ చెబుతానంటూ ఓ మహిళ చెప్పే కథతో ఈ టీజర్ మొదలైంది. రామాయణం స్టోరీని కొంత నేరేట్ చేసి ఈ చిత్రకథలోకి వెళ్లి జైలు, ఒక కేసు వివరాలు, ఇతర క్యారెక్టర్స్ చూపించారు. ఇవన్నీ సినిమాపై ఆసక్తి కలిగించాయి.. త్వరలోనే 'ఆరంభం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తామని టీమ్ చెప్పింది. ఈ చిత్రానికి మాటలు: సందీప్ అంగడి, సంగీతం: సింజిత్ యర్రమిల్లి, సినిమాటోగ్రఫీ: దేవ్ దీప్ గాంధీ కుండు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వినయ్ రెడ్డి మామిడి.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు తనయుడు!

హాస్య చిత్రాల దర్శకుడిగా తనకుంటూ ఓ ప్రత్యేక బాణీ ఏర్పరచుకున్న ఇ.వి.వి సత్యనారాయణ చాన్నాళ్ల క్రితం 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రాన్ని తీశారు. రాజేంద్రప్రసాద్ హీరోగా నటించిన ఆ హిలేరియస్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను తెగ నవ్వించింది. ఇప్పుడు ఇవీవీ తనయుడు నరేశ్ తన 61 చిత్రానికి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ రిపీట్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని సీరియస్



పాత్రలను పోషించిన నరేశ్ మళ్లీ ఇప్పుడు కామెడీ బాట పట్టారు. కొత్త దర్శకుడు మల్లి అంకం రూపొందిస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌ను రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాత. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ గ్లింప్స్ శుక్రవారం విడుదల చేశారు. చిత్రంలో నరేశ్ పాత్ర పేరు గణ. అందరూ తన పెళ్లి గురించి అడుగుతుంటే 'ఆ ఒక్కటీ అడక్కు' అని వారికి సమాధానమిస్తుంటారు. పెళ్లి అనేది పాన్ ఇండియా సమస్య అని చెబుతారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, జానీ లివర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మార్చి 22న విడుదలయ్యే ఈ చిత్రానికి రచన: అబ్బూరి రవి, ఫొటోగ్రఫీ: సూర్య, సంగీతం: గోపీసుందర్.



సందెవేళ సాంగ్


శాంతి చంద్ర, దీపికా సింగ్, స్మ్రితి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జీఎస్ బాబు నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం నుంచి 'సందెవేళ' అంటూ సాగే రొమాంటిక్ గీతాన్ని దర్శకుడు సాయిరాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీఫెలో' సినిమా వినూత్న కథతో తెరకెక్కుతోంది. సినిమా సూపర్ హిట్టవ్వాలి' అని ఆకాంక్షించారు. హీరో మాట్లాడుతూ 'సినిమాకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తయాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డాక్టర్ సతీష్ కుమార్ పి. సినిమాటోగ్రఫీ: రామకృష్ణ ఎస్. ఎడిటర్: జేపీ.

'రాజధాని ఫైల్స్'కు గ్రీన్ సిగ్నల్

• తాత్కాలిక స్టే ఎత్తివేసిన హైకోర్టు

ఏపీ రాజధాని అమరావతి కథాంశంగా నిర్మించిన 'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై గురువారం విధించిన తాత్కాలిక స్టేను ఎత్తివేసింది. సినిమా ప్రదర్శనకు సెన్సార్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) సినిమాటోగ్రఫీ చట్ట నిబంధనలకు లోబడే సర్టిఫికెట్ ఇచ్చిందని స్పష్టం చేసింది. సినిమా సర్టిఫికేషన్‌కి సంబంధించి ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీలు సమర్పించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. అన్ని అంశాలను పరిశీలించి తగిన కారణాలతో సర్టిఫికెట్ జారీ చేసిన నేపథ్యంలో దీనిపై జోక్యం చేసుకోలేమని కోర్టు పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. జయసూర్య శుక్రవారం ఆదేశాలిచ్చారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)





'పొట్టేల్' కోసం మాస్ సాంగ్

గ్రామీణ నేపథ్యంలో కొత్త కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో సురేశ్ కుమార్ సడిగే, నిశాంక్ రెడ్డి కుడితి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ 'నాగిరో' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా కాసర్ల శ్యామ్ రాసిన విలేజ్ మాస్ సాంగ్ 'వవ్వరే'ను శుక్రవారం విడుదల చేశారు. రాహుల్ సిప్లిగంజ్ పాడిన పాట ఇది. ఇందులో హీరో యువచంద్ర కృష్ణ తన డ్యాన్సింగ్ స్కిల్స్ చూపించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.



దర్శకుల సంఘానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో దర్శకుడు వీరశంకర్, ఆయన ప్యానెల్ విజయం సాధించింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు వీరశంకర్, ఆయన కార్యవర్గ సభ్యులు రథ సప్తమి సందర్భంగా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తమ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు పరిచేవిదంగా కార్యాచరణ ప్రారంభించామనీ, సంఘాన్ని మరింత అభివృద్ధి పరుస్తామనీ అధ్యక్షుడు వీరశంకర్ చెప్పారు.

నగరం గజగజ..!

నగరాన్ని మంచు దుప్పటి కప్పేసింది. రథసప్తమి రోజు బారెడు పొద్దెక్కినా సూర్యుడు కనిపించలేదు. పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9.30 గంటలైనా మంచు కురుస్తుండటంతో స్కూళ్లకు, ఆఫీసులకు వెళ్లేవారు అవస్థలు పడ్డారు. ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గమ్మ వారధి వద్ద మంచు భారీగా కమ్మేసింది.



మేయర్ మారేనా..?

ఎన్నికల వేళ వెలంపల్లి మార్కు రాజకీయం

ఓడ మల్లన్న.. బోడి మల్లన్న.. సామెత చందంగా ఉంది పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తీరు. పశ్చిమలో తన వ్యాపకాల కోసం 2021 కార్పొరేషన్ ఎన్నికల అనంతరం ఎందరో ఆశావహులను పక్కనపెట్టి రాయన భాగ్యలక్ష్మికి మేయర్ పీఠాన్ని అప్పజెప్పిన ఆయన ఇప్పుడు సెంట్రల్‌లో తన సీటు నిలుపుకోవడం కోసం అదే మేయర్ సీటుకు ఎసరు పెడుతున్నారని తెలుస్తోంది. సెంట్రల్ నియోజకవర్గంలో బలంగా ఉన్న 'అవుతు' కుటుంబాన్ని తమవైపు తిప్పుకొనేందుకు మేయర్ మార్పు వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారన్న ఊహాగానాలు ఇప్పుడు నగరంలో చక్కర్లు కొడుతున్నాయి.

- రాయన భాగ్యలక్ష్మి అవుట్.. సీన్‌లోకి అవుతు శైలజారెడ్డి
- పశ్చిమలో పనైపోయింది.. ఇక సెంట్రల్ వైపు..
- 'అవుతు' కుటుంబాన్ని ఆకర్షించేందుకు లోపాయికారి ఒప్పందం
- ఆశావహులను కాదని.. సొంత ప్రయోజనాలకే పెద్దపీట





రాయన భాగ్యలక్ష్మి



అవుతు శైలజారెడ్డి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు రాజకీయానికి మరో భారీ వికెట్ బలికానుంది. తన సొంత లాభం కోసం మేయర్ రాయన భాగ్యలక్ష్మి సీటుకు ఎసరు పెట్టేందుకు వెలంపల్లి సిద్ధమవుతున్నారు. వెలంపల్లిని పశ్చిమ నుంచి సెంట్రల్ అభ్యర్థిగా బదిలీ చేసిన నేపథ్యంలో అక్కడి కేడర్ మొత్తాన్ని తన వెంట తీసుకెళ్లిన వెలంపల్లి తాజాగా సెంట్రల్‌లో కీలకంగా ఉన్న డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి సేవలను ఉపయోగించుకునేందుకు భాగ్యలక్ష్మి సీటుకు ఎసరు పెట్టనున్నారు.

తెరవెనుక పావులు

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 64 డివిజన్లకు గానూ 49 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్లు విజయం సాధించారు. ఆ సమయంలో పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు తన నియోజకవర్గం నుంచే మేయర్ అభ్యర్థి ఉండాలని పట్టుబట్టి రాయన భాగ్యలక్ష్మిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టారు. ఆమె పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 46వ డివిజన్‌లో గెలుపొందారు. అప్పట్లో మేయర్ సీటు కోసం సెంట్రల్ నియోజకవర్గంలోని 58వ డివిజన్ కార్పొరేటర్ అవుతు శైలజారెడ్డి, తూర్పు నియోజకవర్గంలోని 15వ డివిజన్ కార్పొరేటర్ బెల్లం దుర్గ పోటీ పడ్డారు. కుల సమీకరణాలు, వెలంపల్లి రాజకీయంతో చివరికి భాగ్యలక్ష్మికే ఆ భాగ్యం దక్కింది. మిగిలిన ఇద్దరికీ డిప్యూటీ మేయర్ పదవులతో సరిపెట్టారు. 2021, మార్చి 18న భాగ్యలక్ష్మి మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ఏడాది మార్చితో మూడేళ్ల పదవీకాలం పూర్తికానుంది. మరో రెండేళ్ల కాలానికి మేయర్ పీఠంపై అవుతు శైలజారెడ్డిని కూర్చోబెట్టే విధంగా వెలంపల్లి పావులు కదుపుతున్నారు.

ఇక పశ్చిమతో ఏం పని..?

వెలంపల్లికి ప్రస్తుతం పశ్చిమ నియోజకవర్గంతో పెద్దగా పనిలేదు. అక్కడి వైసీపీ కేడర్‌ను సెంట్రల్‌లో తిప్పుతున్నారు. వారికే డివిజన్ ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగించారు. దీంతో స్థానికంగా ఉండే కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు వెలంపల్లిపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ టికెట్ మల్లాదికి దక్కదని తెలిసినప్పటి నుంచి అవుతు శైలజారెడ్డి భర్త శ్రీనివాసరెడ్డి వైసీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. చివరికి వెలంపల్లి రాజకీయం ముందు ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ పరిస్థితుల్లో సెంట్రల్ నియోజకవర్గంలో బలమైన వర్గంగా ఉన్న అవుతు వర్గాన్ని మచ్చిక చేసుకునేందుకు వెలంపల్లి తన రాజకీయానికి పదునుపెట్టారు. అవుతు శైలజారెడ్డిని చివరి రెండేళ్లు మేయర్ పీఠంపై కూర్చోబెట్టే బాధ్యత తనదని, తన గెలుపు కోసం పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆయన అవుతు కుటుంబంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ఒప్పందం ఫలితంగానే అవుతు కుటుంబం పూర్తిస్థాయిలో వెలంపల్లి వెనుక తిరుగుతున్నారని చెబుతున్నారు.

ఆశావహులను కాదని..

వైసీపీ తరఫున మేయర్ అభ్యర్థిగా బండి పుణ్యశీల పేరు అప్పట్లో ప్రచారంలోకి వచ్చింది. కానీ, వెలంపల్లి రాజకీయం కారణంగా తొలి నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న పుణ్యశీలకు మేయర్ సీటు అందని ద్రాక్షగా మిగిలిపోయింది. గడిచిన పాలకవర్గంలో ఐదేళ్ల పాటు నగర పాలక సంస్థకు వైసీపీ తరఫున ఫ్లోర్‌లీడర్‌గా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. ఈ కారణంగానే పుణ్యశీలను మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేస్తారని అప్పట్లో అంతా భావించారు. అలాగే, మేయర్ సీటుపై పగిడిపాటి చైతన్యరెడ్డి కూడా ఆశలు పెంచుకున్నారు. వీరందరినీ కాదని వెలంపల్లి.. రాయన భాగ్యలక్ష్మి వైపు మొగ్గుచూపి ఆమెను అందలం ఎక్కించారు. ఇప్పుడు తన స్వలాభం కోసం మళ్లీ ఆమెను అందలం దించే ప్రయత్నం చేస్తున్నారు.



నగరంలో రైతులు, కార్మికుల భారీ ప్రదర్శన

అన్నదాతల ఆగ్రహం

- జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా గ్రామీణ బంద్
- నగరంలో రైతులు, కార్మికుల భారీ ప్రదర్శన

దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె రెండు జిల్లాల్లోనూ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. పలు కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించగా, గ్రామాల్లోనూ రైతులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 6లో..



బిగిసిన పిడికిలి

మూడోరోజూ కొనసాగిన ఉద్యోగుల ఆందోళనలు

- రవాణా శాఖ కార్యాలయంలో ధర్నా
- ప్రభుత్వాసుపత్రులు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు

ఉద్యోగులు దాచుకున్న డబ్బును వాడేసుకున్నారు.. అప్పులపాలు చేసి రోడ్డున పడేశారు.. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించటానికి దిగిరాకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.. అంటూ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ప్రభుత్వానికి ఇదే చివరి అవకాశమని, ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగులు విజ్ఞతతో తీసుకునే నిర్ణయానికి పశ్చాత్తాప పడినా ప్రయోజనం ఉండదన్నారు. ఉద్యమ శంఖారావం పిలుపులో భాగంగా మూడోరోజు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు రణభేరి మోగించారు. ధర్నాలతో అట్టుడికించారు. అన్ని మండల పరిషత్ ఆఫీసుల ఎదుట నిరసనలకు దిగారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై పోస్టర్లను ప్రదర్శిస్తూ ప్రభుత్వ తీరుపై నినదించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు జరిగాయి.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

- 6లో..

పార్కు గేటు పడి బాలుడి మృతి

మచిలీపట్నంలో దారుణం



బ్రహ్మపురంలోని పార్కు (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన బాలుడు దినేష్ (ఫైల్)

మచిలీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పార్కు గేటు కింద పడి తొమ్మిదేళ్ల బాలుడు మృతిచెందాడు. చిలకలపూడి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని డీఈవో కార్యాలయం ఎదురుగా బ్రహ్మపురంలో మునిసిపల్ పార్కు ఉంది. ఈ పార్కు పక్కనే వడ్డి లక్ష్మీకాంత్ కుటుంబం నివాసముంటోంది. లక్ష్మీకాంత్ రెండో కుమారుడు దినేష్‌కుమార్ (9) శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి ఆడుకునేందుకు పార్కు వద్దకు వెళ్లాడు. పార్కు ప్రధాన గేటును పట్టుకుని ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా గేటు ఊడి కింద పడిపోయింది. ఈ గేటు బాలుడిపై పడటంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. సంఘటనను చూసిన డీఈవో కార్యాలయ ఉద్యోగులు గాయపడిన బాలుడిని హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ మరణించాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి పోలీసులు తెలిపారు.

గవర్నర్ కార్యక్రమంలో విద్యార్థులకు అవస్థలు

ఏర్పాట్లు సరిగా చేయకపోవడంతో ఎండకు తాళలేక, మంచినీళ్లు లేక, కింద కూర్చోలేక ఇబ్బందులు - 6లో..



గురువారం అర్ధరాత్రి వేమవరం వద్ద అక్రమ తవ్వకాలు

'అక్రమార్జనకు సమయంతో పనేముంది.. పగలైతే అందరికీ సమాధానం చెప్పుకోవాలి.. దొంగచాటుగా వ్యవహారాలు నడపాలి.. అర్ధరాత్రయితే ఏ సమస్యా లేదు.. ఎవరికీ సమాధానం చెప్పుకోవాల్సిన పనీ లేదు..' అనుకుంటున్న మైనింగ్ మాఫియా అక్రమ తవ్వకాలకు అర్ధరాత్రి ముహూర్తాన్ని నిర్ణయించుకుంది. పేదలకు టిడ్కో ఇళ్లు నిర్మించి ఇద్దామని గత టీడీపీ ప్రభుత్వం జక్కంపూడి, వేమవరం ప్రాంతాల్లోని భారీ గోతులను గ్రావెల్‌తో చదునుచేయగా, ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన కొందరు ఆ గోతుల్లోని మట్టిని తవ్వి తీసుకెళ్లిపోతున్నారు. పగలైతే స్థానికులు అడ్డుకుంటున్నారని.. అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా రూ.కోట్ల విలువైన గ్రావెల్‌ను మింగేస్తున్నారు.

అర్ధరాత్రి అక్రమాలు

- పగలైతే గ్రామస్థులు అడ్డుకుంటున్నారని రాత్రిపూట..!
- అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోతున్న మాఫియా
- టిడ్కో ఇళ్ల నిర్మాణం నిమిత్తం పూడ్చిన గోతులపై కన్ను
- టీడీపీ హయాంలో భారీగా గోతుల పూడ్చివేత
- అందులోని గ్రావెల్‌ను తవ్వేస్తున్న మాఫియా
- గురువారం అర్ధరాత్రి అడ్డుకున్న స్థానికులు
- లెక్కచేయకుండా తవ్వకాలు జరిపిన అక్రమార్కులు
- తూతూమంత్రంగా దాడులు చేసిన అధికారులు

జక్కంపూడి, వేమవరంలో నిశిరాత్రిలో అక్రమ తవ్వకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలంలో టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు చదును చేసిన మట్టిని కూడా మైనింగ్ మాఫియా తన్నుకుపోతోంది. అది కూడా అర్ధరాత్రిపూట. పేద, మధ్య తరగతి వర్గాల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో జక్కంపూడి, వేమవరం కొండ ప్రాంతాల్లో టిడ్కో ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాల కోసం దిగువ ప్రాంతంలో ఉన్న గోతులను చదును చేయించారు. ఈ ప్రాంతంలో ఇళ్లు ఇంకా నిర్మించాల్సి ఉండగా, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పని చేయలేదు. పైగా గ్రావెల్‌ను తరలించుకుపో మని ఆ ప్రాంతాన్ని మైనింగ్ మాఫియాకు అప్పగించింది. మూడేళ్లుగా సాగుతున్న ఈ అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవటానికి జిల్లా యంత్రాంగానికి వెన్నులో వణుకు పుడుతోంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్లే మాఫియాకు అడ్డుచెప్పే సాహసం ఎవరూ చేయలేకపోతున్నారు. పొరుగు జిల్లాకు చెందిన ఓ మంత్రి, ఓ ఎంపీకి చెందిన అనుచరులు సాగిస్తున్న ఈ దాష్టీకాన్ని లోకాయుక్త, గ్రీన్ ట్రిబ్యునల్ కూడా చూస్తూ ఊరుకోవడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితికి చేరింది.

పగలైతే కుదరదని..

అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో స్థానిక గ్రామస్థులు మాత్రం రెండు నెలలుగా ఈ అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటున్నారు. ఫలితంగా అక్రమార్కులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో మైనింగ్ మాఫియా కూడా కొత్త ఎత్తులు వేసింది. అందరూ గాఢనిద్రలో ఉండే సమయంలో మైనింగ్ చేపడుతున్నారు. జక్కంపూడి, వేమవరం కొండ దిగువన పేద, మధ్య తరగతి వర్గాలకు బహుళ అంతస్తుల టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు టీడీపీ హయాంలో పూడ్చిన గోతులను అర్ధరాత్రిపూట తవ్వేస్తున్నారు. అప్పట్లో వేమవరం కొండ దిగువన గోతుల్లో దాదాపు లక్ష క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను నింపి చదును చేశారు. ఈ విషయాన్ని పసిగట్టిన మాఫియా తెలివిగా ఆ గోతులను తవ్వుకోవాలని స్కెచ్ వేసింది. పగలంతా గ్రామానికి శివారున తోటల్లో ఎక్స్‌కవేటర్లను దాచి, అర్ధరాత్రి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మెండెం జమలయ్య నేతృత్వంలోని స్థానికులు కొందరు గురువారం అర్ధరాత్రి వేమవరం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ గతంలో పూడ్చిన గోతులను తవ్వి లారీల్లోకి ఎక్కిస్తుండటాన్ని గుర్తించారు.

పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

అర్ధరాత్రుళ్లు మైనింగ్ జరుగుతున్న వ్యవహారాన్ని స్థానికులు.. రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా వారు పట్టించుకోలేదు. స్థానిక ఆర్ఐ హరీష్ స్పందించలేదు. మైనింగ్ డీడీ, ఏడీ సెలవులో ఉన్నారు. వీరు సెలవు పెట్టడానికి మైనింగ్ మాఫియానే కారణమని తెలుస్తోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు.. తమ సిబ్బందిని పంపిస్తామని చెప్పిన అధికారులు కొన్ని గంటల తర్వాత వేమవరం కాకుండా వేరే ప్రాంతానికి పంపించారు. రెవెన్యూ అధికారుల అలెర్ట్ వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందుకున్న మైనింగ్ మాఫియా తవ్వకాలు ఆపింది. మైనింగ్ సిబ్బంది వచ్చి చూసి వెళ్లిపోయారు. వ్యవస్థలే ఇలా ప్రవర్తిస్తుంటే, తమ పోరాటం వృథానే అనుకుని గ్రామస్థులూ వెళ్లిపోయారు.

గ్రామస్థులు అడ్డుకున్నా బేఖాతరు

స్థానికంగా గ్రామస్థులు అడ్డుకున్నా మైనింగ్ మాఫియా ప్రతిఘటించింది. ఎక్స్‌కవేటర్లను ఆపేందుకు ఎంత ప్రయత్నించినా ఖాతరు చేయలేదు. అక్రమ మైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన త్వరలో తనిఖీలు కూడా చేస్తారని హెచ్చరించినా వినలేదు. 'నువ్వు కలెక్టర్‌కు చెబితే మేము ప్రభుత్వానికి చెప్పాం. మా వెనుక మంత్రులు ఉన్నారు.' అంటూ రుబాబు చేశారు. దీంతో స్థానికులంతా చేష్టలుడిగి చూడటం తప్ప తవ్వకాలను అడ్డుకోలేకపోయారు. వీడియోలు తీసి మైనింగ్ అధికారులకు పంపించారు.



తవ్వకాలను చూపిస్తున్న స్థానికుడు మెండెం జమలయ్య

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు

- ఇక నెల నెలా బిల్లు ..ప్రస్తుతం ప్రభుత్వమే చెల్లిస్తుందని చెబుతున్న అధికారులు
- భవిష్యత్తులో రైతులకు తలనొప్పులు ఖాయం





తోట్లవల్లూరు లంకలో వ్యవసాయ మోటారు వద్ద మీటరు బిగిస్తున్న సిబ్బంది

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 16: మండలంలో కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించేస్తున్నారు. ఈ మీటర్లపై వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అని ముద్రించారు. ఉచితం అని ఉన్నప్పటికీ ఇకనుంచి ప్రతి నెలా రైతు వినియోగించిన కరెంటుకు బిల్లు రానుంది. అయితే ఈ బిల్లును ప్రభుత్వమే కడుతుందని, రైతులకు భారం కాదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో మీటర్లు బిగించిన తర్వాత ఒక్కో రైతుకు రూ 3,500 నుంచి రూ.5,000 వరకు బిల్లు వస్తుందని, భవిష్యత్తులో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేశాక రైతులు వ్యవసాయాన్ని వదులుకోవాల్సిన ఉపద్రవం దాపురిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు. ఉచిత విద్యుత్ అన్నప్పుడు అసలు మీటర్ల అవసరం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్ఆర్ ఆశయానికి తూట్లు

ఈ మీటర్ల బిగింపు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయానికి తూట్లు పొడవటమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రం మీటర్ల బిగింపును అంగీకరించలేదని, ఏపీప్రభుత్వమే అంగీకరించిందని సీపీఎం నేతలు చెబుతున్నారు.

5,200 మీటర్లు బిగిస్తున్నాం

తోట్లవల్లూరు మండలంలో 5,200 వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నామని, ప్రస్తుతం లంక పొలాల్లో బిగిస్తున్నట్టు మండల విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు.

గవర్నర్ కార్యక్రమంలో విద్యార్థుల అవస్థలు

- ఏర్పాట్లు సరిగా చేయకపోవడంతో ఎండకు తాళలేక, మంచినీళ్లు లేక, కింద కూర్చోలేక ఇబ్బందులు



నేలపైనే కూర్చున్న విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శనకు వచ్చిన విద్యార్థికి తన బాటిల్‌తో నీళ్లు తాగిస్తున్న కానిస్టేబుల్

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 16: పట్టణంలో తిరంగా పార్క్ ప్రారంభించడానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేసిన సందర్భంగా కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి విద్యార్థులను భారీగా తరలించారు. ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులను వారి స్కూల్ బస్సుల్లో, ప్రభుత్వ బడుల విద్యార్థులను ఉపాధ్యాయులే ఆటోల్లో తీసుకునివచ్చారు. పలు స్కూళ్ల విద్యార్థులను సాంస్కృతిక కార్యక్రమాల కోసం పిలిచారు. కానీ సరైన ఏర్పాట్లు చేయలేదు. దీంతో వారు కిందే కూర్చొన్నారు. ఎండ మండిపోవటంతో వాటర్ బాటిళ్లు అరకొరగా ఇవ్వడం, స్నాక్స్ ఇవ్వకపోవడంతో అల్లాడిపోయారు. గవర్నర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడినా స్పందించలేదు. పురపాలక సంఘం సిబ్బంది గవర్నర్ వచ్చే దాకా ఏర్పాట్లు చేస్తూనే ఉన్నారు. గవర్నర్ అధికారిక కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానులు పరస్పరం ప్రశంసించుకోవటం, అభివృద్ధి కార్యక్రమాలను ఏకరవు పెట్టటం కార్యక్రమస్ఫూర్తికి విరుద్ధంగా ఉందని పలువురు ఆక్షేపించారు.

వీఐపీ గ్యాలరీల్లో వైసీపీ కార్యకర్తలు

పురపాలక సంఘం వీఐపీ పాస్‌లు పాస్‌లు ఇచ్చినా వీఐపీ గ్యాలరీల్లో అధికార పార్టీ కార్యకర్తలు కూర్చున్నారు. దీంతో ప్రెస్ గ్యాలరీల్లోకి వీఐపీలు వచ్చారు. కుర్చీల్లో కూర్చొన్న విలేకరులను లేపి వీఐపీలను అధికార పార్టీ నేతలు కూర్చోబెట్టారు.



గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మె సందర్భంగా విజయవాడలో ర్యాలీ చేస్తున్న కార్మిక, రైతాంగ నేతలు

మోదీ ప్రభుత్వ ఓటమితోనే దేశానికి రక్ష

- కార్మిక, రైతాంగ నేతల వ్యాఖ్యలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 16: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిలువరించేందుకు మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని, అదే దేశానికి, ప్రజలకు రక్ష అని పలు కార్మిక, రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె సందర్భంగా శుక్రవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. అక్కడ నిర్వహించిన సభలో పలువురు రైతు, కార్మిక సంఘాల నేతలు మాట్లాడారు. "రైతు ఉద్యమం కారణంగా మూడు నల్ల చట్టాలను రద్దు చేసిన మోదీ ప్రభుత్వం, రైతాంగానికి ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించిన మోదీ ప్రభుత్వం ఆయన చేసిన సిఫార్సులను అమలు చేయడం లేదు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి బీజేపీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తోంది." అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు విమర్శించారు. "నూతన విద్యా విధానం పేరిట విద్యా వ్యవస్థను ధ్వంసం చేయాలని కేంద్రప్రభుత్వం చూస్తోంది. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లను తెచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజానీకం అల్లాడుతున్నా వాటిని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టలేదు." అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. బీజేపీని దానికి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.పొలారి పిలుపునిచ్చారు. సీఐటీయూ నేత కె.దుర్గారావు, పీడీఎస్‌యూ నేత ఎ.రవిచంద్ర, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, ఏఐ యూటీయూసీ నాయకులు కె.సుధీర్, దివాకర్, కార్మిక సంఘాల నేతలు పి.అజయ్‌కుమార్, సీహెచ్ బాబూరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఆర్.అజయ్‌కుమార్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో వేగంగా మూడో దశ రీసర్వే

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: ఎన్టీఆర్ జిల్లాలో మూడో దశ రీ సర్వే కార్యక్రమం వేగంగా సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు. శుక్రవారం జవహర్‌రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 107 గ్రామాల్లో చేసిన సర్వేలో 1,44,640 సరిహద్దులు తేలాయన్నారు. 57 గ్రామాల్లో రాళ్ల పాతే కార్యక్రమం పూర్తైందని, ఈనెల 18లోగా మిగిలిన గ్రామాల్లో పూర్తి చేస్తామని తెలిపారు. జగనన్న భూరక్షలో 16 మండలాల్లో 300 గ్రామాల్లో మూడు దశల్లో రీసర్వే చేపట్టామని, డ్రోన్ సర్వే పూర్తయిందని, 102 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 13వ నోటిఫికేషన్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉపాధి పథకంలో 1,96,748 మందికి జాబ్‌కార్డులు అందించామన్నారు. కరువు మండలాలు గంపలగూడెం, తిరువూరులో 3,639 కుటుంబాలకు 26,681 మందికి జాబ్‌కార్డులు ఇచ్చి వంద రోజుల పని కల్పించామన్నారు. ఆరోగ్య సురక్షలో భాగంగా 195 గ్రామ, వార్డు సచివాలయాల్లో 587 వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. 82,942 మందికి వైద్యసేవలందించామన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 3215 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని 1585 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామని తెలిపారు. 120 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరమని గుర్తించామన్నారు. 99416 మందికి ఆరోగ్యశ్రీకార్డులు పంపిణీ చేశామని తెలిపారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్, సర్వే ల్యాండ్ రికార్డు అధికారి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్ష వాయిదా వేయాలి

- జేబీఎన్‌పీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీన నిర్వహించే గ్రూపు-2 పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని జై భారత్ నేషనల్ పార్టీ (జేబీఎన్‌పీ) అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ పరీక్ష సమయానికి బ్యాంక్ క్లర్క్ ఉద్యోగాల పరీక్ష ఉండడంతో అభ్యర్థులు సందిగ్ధంలో ఉన్నారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా క్లర్క్ మెయిన్స్ పరీక్షను 25వ తేదీన నిర్వహించడానికి షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. నిరుద్యోగులు ఆరేళ్లుగా గ్రూపు-2 పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారని, 2019 తర్వాత గ్రూపు-2 క్లర్క్ ఉద్యోగాల నోటిఫికేషన్ ఇప్పటికి వచ్చిందని, ఈ పరీక్షను వాయిదా వేయాలని కోరారు.

మోపిదేవిలో వృద్ధురాలి సజీవ దహనం

మోపిదేవి, ఫిబ్రవరి 16: పూరిగుడిసెకు ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని వృద్ధురాలు సజీవ దహనమైంది. ఈ సంఘటన మోపిదేవిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. మోపిదేవి నుంచి అవనిగడ్డ వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే పూరిగుడిసెలో కందుల సీతామహాలక్ష్మి(76) ఒంటరిగా నివసిస్తోంది. అనారోగ్యంతో లేవలేని స్థితిలో మంచంలోనే ఉన్న ఆమె బాగోగులను కుమారుడు ధర్మయ్య, కుమార్తె ఆదిలక్ష్మి చూస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో గుడిసెకు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు కేకలు వేసి మంటలు అదుపుచేయటానికి ప్రయత్నించినప్పటికీ గుడిసె పూర్తిగా దగ్ధమై సీతామహాలక్ష్మి సజీవ దహనమైంది. కుమార్తె, కుమారుడు దూరంగా ఉండటంతో వెంటనే అక్కడికి చేరుకోలేకపోయారు. వృద్ధురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్సై వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. డీఎస్పీ మురళీధర్ ఘటనా స్థలానికి పరిశీలించారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

1320 మందితో సూర్య నమస్కారాలు

- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సిఫారసు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యోగసభ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ కళాశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు, యోగ సాధకులతో కలిపి 1320 మంది సూర్య నమస్కారాలు చేశారు. కార్యక్రమాన్ని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఝాన్సీ సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని ధ్రువీకరించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సిఫారసు చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారుడు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు. గురువులు ఘంటసాల గురునాథబాబు, లక్ష్మి, మద్దాల చింతయ్య, రమేష్ సూర్య నమస్కారాల కార్యక్రమ నిర్వహణ చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధులు పాల్గొన్నారు.

గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు

మా బకాయిలు చెల్లించమనే అడుగుతున్నాం: ఏపీ జేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

- ఉద్యోగుల సొమ్మును పథకాల రూపంలో పంచడమేంటి?
- ఉద్యమ శంఖారావంలో ప్రభుత్వాన్ని బండి శ్రీనివాసరావు నిలదీత



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న బండి శ్రీనివాసరావు, జేఏసీ నేతలు



మచిలీపట్నం జడ్పీ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): "ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించమని అడుగుతున్నారు. అవి సాధించుకోవటానికే ఉద్యమానికి దిగారు. ఐదేళ్లుగా దాచుకున్న డబ్బులు ఇవ్వండంటూ ప్రభుత్వాన్ని కోరుతూ ఆందోళన చేస్తున్నారు." అని ఏపీజేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉద్యమ శంఖారావంలో భాగంగా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఉద్యోగుల ఆవేదనతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఉద్యోగులు ఈ రోజున ఆకలి పోరాటం చేస్తున్నారని, ఏ ప్రభుత్వానికీ సహకరించని స్థాయిలో ఇప్పటివరకు ఈ ప్రభుత్వానికి ఉద్యోగులు వివిధ స్థాయిల్లో సహకరించారని ఆయన అన్నారు. ఉద్యోగులు తమ కుటుంబ అవసరాల కోసం వివిధ రూపాల్లో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోవటం వల్ల ఉద్యోగులను ఎగవేతదారులుగా ప్రకటించే దుస్థితి దాపురించిందన్నారు. నాలుగేళ్లుగా ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ప్రభుత్వం ఇవ్వటం లేదన్నారు.

27న 'చలో విజయవాడ'

నాలుగేళ్లుగా ఒక్క డీఏ కూడా ఇవ్వని ప్రభుత్వం ఇదేనని బండి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము దాచుకున్న సొమ్ములను పథకాల రూపంలో ప్రజలకు పంచడం సమంజసం కాదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రతి పీఆర్సీలోనూ జీతభత్యాల పెంపు ఉంటుందని ఈ ప్రభుత్వం పెంచకపోగా తగ్గించిందన్నారు. పదకొండో పీఆర్సీని పూర్తిగా లేకుండా చేసిందన్నారు. పన్నెండో పీఆర్సీ ఇస్తారనుకుంటే దాని అమలులోనే అనేక అవాంతరాలున్నాయన్నారు. ఇటీవల మంత్రుల బృందంతో జరిగిన చర్చల్లో 49 సమస్యలపై నివేదించామని, ఇప్పటి వరకు ఒక్క సమస్యకైనా ప్రభుత్వం పరిష్కారం చూపలేదన్నారు. ప్రభుత్వానికి ఈనెల 26వ తేదీ వరకు సమయం ఇస్తున్నామని, 27న చలో విజయవాడను భారీగా నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సిందే: ఎ.విద్యాసాగర్

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే సరైన సమయంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఏపీ జేఏసీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ ఎ.విద్యాసాగర్ హెచ్చరించారు. ఏ రాష్ట్రంలోనూ ఉద్యోగులకు ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి రాలేదన్నారు. ఎండీ ఇక్బాల్, హరినాథ్‌బాబు, శ్రీనివాసరావు, రవీంద్రబాబు, కిషోర్, శ్రీనివాసరావు, సాంబశివరావు, ఎం.రాజబాబు, జానీబాషా, రెడ్డమ్మ, శ్రీరామ్, సంపత్‌కుమార్, జి.నారాయణరావు, పి.రమేష్, సతీష్ కుమార్, విష్ణువర్ధనరావు, నజీర్, సీహెచ్ ప్రసాద్, మధుసూదన్ పాల్గొన్నారు.

డిమాండ్లు ఆమోదించే వరకు పోరాటం

మచిలీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఏపీ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, మధ్యంతర భృతిని విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ఏపీ జేఏసీ కృష్ణాసంఘం కార్యదర్శి ఆకునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేపట్టిన ఉద్యమబాటను అణచివేసేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ముందుకు సాగాలని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేవరకు పోరాటాన్ని దశలవారీగా కొనసాగించాలని జడ్పీ యూనిట్ ప్రతినిధి ఆర్.హేమప్రకాష్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు కె.ఆంజనేయులు సూచించారు. పెనమలూరు మండలం కానూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మోపిదేవిలో జేఏసీ నేతలు తహసీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు.

చింతలపూడి పూర్తి టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే సాధ్యం

- తల్లీ, చెల్లిని పట్టించుకోని దౌర్భాగ్యుడు మన సీఎం: కేశినేని చిన్ని



మాట్లాడుతున్న కేశినేని చిన్ని

విస్సన్నపేట, ఫిబ్రవరి 16: మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా వరకు పూర్తి చేసిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతుల కల్ని సాకారం చేసేది టీడీపీ - జనసేన ప్రభుత్వమే అని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కొండపర్వ మల్లయ్య, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆయన శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. "తల్లిని, చెల్లిని పట్టించుకోని దౌర్భాగ్యుడు మనకు సీఎం కావడం దౌర్భాగ్యం. టీడీపీలో ఉండి పదవులు అనుభవించిన ఇక్కడ ఇద్దరు నాయకులు వైసీపీ పంచన చేరారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణిని నందిగామలో జడ్పీటీసీగా గెలిపించి చైర్‌పర్సన్‌గా టీడీపీ చేసింది. అటువంటి పార్టీని వారు విమర్శించడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనం"అని చిన్ని విమర్శించారు. భారీ ర్యాలీతో విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్లో అభిమానులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. టీడీపీ - జనసేన శ్రేణులు కలిసికట్టుగా పని చేసి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కొండపర్వ, విస్సన్నపేట, మారేమండ, నర్సాపురం గ్రామాలకు చెందిన వేలాది టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. శావల దేవదత్, మట్టా వేణుగోపాల్, వల్లభనేని గిరి, నెక్కళపు శ్రీనివాసరావు, రాజ పాల్గొన్నారు.

కాలుష్యం నిలువరించకుంటే ఉద్యమిస్తాం

- ఎన్టీటీపీఎస్ సీఈ నవీన్‌కుమార్‌కు టీడీపీ వినతి



సీఈ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16: తమ సంస్థ నుంచి వెలువడుతున్న బూడిద కాలుష్యాన్ని తక్షణం నిలువరించకుంటే బాధిత ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమాన్ని చేస్తామని ఎన్టీటీపీఎస్ సీఈ నవీన్‌కుమార్‌కు టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఈమేరకు నేతలు శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. "40 ఏళ్లు దాటిన స్టేజ్-1, స్టేజ్-2 యూనిట్లు మూసివేసి తొలగించాలి. పాత చిమ్నీ(గొట్టాలు)ల నుంచి వచ్చే ఉద్గారాలను నియంత్రించేందుకు కెమికల్స్‌ను, నాణ్యమైన బొగ్గును ఉపయోగించాలి. ఆర్‌డబ్ల్యూఎస్ తీసుకునే ఇంటెక్ పంపుహౌస్ వద్ద బూడిద కలుస్తోంది. దాన్ని నిలువరించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలి. ప్రజలకు, పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలి. పర్యావరణ పరిరక్షణకు గ్రీనరీ ఏర్పాటు చేయాలి. యాష్ పాండ్ నుంచి బూడిద రవాణా సమయంలో వాహనాల నుంచి బూడిద కారకుండా చూడాలి." అని వినతిపత్రంలో పేర్కొన్నారు. టీడీపీ నేతలు చుట్టుకుదురు శ్రీనివాసరావు, చెన్నుబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, కరిమికొండ శ్రీలక్ష్మి, రావి ఫణి, బసవ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కాపులకు ప్రాధాన్యం ఇవ్వాలి

రిటైర్డ్ ఐఏఎస్ పి.రామమోహనరావు



మాట్లాడుతున్న పి.రామమోహనరావు

లబ్బీపేట, ఫిబ్రవరి16: రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న కాపులకు దామాషా ప్రకారం రాజకీయంగా అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని రిటైర్డ్ ఐఏఎస్, తమిళనాడు మాజీ సీఎస్ డాక్టర్ పి.రామమోహనరావు అన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో శుక్రవారం కాపు ప్రతినిధులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాపు రిజర్వేషన్ సాధించే ఉద్యమంలోనే ఉన్నామని, రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం ఆగదని తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరిలకు 10శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, కాపు కార్పొరేషన్‌కు ప్రత్యేక బడ్జెట్ ప్రకటించాలని, కృష్ణదేవరాయులు, వంగవీటి మోహనరంగా పేర్లను జిల్లాలకు పెట్టాలని డిమాండ్ చేశారు. కాపు ప్రతినిధుల సమావేశంలో మాజీ మంత్రి హరిరామజోగయ్య పేరిట పంపిణీ జరిగిన కరపత్రాలను కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆసక్తిగా తిలకించారు.

28 నుంచి శతచండీ కదళీయాగం

ధర్నాచౌక్, ఫిబ్రవరి 16: ప్రజల సంక్షేమం, ప్రకృతి పరిరక్షణ కోసం ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు శ్రీ వారాహి సహిత శతచండీ కదళీయాగం నిర్వహిస్తున్నట్టు వారాహిసేన రాష్ట్ర అధ్యక్షురాలు డి.సరోజా రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడపలోని అనుమోలు గార్డెన్స్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ నెల 28న అమ్మవారి శోభయాత్ర, 29న వారాహి హోమం, మార్చి 1న చండీహోమం, 2న కదళీ యాగం, లక్ష తమలపాకులు, లక్ష అరటిపండ్లతో పూర్ణాహుతి జరుగుతుందన్నారు.

జగన్..గుడ్డి గుర్రానికి పళ్లు తోముతున్నాడా?

- కబ్జాలు, దందాలు, రౌడీయిజం చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు
- జగన్ మీడియాలో వచ్చిన ఆరోపణలపై రూ.10 కోట్లు పరువు నష్టం దావా: బొండా ఉమా

పాయకాపురం, ఫిబ్రవరి 16: "2014-19లో కబ్జాలు, రౌడీయిజం, అనేక దందాలను బొండా ఉమా చేశాడని జగన్ సొంత మీడియాలో కథనం వచ్చింది. అప్పుడు నేను రౌడీయిజం, గుండాగిరీలకు పాల్పడితే ఇప్పుడు అధికారంలో ఉంది వైసీపీ ప్రభుత్వమే కదా..నాపై ఎందుకు కేసులు నమోదు చేయలేదు? అధికారంలోకి వచ్చాక జగన్ ఇంట్లో గుడ్డిగుర్రానికి పళ్లు తోముతున్నాడా?" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. మొగల్రాజపురం లోని తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకో 50 రోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తాను రౌడీయిజం చేస్తే ఎందుకు అరెస్ట్ చేయలేదని, కబ్జాలకు పాల్పడితే ఎందుకు ఆధారాలు చూపించలేదని ప్రశ్నించారు. జగన్ మీడియాలో తనపై వచ్చిన ఆరోపణలపై తక్షణమే మీడియా యాజమాన్యం తనకు క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో రూ.10 కోట్లు పరువునష్టం దావా వేస్తానని ఆయన హెచ్చరించారు.

సినిమాను అడ్డుకునే నీచస్థితికి ప్రభుత్వం: బొండా

"రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చిన ఘనుడు, ఐదుకోట్ల ఆంధ్రుల కలల రాజధానిని ఛిద్రం చేసిన తుగ్లక్, మూడు రాజధానుల పేరుతో ఆంధ్రులను మోసం చేసిన మూర్ఖుడు సీఎం జగన్. రైతుల బతుకు చిత్రంపై సామాజిక బాధ్యతతో తీసిన సినిమా రాజధాని ఫైల్స్‌ను అడ్డుకునే నీచస్థితికి వైసీపీ ప్రభుత్వం దిగజారింది. సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడటం చరిత్రలో ఇదే తొలి సారి. ఈ సినిమా వల్ల జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏంటి?" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా మహేశ్వరరావు ప్రశ్నించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రైతుల ఉసురు పోసుకున్న జగన్ రాష్ట్ర ప్రజల కోసం తీసిన సినిమాను అడ్డుకోవడం దారుణమన్నారు.

భార్య కాపురానికి రాలేదని

గొంతు కోసుకున్న భర్త

- 108లో ఆస్పత్రికి తరలింపు

ఎ.కొండూరు, ఫిబ్రవరి 16: భార్య కాపురానికి రావడంలేదని భర్త మనస్థాపంతో చాకుతో గొంతు కోసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అట్లప్రగడ గ్రామంలో జరిగింది. పెనుగంచిప్రోలు మండలం గట్టు భీమవరానికి చెందిన అల్లూరి శ్రీనివాస్‌కు ఎ.కొండూరు మండలం అట్లప్రగడ గ్రామానికి చెందిన గొల్లపూడి కృష్ణవేణికి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. ఇటీవల భార్య భర్తల మధ్య ఘర్షణ జరిగి కృష్ణవేణి తన పుట్టింటికి వచ్చింది. శుక్ర వారం శ్రీనివాస్ తన కుమార్తెను చూడడానికి అట్లప్రగడకు వచ్చాడు. ఫుల్లుగా మద్యం తాగి పెద్ద పెద్ద కేకలు వేస్తూ తలను రోడ్డుకు, హ్యాండ్ పంపునకు కొట్టుకుంటూ తన వెంట తెచుకొన్న చాకుతో గొంతు కోసుకున్నాడు. గ్రామస్థులు 108లో తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఏఎస్సై లక్ష్మి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ

చట్టాలను రద్దు చేయాలి

ఆటోనగర్, ఫిబ్రవరి 16: రవాణా వ్యవస్థలను కార్పొరేటు సంస్థల పరం చేసేందుకు, రవాణా వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు ప్రవేశపెట్టిన కొత్త చట్టాలను రద్దు చేయాలని న్యూహెచ్ ఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఆసిఫ్ పాషా, ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం చీకటి జీవోలను రద్దు చేయాలంటూ దేశవ్యాప్తంగా రవాణా కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెలో భాగంగా ఆసిఫ్‌పాషా, దుర్గాప్రసాద్‌ల నేతృత్వంలోని కార్మికులు, నాయకులు పంటకాల్వ రోడ్డులో వాహనాలను ఆపి నిరసన వ్యక్తం చేశారు. వందలాది వాహనాలను కాసేపు నిలువరించారు. దీంతో పంటకాల్వ రోడ్డులో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం కలిగింది.

ఉచిత విద్య అందాలంటే

వైసీపీని ఇంటికి పంపాలి

ఏఐఎస్ఎఫ్ నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో విద్యార్థులకు ఉచిత విద్య అందాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నేతలు పిలుపునిచ్చారు. స్థానిక దాసరి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సంఘం రాష్ట్ర కోశాధికారి మందగళ్ల సాయికుమార్, ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు 117 రద్దు చేసి, పాఠశాలల విలీనాలు నిలుపుదల చేసి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం 2020 అమలు చేస్తూ జీవో 117 తీసుకువచ్చి కిలోమీటరు పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చేశారన్నారు. ఇప్పటికైనా 25 వేల ఉద్యోగాలతో కూడిన డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలు చేయాలి

మొగల్రాజపురం , ఫిబ్రవరి 16: విద్యార్థులు సామాజిక దృక్పథంతో ఆవిష్కరణలు చేసినపుడే గుర్తింపు వస్తుందని తద్వారా జీవితంలో అనుకున్న లక్ష్యానికి చేరుకోవచ్చని హైదరాబాద్ ఐఐటీ భౌతిక శాస్త్రం ప్రొఫెసర్ సాయి సంతోష్‌కుమార్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో సైన్స్ డే , రాష్ట్ర స్థాయి అంతర్ కళాశాలలు, పాఠశాల పోటీలు సైన్‌టిల్లా 5.0 పేరుతో జరిగాయి. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రోగ్రాం ఆఫీసర్ జె.ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ మాట్లాడుతూ నిత్య జీవితంలో మనిషి వాడే ప్రతి వస్తువు సైన్స్‌కు సంబంధించినదేనన్నారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా డాక్టర్ శ్రీనివాస కృష్ణ వ్యవహరించగా, వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన

భర్తకు జీవిత ఖైదు

విజయవాడ క్రైం, ఫిబ్రవరి 16: భార్యను హత్య చేసిన కేసులో భర్తపై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ మహిళా సెషన్స్ కోర్టు జడ్జి ఐశైలజా దేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కృష్ణలంక రణదివెనగర్‌లో ఉంటున్న దేగల కృపానందంకు నిడమానూరుకు చెందిన మహిళతో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు ఆడపిల్లలు. భార్యపై అనుమానంతో తరచూ భర్త గొడవపడటం ఆమెను కొట్టడం చేస్తుండేవాడు. 2020 అక్టోబరు 26వ తేదీకి 15 రోజుల ముందు భార్యను పుట్టింటి వద్ద విడిచి ఇక నీకు నాకు సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో ఆమె మా ఇంటికి వెళ్లి బట్టలు, వంట సామాగ్రి తెచ్చేసుకుంటానని తల్లికి చెప్పి వెళ్లింది. వెళ్లిన కొద్ది సేపటికే కృపానందం అత్తకు ఫోన్ చేసి మీ కుమార్తెను చంపేశాను వచ్చి చూసుకోండి అని సమాచారం ఇచ్చాడు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (కి.లో)

బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

సాయిబాబా గుడి వార్షికోత్సవం

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 16: బీసెంట్ రోడ్డు కార్నర్ పెద్దిబోట్ల వారి వీధిలోని శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో బాబా విగ్రహం ఏర్పాటు చేసి ఐదేళ్లు నిండిన సందర్భంగా శుక్రవారం సాయిబాబా భజన కార్యక్రమం నిర్వహించారు. 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు వాళ్ల బాబూరావు, కమిటీ సభ్యులు రవి, శ్రీనివాస్, రంగా, శ్రీను, ప్రసాద్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధిలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న బాలస్వామిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.



పూజలో పాల్గొన్న బాలస్వామి

టీడీపీ పశ్చిమ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా రజావుల్లా

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: టీడీపీ పశ్చిమ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ రజావుల్లాను జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ నియమిస్తూ నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని రఘురామ్ సూచించారు. ప్రజల కోసం. పార్టీ కోసం చంద్రబాబునాయుడు పడుతున్న కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామ్య విధానాలను ఎప్పటికప్పుడు మీడియా ద్వారా సమర్థవంతంగా తిప్పి కొట్టాలన్నారు.

సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టమేంటి?

టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ ప్రశ్న

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: నీచ మనస్తత్వంగల జగన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని, సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన ఇబ్బంది ఏమిటని పశ్చిమ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ ప్రశ్నించారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సినిమా ద్వారా ప్రజలలో తన పట్ల మరింత వ్యతిరేకత వస్తుందనే భయంతో సినిమాను నిలుపుదల చేయించేందుకు కోర్టుకు వెళ్లారన్నారు. మూడు రాజధానుల పేరుతో మోసం చేసిన మూర్ఖుడు జగన్ ప్రాంతాలను, ప్రజలను విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూశాడన్నారు. టీడీపీకి వస్తున్న మైలేజ్ చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి సైకో చేష్టలు చేస్తున్నాడన్నారు. హైకోర్టులో రాజధాని ఫైల్స్ సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ రావడం ముదావహమన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సహాయం

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 16 : వివిధ కారణాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఇద్దరికి అజిత్‌సింగ్ నగర్‌లోని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన మున్నీర్ అహ్మద్ బాషాకు, వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన ఓ మహిళ వైద్యఖర్చులకు కమిటి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగూల్ మీరా చెరో రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు.



శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు, వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో, కూరపాటి పాఠశాలలో సూర్యనమస్కారాలు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 16: రథసప్తమి వేడుకలు ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, శ్రీపట్టాభి రామచంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి పర్వదినం సందర్భంగా సూర్యనమస్కారాలు జరిగాయి. ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకూ భక్తులు సూర్యనమస్కారాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి డి. శివరామరాజు పర్యవేక్షించారు.

● శ్రీపట్టాభి రామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5.30కు ఆదిత్య హృదయ పారాయణ జరిగింది. స్వామిని అందంగా అలంకరించి రథంలో ముత్యాలంపాడు పురవీధుల్లో ఊరేగించారు. ● అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అజిత్‌సింగ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. 300 మంది విద్యార్థులతో పతంజలి యోగశాస్త్రం ప్రకారం 12 సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. అలాగే సూర్య భగవానుని ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణ నిర్వహించారు. మేడవరం కాంతికుమార్, భాస్కర్‌రెడ్డి, కోలవెన్ను వెంకటరమణ, బొగ్గవరపు వెంకట బాలకోటేశ్వరరావు, నల్లూరు తాండవకృష్ణ, సత్యవతి, శోభన్‌బాబు పాల్గొన్నారు.

వన్‌టౌన్: రథసప్తమిని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని కూరపాటి పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం సూర్యనమస్కారాలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యుగంధరాచార్య మాట్లాడుతూ, రథసప్తమి అంటే సూర్యజయంతి అని దాని విశేషాలను తెలియచేశారు. ప్రతి నిత్యం వేకువజామునే లేచి సూర్యనమస్కారాలు వేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని, ఆయుష్షు పెరుగుతుందని తెలిపారు.

పేదల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం: ఎమ్మెల్యే గద్దె

లబ్బీపేట, ఫిబ్రవరి16: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మద్యం దుకాణాల్లో కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 19వ డివిజన్ గ్రీన్‌ల్యాండ్ హోటల్ వెనుక శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన రోజు నుంచి రాష్ట్రంలో కల్తీ మద్యం విక్రయిస్తూ ఆదాయమే లక్ష్యంగా వెళ్తున్నారని, ఈ మద్యాన్ని తాగి రాష్ట్రంలో ఐదు లక్షల మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహనరెడ్డి చేస్తున్న విధ్వంస పాలన గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. అనంతరం కల్తీ మద్యం తాగి ఇటీవల మరణించిన పిల్లి ప్రభుకుమార్ కుటుంబాన్ని పరామర్శించి రూ.30వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దున్నా ఏసురత్నం, రవి, రాజశేఖర్, విజయ్, శ్రీను జ్యోతి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె

గుణదల: స్థానిక ఒకటవ డివిజన్లోని తుంగం రాములు వీధి ఏరియాలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొండా ఉమా ఇంటింటికి వెళ్లి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుని, టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశంతోనే ఇన్ని కష్టాలు కొని తెచ్చుకున్నామని మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేయడానికి భయపడిపోతున్నారని చెప్పారు. పూర్ టూ రిచ్ అనేది చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు కొమ్మినేని సురేష్, కొంచడ సత్యనారాయణ, పయ్యావుల నాగబాబు, పరుచూరి బార్గవ్, మాదాల సత్య, సత్యవరపు దివ్య, కోటేశ్వరమ్మ, పిల్ల రాంబాబు, గంగవరపు సుధాకర్ బాబు, సాయమ్మ, జనసేన డివిజన్ అధ్యక్షుడు పెరవలి దుర్గాప్రసాద్, ఆలియా, అపర్ణ, నాగరాజు, తిరిష్ బాబు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న బొండా ఉమా

నగరాభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్

●2024-25 బడ్జెట్ రూ. 1496.99 కోట్లు

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

చిట్టినగర్, ఫిబ్రవరి 16: నగరాభివృద్ధే లక్ష్యంగా 2024-25కు సంబంధించి రూ. 1496.99 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరుగుతుందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ 2024-25 కు సంబంధించి శనివారం నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో వీఎంసీ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరగుతుందన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశ పెట్టడం సంతోషంగా ఉందన్నారు. నగరాభివృద్ధి, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీఠం వేయటం జరిగిందన్నారు. చెత్తరహితంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగరంలో ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను భారీస్థాయిలో తొలగించి క్లీన్ చేసినట్లు తెలిపారు. వీటితోపాటు పార్కులు, ఇంజనీరింగ్, విద్యుత్, పారిశుధ్య నిర్వహణకు సంబంధించి వాహనాలు కొనుగోలు తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.



ఉల్లాసంగా రవీంద్రభారతి కాన్వొకేషన్

భవానీపురం, ఫిబ్రవరి 16 : విద్యాధరపురం క్వారీ సెంటర్‌లోని రవీంద్రభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కాన్వొకేషన్ శుక్రవారం అలరించింది. యూకేజీ కిడ్స్‌కు పట్టాల పంపిణీతో తల్లిదండ్రులు మురిసిపోయారు. చిన్నారులు నృత్యాలు, డ్యాన్సులు, వివిధ కార్యక్రమాలు సభికులను అలరించాయి. స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, ఏవోలు దుర్గారావు, సునీతలు పాల్గొన్నారు.

మినీ వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

విద్యాధరపురం,ఫిబ్రవరి 16: మినీ వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. హెచ్‌బీ కాలనీకి చెందిన దొండపాటి చినబ్రహ్మం, ఊర్మిళానగర్‌కు చెందిన అశోక్‌లు గురువారం బుల్లెట్‌పై స్వాతి థియేటర్ వద్దకు వస్తుండగా గొల్లపూడి నుంచి వేగంగా వస్తున్న మినీ వ్యాన్ ఢీకొని ఇద్దరు కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ అశోక్ అపస్మారక స్థితిలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. చినబ్రహ్మం ఫిర్యాదు మేరకు శుక్రవారం భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: కేబీఎన్ కళాశాలలోని దాసాంజనేయ స్వామి గుడిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు శని, ఆది, సోమ(17,18,19 తేదీలు)వారాలలో జరుగుతాయని కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 న శాస్త్రోక్త విధానంలో గోపూజ, గణపతి పూజలతో కార్యక్రమాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. 18న మంటప దేవతా హోమాలు, మూలమంత్ర హోమాలు, సీతారామ కల్యాణం ఉంటాయని, 19న యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్ బడ్జెట్

● 2024-2025 కార్పొరేషన్ బడ్జెట్‌లో పన్నుల భారాలు

టీడీపీ ఫ్లోర్‌లీడర్, ఎన్.బాలస్వామి, యు. వెంకటేశ్వరరావు

విద్యాధరపురం, ఫిబ్రవరి 16: విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ బడ్జెట్ నిబంధనలకు విరుద్ధంగా రూపొందించారని, ఇది ఆమోద యోగ్యం కాదని, పైగా బడ్జెట్‌లో పన్నుల భారాలు అధికంగా మోపారని టీడీపీ ఫ్లోర్ లీడర్, ఎన్.బాలస్వామి, యు. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంయుక్తంగా మాట్లాడారు. శనివారం జరిగే కౌన్సిల్‌లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ఆమోద యోగ్యం కాదన్నారు. నిబంధనల మేరకు ప్రతి ఆర్థిక సంవత్సరం బడ్జెట్ జనవరి 10లోగా ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. దీంతో చట్టప్రకారం ఈ బడ్జెట్ చెల్లుబాటు కాదన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి పాలక పార్టీ ఇదే తంతు చేస్తోందన్నారు. ఇంటిపన్నులను 40 శాతం పెంచి రూ. 40 కోట్లు వసూలు చేయడానికి పన్నాగం పన్నారన్నారు. యూజీడీ ట్యాక్సులు రూ.5 నుంచి రూ.6 కోట్ల మేరకు వసూలు చేసేందుకు, నీటి పన్ను ద్వారా మరో రూ. 6 కోట్లు మేరకు బడ్జెట్‌లో రెవెన్యూ రాక పద్దులలో పెట్టారన్నారు. దోమల నివారణకు కేవలం రూ. 15 లక్షలు మాత్రమే పెట్టారన్నారు. బడ్జెట్‌లో రూ. 83 కోట్లులోటు చూపించారన్నారు. ఆదాయం రూ. 1370 కోట్లుకాగా, వ్యయం రూ. 1454 కోట్లు చూపించారన్నారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తేలేని అసమర్థ పాలకులని విమర్శించారు. బడ్జెట్‌లో పద్దులపై కౌన్సిల్‌లో తాము ప్రశ్నిస్తామన్నారు. ప్రజల తరపున పోరాడతామన్నారు. కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరు సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, క్రాంతి శ్రీ, చెన్నగిరి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా జగన్ మోసం : పోతిన మహేశ్

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 16 : టిడ్కో ఇళ్లు పూర్తి చేసి అందజేయకుండా కావాలనే పేద కుటుంబాల మహిళలను సీఎం జగన్ మోసం చేస్తున్నారని పశ్చిమ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ విమర్శించారు. ఇంటింటి రాబోయే మన జనసేన- టీడీపీ ప్రభుత్వం కార్యక్రమాన్ని 35వ డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎస్. ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం పూర్ణానందంపేటలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోతిన మహేశ్ ఇంటింటికి తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకుని మాట్లాడారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఇటు ఇల్లు రాక, అటు వాయిదాల వడ్డీలు అద్దెలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతున్నారన్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ వారిని వంచించడమే సిఎం జగన్, వైసీపీ నైజం అని ఆరోపించారు. అనంతరం వందమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాయకులు ప్రసాద్, నరేష్, సుమన్ నాయక్, పసుపులేటి కొండ, భాస్కర్, నాని, చంటి రాజ్, దాము, వెన్న శివశంకర్, కొరగంజి వెంకట రమణ, ఆకుల రవిశంకర్ పాల్గొన్నారు.



మహిళకు చీరను ఇస్తున్న పోతిన మహేశ్

విజయవాడలో కమ్యూనిస్టులకు పట్టం కట్టాలి

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: విజయవాడలో ప్రజలు కమ్యూనిస్టులకు పట్టం కట్టాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొత్తపేటలో నవోదయ నాట్యమండలి కార్యాలయాన్ని 53, 37 డివిజన్లకు సంబంధించి సీపీఐ ప్రధాన కార్యాలయంగా మార్చారు. ఈ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కొట్టు రమణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1942లో నవోదయ నాట్యమండలిని ఏర్పాటు చేశారని, ఇప్పుడు పార్టీ కార్యాలయంగా దీనిని మార్చడం జరిగిందని, ఇది కేంద్ర కార్యాలయంగా మార్పు చెందాలని ఆకాంక్షించారు. నాయకులు నక్కా వీరభద్రరావు, మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, అప్పరబోతు రాము పంచదార్ల దుర్గాంబ, బంక ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, బ్లేడ్‌బ్యాచ్‌ల ఆగడాలు పెరిగాయి...గస్తీని పెంచండి

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 16 : వన్‌టౌన్, వించిపేట ప్రాంతాలలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలు పెరిగాయయని, గస్తీని పెంచాలని కొత్తపేట సీఐ టి. గణేష్ కు శుక్రవారం భారత ఐక్య యువజన సమాఖ్య (యూవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంలో యూవైఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు మాట్లాడుతూ వన్‌టౌన్, మిల్క్‌ప్రాజెక్టు, లంబాడీపేట, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, నైజాంగేటు సెంటర్, ఫోర్‌మెన్ బంగ్లా, వించిపేట ప్రాంతాల్లో రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేసి గస్తీని ముమ్మరం చేయాలని కోరారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నేరచరిత్ర కలిగిన వారిపై గట్టి నిఘా పెంచాలన్నారు. రాత్రివేళలో మారుమూల ప్రాంతాల్లో ఆగి ఉన్న ఆటోల్లో కూర్చుని గంజాయి సేవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యువజన నాయకులు పేటేటి రాజా, కనకరాజు, సోంపల్లి రాజు, ప్రత్తిపాటి అజయ్ పాల్గొన్నారు.

శ్రీ రామానగర్ రూపాబాయమ్మ ట్రస్ట్

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: స్థానిక కందులవారివీధిలో ఉన్న శ్రీ రామానగర్ రూపాబాయమ్మ ట్రస్ట్ నూతన కమిటీ శుక్రవారం హనుమానపేటలోని ట్రస్ట్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. కొత్త కమిటీని గురువారం ప్రభుత్వం నామినేట్ చేసింది. విజయవాడ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా జే విజయలక్ష్మిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు గుండులక్ష్మి, ఎం. వెంకటరమణ, కొక్కిలిగడ్డ శివపార్వతి, సోమిశెట్టి సుబ్బారావు, కందుపోతు గురుమూర్తి, గట్ల మహేందర్‌రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

అన్నదానం, వస్త్రదానం

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: సీపీఐ నాయకుడు కొరగంజి శేఖర్‌బాబు సెంటర్‌ను ఏర్పాటు చేసిన సందర్భంగా శుక్రవారం కొరగంజి శేఖర్ బాబు బ్రదర్స్, కుటుంబ సభ్యులు వెయ్యి మందికి అన్నదానం, వస్త్రదానం చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ వైసీపీ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్, లింగమనేని శివరామప్రసాద్, ఎన్‌వీరావు, మరుపిళ్ల హనుమంతరావు,ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

సితార పార్కు స్థలంలో మందుబాబుల వీరంగం

భవానీపురం, ఫిబ్రవరి 16 : 45వ డివిజన్ సితార బస్టాప్ సమీపంలో గతంలో పార్కు నిర్మాణానికి కేటాయించిన స్థలంలో మందుబాబుల ఆగడాలు రోజురోజుకు శృతిమించుతున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్థానికంగా ప్రభుత్వ వైన్‌షాపు నుంచి కొనుగోలు చేసిన మద్యంను ఇక్కడ తాగేస్తూ అరుపులు, కేకలు వేస్తున్నారు. దీంతో ఇటు వైపుగా వెళ్లే మహిళలు, విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ బస్టాప్‌లో బస్సుల రాకపోకలు లేకపోవడంతో ఈ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకుని మందుబాబులు రెచ్చిపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు, పోలీసులు ఈ ప్రాంతంలో నిఘా ఉంచి మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.











చెప్తే చాలు.. వీడియో సిద్ధం!

కమాండ్ల ఆధారంగా నిమిషం నిడివి గల వీడియోలను రూపొందించే కొత్త ఏఐ మోడల్ 'సోర'

చాట్‌జీపీటీ సృష్టికర్త 'ఓపెన్ ఏఐ' మరో అద్భుతం

న్యూయార్క్, ఫిబ్రవరి 16: అడిగిందే తడవుగా అన్నీ చెప్పే 'చాట్ జీపీటీ'తో సంచలనం సృష్టించిన కృత్రిమ మేధ సంస్థ 'ఓపెన్ ఏఐ'.. ఇచ్చిన ప్రాంప్ట్ ఆధారంగా ఒక నిమిషం వీడియోను రూపొందించే మరో కొత్త ఏఐ మోడల్‌తో ముందుకొచ్చింది. దాని పేరు 'సోర'. చాట్ జీపీటీ 4.0 వెర్షన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడమే కాక, మనం ఇచ్చిన ప్రాంప్ట్‌ల ఆధారంగా బొమ్మల్ని కూడా రూపొంది స్తున్న సంగతి తెలిసిందే. దానికి ఇంకొంచెం అడ్వాన్స్‌డ్ వెర్షనే ఈ వీడియో ఏఐ మోడల్ 'సోర'. ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ దీని గురించి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'సోర' ఎన్ని అద్భుతాలు చేయగలదో ప్రజలకు చూపించాలని తాము అనుకుంటున్నామని.. కాబట్టి, ఎవరైనా దాన్ని పరీక్షిం చాలనుకుంటే తాము చూడాలనుకుంటున్న వీడియోకి సంబంధించి క్యాప్షన్లతో రిప్లై ఇవ్వాలని అందులో కోరారు. దీంతో చాలామంది 'ఎక్స్' యూజర్లు ఆయన ట్వీట్‌కు సమా ధానంగా పలు ప్రాంప్ట్‌లు పంపించారు. వాటిలో కొన్నింటిని ఉపయోగించి 'సోర' తయారు చేసిన వీడియోలను శామ్ ఆల్ట్‌మన్ మళ్లీ పోస్ట్ చేశారు. అయితే, కొన్ని కొన్ని వీడి యోల్లో మాత్రం చిన్నచిన్న లోటుపాట్లు ఉన్నట్టు గుర్తించా మని.. వాటిని కూడా సరిచేసే ప్రయత్నాల్లో ఉన్నామని శామ్ ఆల్ట్‌మన్ వివరించారు. ఈ మోడల్‌ను దుర్వినియోగం చేసి ప్రముఖుల పరువుకు భంగం వాటిల్లే విధంగా వీడియోలు రూపొందించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఆ దిశగా కూడా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు.




సోర రూపొందించిన వీడియోలోని దృశ్యం

ఈ లోపాలన్నింటినీ సరిచేసుకున్నాకే అందరికీ అందుబాటులోకి తెస్తామని.. ప్రస్తుతానికి దీన్ని కొంతమంది కంటెంట్ క్రియేటర్లకు, నిపుణులకు, లోపాలను గుర్తించి సరిచేసే రెడ్ టీమర్స్‌కు మాత్రమే పరిమితం చేశామని చెప్పారు.

'డాల్ ఈ'కి కొనసాగింపు..

ఓపెన్ ఏఐ సంస్థ ఇంతకుముందు ఇదే తర హాలో.. కమాండ్ ఇస్తే వీడియోలను రూపొం దించే 'డాల్ ఈ' అనే వీడియో జనరేటివ్ ఏఐపై కొంతకాలం పనిచేసింది. ఆ తర్వాత ఏమైందో ఏమో.. 'డాల్ ఈ' కోసం చేసిన రిసెర్చ్ ఆధారంగా 'సోర'ను అభివృద్ధి చేసింది. మరికొన్ని సంస్థలు కూడా ఈ తరహా టెక్స్ట్ టు వీడియో ఏఐ మోడళ్లను గతంలోనే రూపొందించాయి. అమెరికాకు చెందిన 'రన్‌వే' అనే స్టార్టప్ రూపొందించిన జెన్-2 మోడల్ ఏఐ ఈ 'టెక్స్ట్ టు వీడియో' అద్భుతాన్ని 2023లోనే సాధించింది. కాగా, జపనీస్‌లో 'సోర' అంటే ఆకాశం అని అర్థం.

లోకం తీరు



భారతీయులపై దాడులను సహించం

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: అగ్రరాజ్యం అమెరికాలో భారత సంతతి వ్యక్తులు, భారతీయ విద్యార్థులపై వరుసగా చోటుచేసుకుంటున్న దాడుల పట్ల వైట్‌హౌస్ స్పందించింది. హైదరాబాద్ విద్యార్థి బెనిగేరి శ్రేయాస్‌రెడ్డి సహా నలుగురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో.. ఇలాంటి ఘటనల నిరోధానికి బైడెన్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు పేర్కొంది. తమ దేశంలో జాతి, మతం, లింగం, మరే ఇతర కారణాలతో అయినా వివక్షకు తావులేదని స్పష్టం చేసింది. అమెరికా జాతీయ భద్రతా మండలి వ్యూహాత్మక సంబంధాల సమన్వయకర్త జాన్ కిర్బీ మీడియాతో మాట్లాడుతున్న సందర్భంగా, భారతీయులపై దాడుల ప్రస్తావన వచ్చింది. దీనిపై ఆయన స్పందిస్తూ.. "దాడులను అరికట్టేందుకు బైడెన్, ఆయన యంత్రాంగం ఆయా రాష్ట్రాలు, స్థానిక అధికారులతో కలిసి శాయశక్తులా పాటుపడుతోంది. మేం చేయగలిగినదంతా చేస్తున్నాం. ఇలాంటి ఉదంతాల్లో నిందితులను చట్టపరంగా బాధ్యులను చేస్తాం" అని కిర్బీ వివరించారు.

కేజ్రీవాల్ విశ్వాస తీర్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: మద్యం పాలసీ కేసులో ఈడీ పదే పదే సమన్లు పంపిస్తుండడం, విచారణకు హాజరు కావాలంటూ కోర్టు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో.. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తనపై, తన ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజల్లో విశ్వాసం ఉందని నిరూపించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం శాసనసభలో స్వయంగా విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బీజేపీ నేతలు తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నుతున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. కాగా, ఈ విశ్వాస తీర్మానంపై అసెంబ్లీలో శనివారం చర్చ జరగనుంది. ఢిల్లీ శాసనసభలో 70 స్థానాలకుగాను ఆప్‌కు 62 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

నేడే జీఎస్ఎల్వీ-ఎఫ్14 ప్రయోగం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16: ఇస్రో ఈ ఏడాది రెండో ప్రయోగానికి సిద్ధమైంది. వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు విలువైన సమాచారం అందించేందుకు ఉద్దేశించిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ద్వారా 2,275 కిలోల బరువున్న ఇన్‌శాట్-3డీఎస్‌ను నింగిలోకి పంపనుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు ఈ ప్రయోగం చేపట్టనుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే అన్నదాతలకు మేలు చేకూరనుంది.

క్యాన్సర్ రోగుల ఆయుష్షును పెంచే కొత్త ఔషధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: మెసోథెలియోమా అనే ప్రాణాంతక క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడి.. రోగుల ఆయుష్షును పెంచే కొత్త ఔషధాన్ని లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీ పరిశోధకులు కనుగొన్నారు. కీమోథెరపీతోపాటు ఈ తాము కొత్తగా కనుగొన్న ఏడీఐ-పీఈజీ20 (పెగర్గిమినేస్) ఔషధాన్ని కూడా అందించడం ద్వారా పరిశోధకులు మెరుగైన ఫలితాలు సాధించారు. ట్రయల్స్‌లో భాగంగా అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ, తైవాన్ దేశాలకు చెందిన 249 మంది కేన్సర్ రోగులకు కీమోథెరపీ చికిత్స అందించారు. వారిలో సగం మందికి కీమోథెరపీతోపాటు కొత్త ఔషధాన్ని కూడా ఇచ్చారు. కొత్త మందు తీసుకున్న వారి బతికే కాలం మిగిలిన రోగులతో పోలిస్తే సగటున 1.6 నెలలు పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు.

సాహితీవేత్త భాగవతుల కన్నుమూత



విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త, గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని 'ఓలి' పేరుతో ఆంగ్లంలోకి అనువదించిన భాగవతుల రాధాకృష్ణమూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన వయస్సు 82 సంవత్సరాలు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో జన్మించిన రాధాకృష్ణమూర్తి వృత్తిరీత్యా మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా పనిచేశారు. పదవీ విరమణ అనంతరం విశాఖ నగరంలోని రుషికొండలో స్థిరపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పరమేశ్వరరావుకు రాధాకృష్ణమూర్తి స్వయానా సోదరుడు. ఉమ్మడి విశాఖ జిల్లా సమస్యలు, ప్రధానంగా నీటి పారుదల ప్రాజెక్టులపై అపారమైన అవగాహన కలిగిన రాధాకృష్ణమూర్తి.. ప్రభుత్వాలకు అనేక సూచనలు చేసేవారు. అనారోగ్యానికి గురికావడంతో కొద్దికాలంగా హైదరాబాద్‌లోని పిల్లల వద్ద ఉంటున్నారు. శుక్రవారం తుది శ్వాస విడిచారు.

అన్నీ ప్రీపెయిడ్ మీటర్లే..

» దేశవ్యాప్తంగా 19.79 కోట్ల కనెక్షన్లకు బిగించాలని కేంద్ర విద్యుత్ శాఖ నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులందరినీ ప్రీపెయిడ్ మీటర్ల నెట్‌వర్క్‌లోకి తేవాలని కేంద్ర విద్యుత్ శాఖ నిర్ణయించింది. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద దేశవ్యాప్తంగా 19.79 కోట్ల కనెక్షన్లు, 52.19లక్షల దాకా పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు(డీటీఆర్), 1.88లక్షల ఫీడర్లకు ప్రీపెయిడ్/స్మార్ట్‌మీటర్లు బిగించాలనుకుంటోంది. మీటర్ల బిగింపు/అమలు ప్రక్రియపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను జారీ చేసింది. ప్రీపెయిడ్ మీటర్లు బిగించుకునేవారు ఒక నెలలో ఎంత మేర కరెంట్‌ను వాడుతున్నారో ఆ మేరకు అడ్వాన్స్‌గా డిస్కమ్‌లకు చెల్లించి రీచార్జ్ చేసుకోవాలి. రీచార్జ్ మొత్తం అయిపోగానే వినియోగదారు మొబైల్‌కు మూడుసార్లు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపాలి. సదరు వినియోగదారుకు గరిష్ఠంగా రూ.300 క్రెడిట్ ఇవ్వాలని కేంద్రం సూచించింది. అంటే రూ.1,000 రీచార్జ్ చేసుకుంటే అదనంగా రూ.300 కరెంట్‌ను వాడుకునే వెసులుబాటు ఇవ్వాలి. ముందు చెల్లించిన రూ.1000లో వినియోగం పూర్తవుతూ రూ.50 మిగిలి ఉండగానే రీచార్జ్ చేసుకునేలా తొలిసందేశం పంపాలి. రీచార్జ్ మొత్తం అయిపోయాక మరోసారి, క్రెడిట్‌గా ఇచ్చిన రూ.200 కరెంట్‌ను వాడుకున్న తర్వాత మూడోసారి సందేశం ఇచ్చి డిస్‌కనెక్ట్(విద్యుత్ సరఫరా నిలిపివేయాలి) చేయాలని కేంద్రం పేర్కొంది. వినియోగదారుడు మళ్లీ రీచార్జ్ చేసుకున్న 15 నిమిషాల్లోపే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేసింది. ప్రీపెయిడ్ మీటర్లు బిగించాక మొబైల్‌లో సంబంధిత యాప్ డౌన్‌లోడ్ చేయాలని, వినియోగదారుడు ఈ యాప్ ఆధారంగా విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకోవొచ్చని పేర్కొంది. దీని ద్వారా ఇంట్లో లేనప్పుడు మీటర్‌ను ఆఫ్ చేయొచ్చు.

కాంగ్రెస్ ఖాతాల స్తంభన!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి రూ.210 కోట్ల ఆదాయపు పన్ను కట్టాలంటూ తమ పార్టీకి చెందిన నాలుగు ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేసిందని, వీటిలో యువజన కాంగ్రెస్ ఖాతా కూడా ఉన్నదని తెలిపారు. సదరు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొంత ఆలస్యంగా ఐటీ రిటర్నులను దాఖలు చేశామని, ఈలోపే ఈ చర్య తీసుకున్నార న్నారు. ఐటీ ఆదేశాలు బుధవారం జారీ అయ్యాయని చెప్పారు. అయితే, ఐటీ శాఖ స్తంభింపజేసిన కాంగ్రెస్ ఖాతాల సంఖ్య తొమ్మిదని తర్వాత వెల్లడైంది. కాగా, ఐటీ ఆదేశాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేత వివేక్ టంకా ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. తమ ఖాతాలను స్తంభనను కొనసాగిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాము పాల్గొనే పరిస్థితి ఉండబోదని ట్రిబ్యునల్‌కు తెలిపారు. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్.. బ్యాంకు ఖాతాల్లో కనీసం రూ.115 కోట్ల మొత్తం ఉంచాలని, ఆ పైనున్న సొమ్మును మాత్రమే వినియోగించుకోవాలని, బుధవారం తదుపరి విచారణ జరుపుతామని తెలిపింది. దీనిపై మాకెన్ స్పందిస్తూ.. ట్రిబ్యునల్ రూ.115 కోట్ల వరకూ నిధులను స్తంభింపజేసిందని, అయితే, ప్రస్తుతం తమ కరెంటు ఖాతాల్లో అంత మొత్తం లేదని, అంటే తమ ఖాతాల స్తంభన కొనసాగుతున్నట్లేనని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వేతనాల్లోంచి పార్టీకి ఇచ్చిన రూ.14.4 లక్షలతోపాటు ప్రజల నుంచి తాము సేకరించిన విరాళాలను కూడా స్తంభింపజేశారని తెలిపారు. విద్యుత్ బిల్లులు, ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు కూడా తమ వద్ద డబ్బు లేదని, తాము జారీ చేసిన చెక్కులను బ్యాంకులు తిరస్కరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల ఖాతాలు స్తంభింపచేయడమంటే ప్రజాస్వామ్యాన్ని స్తంభింపచేయడమేనన్నారు.

నియంతృత్వం ముందు ఎన్నటికీ మోకరిల్లం: రాహుల్ గాంధీ

తమ బ్యాంకు ఖాతాల స్తంభనను ఖర్గే తీవ్రంగా ఖండించారు. అధికారదాహంతో ఉన్న కేంద్రప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద ప్రతిపక్ష పార్టీపై చేపట్టిన ఈ చర్య ప్రజాస్వామ్యంపై తీవ్రమైన దాడి అని పేర్కొన్నారు. 'రాజ్యాంగ వ్యతిరేకంగా బీజేపీ సేకరించిన డబ్బులు ఆ పార్టీ వద్దే ఉంటాయి కానీ, ప్రజల నుంచి మేం సేకరించిన విరాళాల్ని మాత్రం స్తంభింపజేస్తారు. అందుకనే, మోదీ మళ్లీ గెలిస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని నేను ఇప్పటికే హెచ్చరించా. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, బహుళ పార్టీ వ్యవస్థను కాపాడమని న్యాయవ్యవస్థను కోరుతున్నా' అని ఖర్గే విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ బలం డబ్బుల్లో లేదని, ప్రజల్లో ఉందని, నియంతృత్వం ముందు ఎన్నటికీ మోకరిల్లబోమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాజకీయ సమతుల్యతను కాపాడటానికి ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవటంతో.. ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకొని తమ ఖాతాలను స్తంభింపజేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు.



జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ జీపును నడుపుతున్న తేజస్వి

ఇండియా అధికారంలోకి వస్తే
రైతుల డిమాండ్లకు ఆమోదం

» జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

మోహనియా, ఫిబ్రవరి 16: ఓ బడా వ్యాపార సంస్థకు రక్షణ బడ్జెట్ భారీగా సమర్పించేందుకే అగ్నివీర్ స్కీమ్‌ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అగ్నివీర్‌లకు జీతభత్యాలు చెల్లించకుండా ఆ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా చేశారని విమర్శించారు. బిహార్ రాష్ట్రం కైమూర్ జిల్లా మోహనియాలో శుక్రవారం భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. "సాధారణ సైనికుల్లా అగ్నివీర్‌లకు జీతం రాదు. పెన్షనూ రాదు. ఆర్మీ క్యాంటీన్‌లలోకీ వారిని రానివ్వరు" అని రాహుల్ అన్నారు. అంతకుముందు బిహార్‌లోని రోహతాస్ వద్ద కిసాన్ న్యాయ్ పంచాయత్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ తమ కూటమి అధికారంలోకి వస్తే దీర్ఘకాలంగా పెండింగ్‌లో రైతుల డిమాండ్లను ఆమోదిస్తుందని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధర లభించేలా చట్టబద్ధమైన గ్యారెంటీ అమలు చేస్తామన్నారు. రాహుల్ యాత్రలో ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ మెరిశారు. రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు ప్రయాణిస్తున్న జీపును తేజస్వి స్వయంగా నడిపారు. న్యాయ్ యాత్ర శుక్రవారం సాయంత్రం యూపీలోకి ప్రవేశిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ తెలిపారు. యూపీలోని చందౌలిలోయాత్రలో పాల్గొనాల్సిన ప్రియాంక గాంధీ ఆరోగ్యం బాగోలేనందున రాలేదు.

ఎన్ఆర్ఐతో వివాహానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

» న్యాయశాఖకు లా కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భారత పౌరులు, ఎన్ఆర్ఐల మధ్య వివాహాల్లో జరుగుతున్న మోసాలపై లా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని అరికట్టడానికి సమగ్ర చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. తప్పుడు హామీలు, అసత్య సమాచారం, జీవిత భాగస్వామిని వదిలేయడం వంటి మోసాలను అరికట్టడానికి ఇటువంటి వివాహాలను తప్పనిసరిగా భారత్‌లోనే రిజిస్టర్ చేయాలని సిఫారసు చేసింది. ఇంకా అనేక కట్టుదిట్టమైన నిబంధనలతో కూడిన నివేదికను జస్టిస్ రుతురాజ్ అవస్థీ నేతృత్వంలోని లా కమిషన్ కేంద్ర న్యాయశాఖకు శుక్రవారం సమర్పించింది. "భారత పౌరులు, ఎన్ఆర్ఐల మధ్య జరుగుతున్న వివాహాలు మోసపూరితంగా మారి, భారతీయ జీవిత భాగస్వాములను ముఖ్యంగా మహిళలను ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టే ధోరణి పెరుగుతోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఎన్ఆర్ఐలు/ఓఐసీలు, భారత పౌరుల మధ్య జరిగే అన్ని వివాహాలను తప్పనిసరిగా భారత్‌లోనే రిజిస్టర్ చేయాలని సిఫారసు చేస్తున్నాం. విడాకులు, భరణం, పిల్లల సంరక్షణ, ఎన్ఆర్ఐలు/ఓఐసీలకు సమన్లు లేదా జ్యుడీషియల్ డాక్యుమెంట్లు అందించడం వంటి అంశాలకు సంబంధించి కొత్త చట్టంలో నిబంధనలు ఉండాలి' అని సిఫారసు చేసింది. ఎన్ఆర్ఐల వైవాహిక స్థితిని ప్రకటించడం, దంపతుల పాస్‌పోర్ట్‌ను ఒకదానితో మరొకటి లింక్ చేయడం, వాటిపై వివాహ రిజిస్ట్రేషన్ నంబరు పేర్కొనడం తప్పనిసరి చేయడానికి గాను పాస్‌పోర్ట్ చట్టం-1967లో అవసరమైన సవరణలు చేయాలంది. ఇటువంటి వివాహాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి దేశీయ కోర్టులకు అధికారం ఉండాలని లా కమిషన్ పేర్కొంది.

మణిపూర్‌లో మళ్లీ హింస

» భద్రత బలగాల కాల్పుల్లో ఇద్దరి మృతి

చురచందాపూర్, ఫిబ్రవరి 16: మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. కుకీ-జో గిరిజనులు అధికంగా ఉండే చురచందాపూర్‌లో గురువారం రాత్రి భద్రతా బలగాలు కాల్పులు జరపడంతో ఇద్దరు మరణించారు. సుమారు 25 మంది గాయపడ్డారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా 144వ సెక్షన్ విధించింది. అయిదు రోజుల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను రద్దు చేసింది. సాయుధ తిరుగుబాటుదార్లతో ఓ హెడ్‌కానిస్టేబుల్ సెల్ఫీ దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడం ప్రస్తుత సమస్యకు కారణమయింది. సయాంలాల్ పౌల్ అనే హెడ్ కానిస్టేబుల్ ఓ సాయుధుడు, మరికొందరు గ్రామ రక్షణ వాలంటీర్లతో కలిసి ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చింది. ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కిందికి వస్తుందని భావించి ఆ హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఇందుకు నిరసనగా సుమారు నాలుగువందల మంది ఎస్పీ కార్యాలయం చుట్టుముట్టి ఆందోళనకు దిగడంతో పోలీసులు కాల్పులు జరిపారు. కాగా, పోలీసుల తీరుపై ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. 24 గంటల్లోగా జిల్లాను విడిచి వెళ్లాలని ఎస్పీని హెచ్చరించింది.

బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించండి

» రాష్ట్రపతికి విన్నవించిన ఎస్సీ కమిషన్

కోల్‌కతా, ఫిబ్రవరి 16: బెంగాల్లోని బంగ్లా సరిహద్దు గ్రామం సందేశ్‌ఖాలీలో అధికార టీఎంసీ నేతలు దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, దళిత మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలకు సంబంధించి జాతీయ ఎస్సీ కమిషన్ శుక్రవారం రాష్ట్రపతిని కలిసి నివేదికను సమర్పించింది. కమిషన్ ఛైర్మన్ సందేశ్ హల్దర్ విలేకరులతో మాట్లాడుతూ, బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతికి విన్నవించామని చెప్పారు. తగిన చర్య తీసుకుంటామని రాష్ట్రపతి ముర్ము తమకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో సందేశ్‌ఖాలీ, పరిసరాల్లోని ఐదు గ్రామాల్లో 144 సెక్షన్‌ను విధించారు. సందేశ్‌ఖాలీ గ్రామానికి వెళ్లేందుకు కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

ఐక్య రాజ్య సమితికి అన్నదాతలు

డిమాండ్ల పరిష్కారంలో చొరవ చూపాలని విన్నపం.. పంజాబ్, హరియాణా హైకోర్టు సీరియస్

» పిటిషన్‌ను వాపస్ తీసుకోవాలని సూచన.. రైతుల భారత్ బంద్ పాక్షికం



టియర్ గ్యాస్‌తో రైతులను చెదరగొడుతున్న పోలీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణ మాఫీ, అన్నదాతలకు పింఛన్లు తదితర డిమాండ్లతో ఉవ్వెత్తున సాగుతున్న రైతు ఉద్యమం ఐక్య రాజ్య సమితికి చేరింది. రైతుల పక్షాన ఈ విషయంలో జోక్యం చేసుకుని డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని పిటిషనర్ ఉదయ్ ప్రతాప్ సింగ్.. ఐక్య రాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియోకు లేఖ రాశారు. అయితే, దీనిపై పంజాబ్, హరియాణా కోర్టు సీరియస్ అయింది. "ఇదేం పద్ధతి.. రైతుల డిమాండ్ల విషయంలో జోక్యం చేసుకుని సహకరించాలని హైకోర్టును ఆశ్రయించారు. సంబంధింత అంశం మా పరిశీలనలో ఉంది. అది విచారణలో ఉండగానే ఐక్య రాజ్య సమితిని ఎలా ఆశ్రయిస్తారు..?" అని తాత్కాలిక చీఫ్ జస్టిస్ సంధావాలియా, జస్టిస్ లాపితా బెనర్జీ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఐక్య రాజ్య సమితిలో వేసిన పిటిషన్‌ను వాపస్ తీసుకోవాలని హైకోర్టు కోరగా.. పిటిషనర్ అంగీకరించారు. కాగా, రైతుల ఆందోళనకు సంబంధించి రెండు పిటిషన్లపై పంజాబ్, హరియాణా హైకోర్టులో విచారణ నడుస్తోంది. ఇందులో ఒకటి హరియాణాలో ఇంటర్నెట్ నిషేదం, సరిహద్దుల మూసివేతపై.. మరొకటి.. ఆందోళన చేస్తున్న రైతులు రహదారులను దిగ్బంధించడంపై కోర్టులో వాదనలు నడుస్తున్నాయి. గురువారం ఈ అంశాలపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఐరాస విషయం తెలిసి సీరియస్ అయింది.

నాలుగో రోజూ కొనసాగిన ఆందోళనలు..

పంజాబ్, హరియాణా, యూపీ రైతులు చేస్తున్న ఆందోళనలు నాలుగో రోజూ కొనసాగాయి. అంబాలా సమీపంలోని శంభూ సరిహద్దుల్లోని బ్యారికేడ్ల దిశగా కదిలిన రైతులను చెదరగొట్టేందుకు హరియాణా పోలీసులు టియర్ గ్యాస్‌ను వదిలారు. శంభూ వద్ద ఆందోళనలో పాల్గొన్న వృద్ధుడు(78) గుండెపోటుతో మరణించాడు. అన్నదాతల ఆందోళనకు మద్దతుగా నిలవాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన భారత్ బంద్ పిలుపునకు దేశవ్యాప్తంగా పలు పార్టీలు, కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. అయితే బంద్ పాక్షికంగా జరిగింది. పంజాబ్, హరియాణాలో మాత్రమే బంద్ తీవ్రత కనిపించింది. కాగా, రైతు సంఘాలతో కేంద్ర మంత్రులు జరిపిన చర్చలు మూడు సార్లు విఫలం కావడంతో శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా..మంత్రులు అర్జున్ ముండా, గోయల్‌తో సమావేశమయ్యారు. రైతుల డిమాండ్లపై చర్చిందుకు కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతలు ఆదివారం నాలుగో దఫా సమావేశం కానున్నారు.

'రాజ్యసభ' ధనవంతుల్లో జయాబచ్చన్ టాప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: రాజ్యసభకు పోటీ చేస్తున్న అభ్యర్థులలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ సతీమణి జయాబచ్చన్ అత్యధిక ఆస్తులు కలిగి ఉన్నారు. తన భర్తకు, తనకు కలిపి మొత్తం రూ.1,578 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఎస్పీ తరఫున ఆమె ఐదోసారి రాజ్యసభకు పోటీ చేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో వారి ఆస్తుల వివరాలను వెల్లడించారు. ప్రముఖులలో తొలిసారి రాజ్యసభకు పోటీ చేస్తున్న ఏఐసీసీ మాజీ చీఫ్ సోనియా గాంధీ 90 వేల నగదుతో పాటు మొత్తం రూ.12.53 కోట్ల ఆస్తులు ఉన్నట్టు ప్రకటించారు. ఇటీవలే బీజేపీలో చేరిన కాంగ్రెస్ నేత, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ స్థిర, చరాస్తులు రూ.68 కోట్లు ఉన్నట్టు వెల్లడించారు. కాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి వైసీపీ తరఫున రాజ్యసభకు పోటీ చేస్తున్న అభ్యర్థులలో మేడా రఘునాథరెడ్డి అత్యధికంగా రూ.475 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు 84,560 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రాడార్, భారీ టార్పెడోలు, మీడియం రేంజ్ మారిటైం గూఢచర్య వ్యవస్థ, ఫ్లైట్ రీఫ్యూయల్ ఎయిర్‌క్రాఫ్ట్, సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియోలను సమకూర్చుకునేందుకు పచ్చజెండా ఊపింది. 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా భారతీయ సంస్థల నుంచే ఈ కొనుగోళ్లు చేపట్టనున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది. భారత నావికాదళం, ఇండియన్ కోస్ట్ గార్డ్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి మధ్యశ్రేణి సముద్ర గూఢచర్య వ్యవస్థను, మల్టీమిషన్ మారిటైం ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలుకు ఆమోదించినట్లు రక్షణ శాఖ పేర్కొంది. అదేవిధంగా గగనతల రక్షణ వ్యవస్థలను ముఖ్యంగా తక్కువ ఎత్తులో, నిదానంగా ఎగిరే చిన్న లక్ష్యాలను గుర్తించే సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో ఎయిర్ డిఫెన్స్ వ్యూహాత్మక నియంత్రణ రాడార్ల కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. వైమానిక దళం పరిధిని పెంచడానికి ఫ్లైట్ రీఫ్యూయలర్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుకు ఆమోదించింది. ఈ ప్రతిపాదనలకు కేబినెట్ కమిటీ త్వరలోనే తుది ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

నోటిఫయబుల్ డిసీజ్‌గా క్యాన్సర్

కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో మహమ్మారికి అడ్డుకట్ట.. తొలిదశలో గుర్తిస్తే ప్రాణాలను కాపాడొచ్చు

» సర్వైకల్ క్యాన్సర్ నిరోధానికి కేంద్రప్రభుత్వ చర్యలు భేష్

» బడ్జెట్‌లో ప్రస్తావనపై ఆంకాలజిస్టు నోరి దత్తాత్రేయుడు

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల వయసు బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్ నిరోధానికి కీలకచర్యలు చేపట్టనున్నట్లు, ఆ దిశగా టీకా కార్యక్రమాన్ని ప్రోత్సహించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించడంపై.. ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ప్రశంసించారు. భారతదేశంలో మహిళలకు వస్తున్న క్యాన్సర్లలో రెండోస్థానంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఉందని.. ఏటా ఇండియాలో 85 వేల సర్వైకల్ క్యాన్సర్ కేసులు, దాని కారణంగా 50 వేల మరణాలు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో.. సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించే కార్యక్రమాలపై కేంద్రం దృష్టి సారించి, బడ్జెట్‌లో ప్రకటించడం ప్రశంసనీయమని.. కీలకమైన ప్రజారోగ్య సమస్య పరిష్కారం దిశగా వేసిన మెచ్చుకోదగ్గ అడుగు అని ఆయన పేర్కొన్నారు. "దేశంలో రోజుకు దాదాపు 150 మంది మహిళల ప్రాణాలను బలిగొంటున్న సర్వైకల్ క్యాన్సర్ నుంచి కాపాడేందుకు 9-14 ఏళ్ల బాలికలకు టీకాలు వేయించడం గొప్ప విషయం" అని కొనియాడారు. క్యాన్సర్ కేసులను నివారించేందుకు.. వ్యూహాత్మకమైన, ప్రణాళికతో కూడిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, క్యాన్సర్ కేసులను తొలి దశల్లోనే గుర్తించేలా స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. 2018లో 'నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'ను ఏర్పాటు చేయడాన్ని ఆ మహమ్మారిపై పోరులో కీలక మైలురాయిగా అభివర్ణించిన డాక్టర్ నోరి.. చేయాల్సింది ఇంకా చాలా ఉందని స్పష్టం చేశారు. "క్యాన్సర్ స్క్రీనింగ్, దాన్ని తొలి దశల్లోనే గుర్తించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడం, క్యాన్సర్ బారి న పడ్డవారికి అత్యాధునిక చికిత్సలను, అందుబాటు ధరల్లోకి తేవడం చాలా కీలకం. అంతే కాదు.. అన్ని రాష్ట్రాలూ క్యాన్సర్‌ను నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించాలి" అని ఆయన సూచించారు. దేశంలో ప్రస్తుతం 3-4 రాష్ట్రాలు మాత్రమే క్యాన్సర్‌ను నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించాయి. ఏదైనా వ్యాధి ని నోటిఫయబుల్ డిసీజ్‌గా ప్రకటిస్తే.. కొత్త కేసు నమోదైనప్పుడు డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆస్పత్రులు ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాయి. ఇటీవల ప్రపంచాన్ని వణికించిన కరోనా కేసులు ఏ రోజు ఎన్ని నమోదైందీ ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్ల నుంచి పూర్తి సమాచారం ప్రభుత్వానికి చేరింది గుర్తుందా? అలాగే క్యాన్సర్‌ను కూడా నోటిఫయబుల్ డిసీజ్‌గా ప్రకటిస్తే ప్రభుత్వం దగ్గర పూర్తి వివరాలు ఉంటాయని.. తద్వారా క్యాన్సర్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి క్యాన్సర్ కేర్‌ను సమన్వయం చేసుకోవడం సులభమవుతుందని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ఈ చర్యలను అమలు చేస్తే దేశంలో క్యాన్సర్ కేసుల పెరుగుదలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు.



నోరి దత్తాత్రేయుడు

రష్యా ప్రతిపక్ష నేత నావల్నీ జైలులో మృతి



మాస్కో, ఫిబ్రవరి 16: రష్యా అధ్యక్షుడు పుతిన్ బద్ధశత్రువు, ప్రభుత్వ అవినీతిపై ఉద్యమించిన ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ (47) శుక్రవారం జైలులో మరణించినట్టు ప్రిజన్ సర్వీస్ ఒక ప్రకటనలో తెలిపింది. 'జైలులో కొంతసేపు నడిచిన తర్వాత ఆయన అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయారు. వెంటనే వైద్య సిబ్బంది వచ్చి పరీక్షించారు. అయితే ఆయనను కాపాడేందుకు చేసే ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన మరణించారని వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంద'ని ఆ ప్రకటన వివరించింది. నావల్నీ తీవ్రవాద అభియోగాలతో పాటు పలు కేసుల్లో 19 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. రష్యాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నావల్నీ మృతి అనుమానాలు రేకెత్తిస్తోంది. కాగా, 2020లో సైబీరియా పర్యటనలో ఉన్నప్పుడు నావల్నీపై విషప్రయోగం జరగడం అప్పట్లో సంచలనం సృష్టించింది.



చంద్రబాబు నివాసంలో రాజశ్యామల యాగం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో శుక్రవారం రాజశ్యామల యాగాన్ని చేపట్టారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో మూడు రోజుల పాటు ఈ యాగం జరగనున్నది. తొలి రోజు జరిగిన యాగం క్రతువు, పూజా కార్యక్రమాల్లో చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి పాల్గొన్నారు. రాజశ్యామల యాగంలో భాగంగా 50 మంది రిత్వికులు మూడు రోజుల పాటు యాగ క్రతువులు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం పూర్ణాహుతితో యాగం ముగియనున్నది.


జగన్‌రెడ్డీ నీ సినిమా అయిపోయింది

- కాస్కో... అసలు సినిమా ఇప్పుడు మొదలయింది
- జగన్ క్రూరత్వానికి అద్దంపట్టే 'రాజధాని ఫైల్స్'
- తెలుగు ప్రజలందరూ ఈ సినిమా చూడాలి: బాబు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డీ నీ సినిమా అయిపోయింది. అసలు సినిమా ఇప్పుడు మొదలవుతుంది... కాస్కో..!' అని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. 'రాజధాని ఫైల్స్' సినిమాకు హైకోర్టు అనుమతించిన నేపథ్యంలో ఎక్స్ వేదికగా స్పందిస్తూ తెలుగు ప్రజలంతా ఆ సినిమా చూడాలని, వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. 'సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి ఒక ప్రాంతంపై కక్షగట్టి.. అది కూడా రాష్ట్ర రాజధానిపై పగబట్టి సర్వనాశనం చేసిన ప్రాంతం అమరావతి. ఇది ఒక చరిత్రాత్మక విషాదం. దీని కోసం కులాల కుంపట్లు రాజేశాడు. అధికార బలం ఉపయోగించి ఉద్యమకారులను చిత్రహింసలకు గురి చేశాడు. ఈ కుట్రలకు, దారుణాలకు అద్దం పట్టిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. జగన్ క్రూరత్వానికి, వైసీపీ విధ్వంసానికి నాశనమైన ఒక రాజధాని... దాని కోసం ఎన్నో త్యాగాలు చేసిన ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను కళ్లకు కట్టింది ఈ చిత్రం. అందుకే చిత్రం విడుదలను ఆపడానికి జగన్ శతవిధాలా ప్రయత్నించాడు. కానీ కోర్టు ఆ ఆటలను సాగనివ్వలేదు' అని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర హితం కోరే వారంతా 'రాజధాని ఫైల్స్' సినిమాను చూడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కోరారు. 'రాజధాని ఫైల్స్ గొప్ప సందేశాత్మక చిత్రం. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జరుగుతున్న యదార్థ సంఘటనల్ని, అమరావతి కోసం 1,500 రోజులకుపైగా అలుపెరగని పోరాటాన్ని చేస్తున్న ఉద్యమ నేపథ్యాన్ని కేవలం 150 నిమిషాల వ్యవధిలో సహజ సిద్ధంగా చిత్రీకరించడం నిజంగా అభినందనీయం' అని అచ్చెన్న పేర్కొన్నారు.

యువతను వంచించిన వైసీపీ సర్కారు

- వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఉమ్మడి మేనిఫెస్టో: పవన్



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెంచుకున్న యువతను వైసీపీ ప్రభుత్వం వంచించిందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మండిపడ్డారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు, గ్రూప్-2 ఉద్యోగార్థుల ఆందోళనలను పార్టీ నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నెల 25న గ్రూప్-2 నిర్వహిస్తామని చెప్పారని, అదేరోజు బ్యాంకు పీవో ఉద్యోగాలకు మెయిన్స్ ఉందని, ఏమాత్రం ప్రణాళిక లేకుండా ఏపీపీఎస్సీ షెడ్యూల్ ఇవ్వడంపై నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారని వివరించారు. దీనిపై పవన్ స్పందిస్తూ... జిల్లాల పర్యటనలో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థుల ఆవేదనను తెలుసుకున్నానని, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమైన వాళ్లూ ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. పాదయాత్రలో అడిగినవాళ్లకి, అడగనివాళ్లకి హామీలు గుప్పించిన జగన్.. అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలనూ క్షోభకు గురిచేశారని మండిపడ్డారు. 23వేల టీచర్ పోస్టులకు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడేమో అసలు డీఎస్సీ ఎందుకో చెప్పండని సీఎం సలహాదారులే దబాయించడం వైసీపీ మోసాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రకటన ఇచ్చి ఏడాది దాటినా ఇప్పటికీ నియామకాలు చేయలేదని చెప్పారు. నిరుద్యోగుల ఆందోళనను గుర్తించే మనసు ఈ పాలకులకు లేదన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీని కూడా గాలికొదిలేశారని ఆరోపించారు. త్వరలో విడుదల చేసే ఉమ్మడి మేనిఫెస్టో యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని పవన్ హామీ ఇచ్చారు.

రాజ్యసభకు వైవీ, గొల్ల, మేడా ఏకగ్రీవమే..!

- బరిలో ఆ ముగ్గురే.. ఇండిపెండెంట్ నామినేషన్ తిరస్కరణ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల బరిలో వైసీపీ అభ్యర్థులు ముగ్గురే మిగిలారు. దీంతో వారి ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే. స్వతంత్ర అభ్యర్థి పెమ్మసాని ప్రభాకర నాయుడు అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తూ 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలు చేసిన ముగ్గురు అభ్యర్థులు... వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం. విజయరాజు ఆమోదించారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తి అయింది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 20 వరకూ గడువు ఉంది. ఆరోజున వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు విజయం సాధించినట్లుగా రిటర్నింగ్ అధికారి విజయరాజు అధికారికంగా ప్రకటిస్తారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.





గజపతినగరం మండలం గంట్యాడ సభలో లోకేశ్ ప్రసంగానికి సంఘీభావం తెలుపుతున్న మహిళలు, విజయనగరం వేదికపై టీడీపీ-జనసేన నాయకుల ఐక్యతారాగం

'ఉమ్మడి' మోసం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. వాషింగ్టన్ డీసీ రాజధానిని తలదన్నే విధంగా రాజధాని నిర్మిస్తామని సైకో జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధానికి ఆయన మద్దతిచ్చారని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక మాటమార్చి మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట చేశారని దుయ్యబట్టారు. 'గత నాలుగేళ్లుగా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని దౌర్భాగ్య దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారు. 30 వేల ఎకరాలను అమరావతి రైతులు త్యాగం చేశారు. నాలుగేళ్లుగా వారిని వేధిస్తూ వారి త్యాగాలకు ఫలితం లేకుండా చేశారు. కేసులు, లాఠీచార్జీలు, అణచివేతలకు పాల్పడ్డారు. ఇప్పుడు మళ్లీ పదేళ్లు వెనక్కి వెళ్లేలా హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంటున్నారు. ప్రజలను మోసగిస్తున్నారు' అని చెప్పారు. వైసీపీ పాలనలో అమ్మలాంటి ఉత్తరాంధ్రను ఎలాంటి అభివృద్ధి చేయకుండా వెనక్కి పెట్టారని మండిపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..

అరాచక పాలనకు 2 నెలలే!

ప్రశాంతమైన విజయనగరాన్ని సైతం అరాచకాలు, అణచివేతలు, భూ దందాలు, ఇసుక మాఫియా, మద్యం మాఫియా, డ్రగ్స్, గంజాయి, అణచివేతలు, వేధింపుల జిల్లాగా మార్చేశారు. ప్రశాంత జిల్లాను అశాంతి జిల్లాగా మార్చేశారు. ఈ అరాచక పాలన ఇంకా రెండు నెలలే. వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. ఉత్తరాంధ్రలో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానికంగానే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. భోగాపురం విమానాశ్రయం మన హయాంలోనే మంజూరైంది.

ధైర్యం ఉంటే రండి..

ఇటీవల ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. చొక్కా మడత పెట్టాలని కార్యకర్తలకు పిలుపిచ్చారు. ధైర్యముంటే రండి.. చొక్కా మడతేద్దాం. ముఖ్యమంత్రి కుర్చీనే ప్రజలు మడత పెట్టే రోజులు 2 నెలల్లో ఉన్నాయి. నాపై 22 కేసులున్నాయి. హత్యాయత్నం కేసు పెట్టారు. ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి. భూమ్ భూమ్ బ్యాచ్‌కు భయపడేది లేదు. నేను ప్రజల్లోనే తిరుగుతున్నా. సైకో జగన్ మాత్రం పరదాల చాటున తిరుగుతున్నాడు. మరి ఎవరు భయపడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి. 3,132 కిలోమీటర్ల పాదయాత్ర చేశా. జగన్ పెట్టిన అడ్డంకులు, అణచివేతలు, దౌర్జన్యాలకు వెరవలేదు. అవినీతి మరక లేని చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టారు. విజయనగరం మాన్సాస్ ట్రస్టుపై కన్నేశారు. రామతీర్థం ఆలయంలో రాముని విగ్రహం తల నరికేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలను మాఫియా డాన్లు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ దోచుకున్నారు. భూమ్‌భామ్ అరాచక ముఠాల వైసీపీ ప్రభుత్వాన్ని పైడితల్లి అమ్మ, రాముడు క్షమిస్తారా?

ఇసుక డబ్బులన్నీ జగన్, బొత్సకే

మన ప్రభుత్వ హయాంలో ఇసుకను ఉచితంగా అందించాం. ఇప్పుడు వైసీపీ నాయకులు అమ్ముకుంటున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.5వేలకు కొనుక్కోవలసిన పరిస్థితి వచ్చింది. ఈ డబ్బులన్నీ మంత్రి బొత్సకు, సీఎం జగన్‌కు పంపిస్తున్నారు. జగనన్న కాలనీలకు ఎకరం రూ.10 లక్షలకు కొనుగోలు చేసి రూ.38 లక్షలకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అమ్ముకున్నారు. యాత్ర-2 సినిమాతో తమ అంతిమ యాత్ర ఖాయమని వైసీపీ నేతలకు అర్థమైంది. పోలవరం చంద్రబాబు అయితే పిల్ల కాల్వ జగన్. కియా మోటార్స్ బాబు అయితే కోడి కత్తి డ్రామా జగన్. బాబుకు బ్రాండ్ ఉంటే జగన్‌కు భూమ్‌భూమ్ బ్యాచ్ ఉంది.

టైం మీరే చెప్పండి

వైసీపీ పాలనపై రైతులు, మహిళలు, యువత వద్దకు వెళ్దామా? సీఎం సొంత మీడియా, వైసీపీ నేతలు సిద్ధమేనా? సంపూర్ణ మద్య నిషేధం విధించాకే మళ్లీ ఓట్లడిగేందుకు వస్తానని హామీ ఇచ్చారు. అది ఏమైంది? పెంచిన నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు, చెత్తపైనా పన్ను.. వీటన్నింటిపై చర్చకు సిద్ధమా? పీల్చే గాలిపైనా పన్ను వేసే రోజులు వస్తున్నాయి. యువతకు ఉద్యోగాలు లేవు. గ్రూప్-1, గ్రూప్-2 లేదు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను దగా చేస్తున్నారు. దీనిపై యువత వద్దకు వెళ్దామా? టైం మీరే చెప్పండి.

టికెట్ రాలేదని నిరుత్సాహపడొద్దు!

- పొత్తులతో నష్టపోయినవారికే పెద్దపీట
- టీడీపీ నేతలతో బాబు టెలి కాన్ఫరెన్స్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పొత్తుల వల్ల నష్టపోయిన వారికి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యం ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. టికెట్ రాలేదని ఎవరూ నిరుత్సాహపడొద్దని.. పార్టీని నమ్ముకున్న వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల మంది పార్టీ నేతలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సన్నద్ధత, మిత్రపక్షాలతో పొత్తుల గురించి మాట్లాడారు. 'పొత్తులు, సీట్ల సర్దుబాటు ఉంటాయి. అవన్నీ కొలిక్కి రావడానికి సమయం పడుతుంది. తర్వాత అభ్యర్థుల ప్రకటన ఉంటుంది. పొత్తులకు సహకరించాలి. రాజకీయంగా నష్టపోయినా పొత్తు ధర్మంతో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చి అవకాశాలు కల్పిస్తాం. పార్టీని గెలిపించి అధికారంలోకి తీసుకొస్తే అందరికీ ఏదో ఒక అవకాశం వస్తుంది. ప్రతిపక్షంలో అనేక బాధలు పడ్డాం. రాష్ట్రం కూడా నష్టపోయింది. వైసీపీని ఇంటికి పంపితేనే అన్ని సమస్యలకూ పరిష్కారం వస్తుంది' అని పేర్కొన్నారు. జగన్‌తో విసిగిపోయిన వైసీపీ నేతలు అనేక మంది పార్టీలో చేరతామని ముందుకొస్తున్నారని.. మంచివాళ్లు, పార్టీకి ఉపయోగపడతారని అనుకుంటున్న వారిని మాత్రం తీసుకుంటున్నామని చెప్పారు. అటువంటి వారి చేరికలను ఆహ్వానించి వారితో కలిసి పనిచేయాలని సూచించారు. 'రా కదలిరా' సభలు ముగుస్తున్నందున త్వరలో మరో ప్రజా చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. బీసీ సాధికార సభలకు మంచి స్పందన వస్తోందని, ప్రతి నియోజకవర్గంలో ఈ సభలను నిర్వహించాలని ఆయన పార్టీ నేతలకు చెప్పారు. జగన్ మోసం చేశారన్న భావన బీసీల్లో గట్టిగా ఏర్పడిందని.. బీసీల అభ్యున్నతికి పెద్ద పీట వేసిన టీడీపీలో వారికి ఎప్పుడూ ప్రాధాన్యం తగ్గదని స్పష్టం చేశారు. ఎన్నికలకు సమయం ఇంకా 50 రోజులే ఉన్నందువల్ల పార్టీలో అన్ని స్థాయిల నేతలు సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి 50 ఇళ్లకు ఒకరి చొప్పున కుటుంబ సారథులను నియమించాలని, ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో పార్టీ ఇచ్చిన హామీలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని.. నిర్లక్ష్యం చేయవద్దని పార్టీ నేతలకు నొక్కి చెప్పారు.



మంత్రి అంబటి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అంబటి కార్యాలయం ముట్టడి

యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 16: దగా డీఎస్సీ కాదు.. మెగా డీఎస్సీ కావాలంటూ శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని మంత్రి అంబటి రాంబాబు కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ఆందోళన చేశారు. మంత్రి అంబటి కార్యాలయంలోనే ఉండటంతో ఆందోళనకారులు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులతోపాటు వైసీపీ కార్యకర్తలు కూడా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను తోసేసి.. కొంతమందిని కాళ్లతో తన్నారు. వైసీపీ దాడిలో యూత్ కాంగ్రెస్ నాయకుడు ఘంటా గోపీ గాయపడటంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. మరికొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, విడిచిపెట్టారు.

మీరు పోలీసులా! : షర్మిల

'మీరు పోలీసులా? వైసీపీ కిరాయి మనుషులా?' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి నిలదీశారు. శుక్రవారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'పోలీసులు ఉన్నది ప్రజల కోసమా లేక అధికార పార్టీ అడుగులకు మడుగులు ఒత్తడం కోసమా? ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతల గొంతు పిసికి చంపాలని చూస్తారా? వైసీపీ గూండాలను పక్కన పెట్టిమరీ దాడులు చేయిస్తారా? ఆందోళన చేస్తున్నవారిని ఇష్టారాజ్యంగా కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారు? సత్తెనపల్లిలో యూత్ కాంగ్రెస్ నాయకులపై పోలీసులు, వైసీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. ఈ ఘటనపై డీజీపీ వెంటనే స్పందించి, కారకులైనవారిని వెంటనే సస్పెండ్ చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

ఎవరినో భుజాన మోయం!

- అది నిర్ణయించేది మోదీ, షా, నడ్డాయే
- ఆ మాటలతో పార్టీకి సంబంధం లేదు
- రాష్ట్ర బీజేపీ మీడియా ఇన్‌చార్జి స్పష్టీకరణ

మా నాయకుడే ఏపీ సీఎం కావాలి
బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యలు



అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ నాయకుడే ముఖ్యమంత్రి కావాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎవరినో భుజాన వేసుకుని మోయాల్సిన అవసరం తమకు లేదని, ఎవరినో సీఎంను చేసే పని తమది కాదని స్పష్టం చేశారు. శుక్రవారం కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న ఒక రాజకీయ పార్టీగా ఎవరినో ముఖ్యమంత్రి చేయడం మాకు అవసరమా అని ప్రశ్నించారు. '2014లో పరిస్థితి 2024లో లేదు, నిన్న నువ్వు బలమైన వ్యక్తివే కావొచ్చు.. ఈ రోజు పరిస్థితి ఏంటి..? ఎవరు ఎవరి అపాయింట్‌మెంట్ కోరుతున్నారు..? ఎవరు ఢిల్లీకి వెళ్తున్నారు..? బీజేపీకి ఏపీలో శక్తి లేనట్లయితే మా పొత్తు ఎందుకు కోరుతున్నారు..? ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు.. ఏంమాట్లాడుకున్నారో ఆ తర్వాత ఇద్దరిలో ఎవరూ చెప్పలేదు..' అని తెలిపారు. గతంలో రాజధాని మహిళా రైతులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల 75 అసెంబ్లీ సీట్లు బీజేపీకి ఇస్తేనే పొత్తు అని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర నాయకత్వం సీరియస్ అయినా మరోమారు పొత్తులపై వ్యాఖ్యలు చేయడంతో రాష్ట్ర బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం స్పందించారు. 'పొత్తులు ఏ పార్టీతో పెట్టుకోవాలి.. ముఖ్యమంత్రిగా ఎవరుండాలో జాతీయ నాయకత్వం మాత్రమే నిర్ణయిస్తుంది. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు సహా ఆ వ్యాఖ్యలు చేసే అధికారం ఎవరికీ లేదు. విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదు. సీఎంను నిర్ణయించే స్థాయి అంశాలను మోదీ, అమిత్ షా, నడ్డా వంటి వారే వెల్లడిస్తారు' అని స్పష్టం చేశారు. కాగా.. ఢిల్లీ వెళ్లిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం 20 అసెంబ్లీ స్థానాలు, ఐదు పార్లమెంటు స్థానాల్లో తాము బలంగా ఉన్నామంటూ జాతీయ నాయకత్వానికి జాబితా అందజేసినట్లు తెలిసింది.

టీడీపీ ఎంపీ అభ్యర్థులపై ప్రతిష్టంభన!

- బీజేపీతో పొత్తు తేలాకే స్పష్టత

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థుల ఎంపికపై ప్రతిష్టంభన ఏర్పడింది. బీజేపీతో పొత్తు వ్యవహారం తేలిన తర్వాతే స్పష్టత, కదలిక వస్తాయని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కొద్ది రోజుల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఎన్డీయేలోకి తిరిగి రావాలని చంద్రబాబును షా కోరారు. ఆయన కూడా అంగీకరించారు. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల కాలేదు. శని, ఆదివారాల్లో ఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగనున్నాయి. ఆ సందర్భంగా నిర్ణయం తీసుకుని ఆ తర్వాత లాంఛనంగా టీడీపీకి బీజేపీ ఆహ్వానం పలుకుతుందని అంటున్నారు. ఇంకో వైపు.. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో రాజశ్యామల యాగం జరుగుతోంది. సోమవారం (19న) ఉదయం పూర్ణాహుతితో ఇది ముగుస్తుంది. అప్పటివరకూ ఆయన ఇక్కడే ఉంటారు. తర్వాత అవసరమైతే ఢిల్లీ వెళ్లి ఎన్డీయే సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. అనంతరమే రాష్ట్రంలో పొత్తులో భాగంగా బీజేపీకి ఎన్ని అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు కేటాయిస్తారో స్పష్టత వస్తుంది. పొత్తు సమస్యలు లేవని అనుకుంటున్న చోట మాత్రం టీడీపీ తన కసరత్తు కొనసాగిస్తోంది. నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఖరారయ్యారని సమాచారం. కొద్ది రోజుల క్రితం ఆయన హైదరాబాద్‌లో చంద్రబాబును కలిసిన విషయం తెలిసిందే. నెల్లూరు లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ సీట్లలో పోటీచేసే అభ్యర్థుల విషయంలో కూడా వేమిరెడ్డి అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఆత్మకూరు విషయంలో కొంత ఉత్కంఠ నెలకొంది. అక్కడ మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నిలపాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. కానీ ఆయన తనకు వెంకటగిరి కావాలని అడుగుతున్నారు. తాజాగా ఆత్మకూరు, సర్వేపల్లి, వెంకటగిరి.. మూడు నియోజకవర్గాల్లో ఆయన పేరుతో ఫోన్ సర్వే నిర్వహించారు. సర్వేపల్లికి ఆనంను మార్చి.. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఆత్మకూరు పంపితే ఎలా ఉంటుందన్న కోణంలోనూ కసరత్తు నడుస్తోంది. ఈ విషయంలో సంప్రదింపుల బాధ్యతను వేమిరెడ్డికి అప్పగించే యోచన ఉన్నట్లు సమాచారం. నెల్లూరు వైసీపీ సిటింగ్ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా టీడీపీలోకి వస్తారని ఊహాగానాలు వ్యాపించాయి. ఆయన వస్తే నెల్లూరు జిల్లాలో ఒకట్రెండు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థుల్లో మార్పుచేర్పులు ఉండొచ్చని అంటున్నారు. ఇవన్నీ తేలడానికి కొద్ది రోజులు పట్టే అవకాశం ఉంది. అలాగే ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అదే స్థానంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయొచ్చని తెలుస్తోంది. నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ నెల 22న టీడీపీలో చేరుతున్నట్లు సమాచారం. ఆయన్ను అదే స్థానంలో అభ్యర్థిగా నిలపాలని నాయకత్వం నిర్ణయించింది. గుంటూరు లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా ప్రవాసాంధ్ర ప్రముఖుడు పెమ్మసాని చంద్రశేఖర్ ఖరారయ్యారు. రెండ్రోజుల క్రితం ఆయన ఇక్కడ చంద్రబాబును, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కలిసి మాట్లాడారు.

తిరుపతి సీటు ఎవరికో..!

తిరుపతి (ఎస్సీ) లోక్‌సభ టికెట్ టీడీపీ, బీజేపీల్లో ఏ పార్టీకి కేటాయించినా ఒక కుటుంబంలోని వారే పోటీ చేసే సూచనలు కనిపిస్తున్నాయి. కొంత కాలం క్రితం తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక జరిగినప్పుడు బీజేపీ అభ్యర్థిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి రత్నప్రభ పోటీ చేశారు. టీడీపీతో పొత్తులో ఆ సీటు బీజేపీకి లభిస్తే ఈసారీ టికెట్ తనకేనని ఆమె ఆశాభావంతో ఉన్నారు. ఆ సీటు టీడీపీకి వెళ్తే ఆమె కుమార్తె నీహారికను నిలపాలని ఆ పార్టీ అధిష్ఠానం గతంలోనే నిర్ణయించింది. నీహారిక భర్త కుటుంబం టీడీపీలో ఎప్పటి నుంచో చురుగ్గా ఉంది.

వచ్చే వారమే ఎన్డీయేలోకి టీడీపీ!

- 19 లేదా 20న ఢిల్లీకి బాబు, పవన్
- పొత్తులు, సీట్లపై అధికారిక ప్రకటన?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వచ్చే వారమే ఎన్డీయేలో తిరిగి చేరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈనెల 19న గానీ, 20న గానీ దేశ రాజధాని ఢిల్లీ వచ్చే అవకాశాలున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేసేందుకు శని, ఆదివారాల్లో ఇక్కడ బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగనున్నాయి. ఇవి పూర్తయిన వెంటనే పొత్తులపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారు. తెలుగుదేశం, జనసేన నేతలతో ఈ నెల 20న లాంఛనంగా చర్చలు ఉండవచ్చని తెలుస్తోంది. ఏయే పార్టీ ఎన్ని సీట్లకు పోటీ చేయాలో ఇప్పటికే మూడు పార్టీల మధ్య అవగాహన కుదిరిందని, ఏయే స్థానాల్లో బరిలోకి దిగాలో కూడా ఒక అభిప్రాయానికి వచ్చారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా.. ఎన్డీయేలో చేరే ఇతర పార్టీల అధినేతలందరినీ పిలిచి విస్తృత భేటీ ఏర్పాటు చేయాలని కమలనాథులు భావిస్తున్నారు.



హాజరైన కాంగ్రెస్ శ్రేణులు
సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం ఠాకూర్

26న అనంత నుంచి ప్రచారం


- మేనిఫెస్టో ప్రకటనా అక్కడే
- హాజరుకానున్న ఖర్గే, ప్రియాంక, రేవంత్, సిద్దు: మాణిక్యం ఠాగూర్

అనంతపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా రానున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అందులో భాగంగా ఈ నెల 26న ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్దరామయ్య, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరవుతారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభ వేదికపై ఎన్నికల మేనిఫెస్టో ప్రకటిస్తాం. పోలవరం, రాజధాని, ప్రత్యేక హోదా అంశాలు మేనిఫెస్టోలో పొందుపరిచాం. దివంగత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి విధేయుడు. ఆయన నిజమైన వారసురాలు వైఎస్ షర్మిల. మా పార్టీ అజెండా చాలా క్లియర్‌గా ఉంది. రాబోయే ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తాం' అని ఆయన విశ్వాసాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ చనిపోయిందంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి రఘువీరారెడ్డి తీవ్రంగా స్పందించారు. 'పగటిపూట ఖూనీలు చేసేవాళ్లు కూడా మా పార్టీ గురించి మాట్లాడితే ఎలా? దురదృష్టం కొద్దీ మూడు ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాన్ని నాశనం చేశాయి. విభజన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారు' అని రఘువీరా ఆరోపించారు.

మహీధర్, ఆమంచికి జగన్ మొండిచేయి!

కందుకూరు ఇన్‌చార్జిగా అరవింద

పరుచూరు బాధ్యతలు బాలాజీకి.. ఇద్దరితో వైసీపీ ఏడో జాబితా



ఒంగోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో ఇద్దరు సీనియర్ నేతలకు సీఎం జగన్ షాకిచ్చారు. కందుకూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, పరుచూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఆమంచి కృష్ణమోహన్‌లకు టికెట్లు నిరాకరించారు. ఇది ముందు నుంచే అనుకుంటున్నప్పటికీ శుక్రవారం రాత్రి అధికారికంగా ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఇద్దరి పేర్లతో ఏడో జాబితాను విడుదల చేసింది. కందుకూరులో తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన పెంచలయ్య కుమార్తె అరవింద యాదవ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. పరుచూరు బాధ్యతలను ఆమంచి నుంచి తప్పించి చీరాలకు చెందిన యడం బాలాజీని ఇన్‌చార్జిగా నియమించారు. 2014లో చీరాల వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన బాలాజీకి 2019లో టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన టీడీపీలో చేరారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న ఆయన్ను సీఎం జగన్ పిలిపించుకుని మరీ వైసీపీ కండువా కప్పడం గమనార్హం. ఆ వెంటనే పరుచూరు వైసీపీ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయంపై ఆ నియోజకవర్గంలో ఆది నుంచి వైసీపీలో ఉండి పనిచేస్తున్న నేతలు, శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ పదోన్నతుల్లో గోల్‌మాల్

» ఇంటర్ విద్యాశాఖలో కలకలం

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్ పదోన్నతుల్లో అక్రమాలకు తెరతీస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరికే పదోన్నతులు కట్టబెట్టాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడేందుకు ఒక సీనియర్ మంత్రి సహకరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. మొదటి నుంచీ మూడు కేటగిరీలను కలిపి ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ జాబితా ద్వారా పదోన్నతులు కల్పించే విధానం ఉంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(డీఆర్), నాన్-టీచింగ్, టీచర్ ప్రమోటీలకు కలిపి ఒకే సీనియారిటీ జాబితా ఉంటుంది. అయితే 2000సంవత్సరం తర్వాత టీచర్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులిచ్చే విధానం ఆగిపోయింది. అప్పటికే జేఎల్ అయినవారు జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్నారు. ఏపీపీఎస్సీ ద్వారా డీఆర్ కోటాలో కొందరు జేఎల్స్‌గా వచ్చారు. ఇప్పుడు అందరికీ కలిపి ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ జాబితా అమలుచేయాల్సిన ఇంటర్ విద్యాశాఖ... అందులో టీచర్ ప్రమోటీలను తొలగించినట్లు తెలిసింది. దానివల్ల వారికంటే ఆలస్యంగా ఉద్యోగాలు పొందిన డీఆర్ కోటా జేఎల్స్ పదోన్నతి పొందుతారు. రాష్ట్రవ్యాప్తంగా 210 ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ జాబితాను అమలుచేస్తే సుమారు 120 మంది టీచర్ ప్రమోటీలు ప్రిన్సిపాళ్లు అవుతారు. వారిని తొలగించడంతో ఆ పదోన్నతులు డీఆర్ కోటాకు వెళ్లిపోతాయి. దీనిపై అధికార పార్టీకే చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారు. స్పందించిన సీఎంవో వివరణ ఇవ్వాలని ఇంటర్ విద్యాశాఖను ఆదేశించింది. ఈలోగానే పదోన్నతులు ఇచ్చేయాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నెల్లూరులో బర్డ్‌ఫ్లూ కలకలం!

» వారం రోజులుగా భారీ సంఖ్యలో కోళ్లు మృత్యువాత

» వ్యాధి నియంత్రణకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేపుతోంది. వారం రోజులుగా పొదలకూరు, కోవూరు మండలాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు మరణించాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మృత్యువాత పడిన కోళ్ల నుంచి నమూనాలు సేకరించి, భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్‌కు పంపారు. చనిపోయిన కోళ్లకు ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (బర్డ్ ఫ్లూ) అనే వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేశారు. ఈ వ్యాధి సోకిన చాటగొట్ల, గుమ్మలదిబ్బ గ్రామాలకు కిలో మీటరు ప్రాంతాన్ని ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, 10 కిలోమీటర్ల వరకు సర్వైలెన్స్ ప్రాంతంగా ప్రకటించారు. ఈ గ్రామాలకు కోళ్లు, కోళ్ల ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసి, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లతో కోళ్లలో వ్యాధి నిర్ధారణ, నివారణ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 721 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి, కోళ్లలో వ్యాధి నిర్ధారణ చేస్తున్నట్లు వివరించారు. ఏదైనా అనుమానం ఉంటే 1962 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీపీఎస్ వర్సెస్ పోలీస్!

» రేపు 'చలో విజయవాడ'కు ఉద్యోగుల పిలుపు

» ప్రభుత్వ మొండి వైఖరిపై ఉద్యమం

» రాష్ట్ర వ్యాప్తంగా పోస్టర్ల ఆవిష్కరణ

» అనుమతి లేదంటూ పోలీసుల నోటీసులు

» కార్యక్రమంలో పాల్గొంటే క్రిమినల్ చర్యలంటూ బెదిరింపులు

» చలో విజయవాడకు మౌఖికంగా అనుమతులు

» ప్రభుత్వ ద్వంద్వ విధానాలపై ఏపీసీపీఎస్ఈఏ ఆగ్రహం



సీపీఎస్ ఉద్యోగికి నోటీసు అందజేస్తున్న పోలీసు అధికారి

అమరావతి, విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జగన్ చేసిన మోసంపై సీపీఎస్ ఉద్యోగులు మరోసారి రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరిస్తామంటూ గత ఎన్నికల ముందు ప్రతిపక్షనేతగా జగన్ హామీ ఇచ్చి చేతులెత్తేశారు. సీపీఎస్ బదులు జీపీఎస్ అంటూ మరో గుదిబండను తెచ్చి సీపీఎస్ ఉద్యోగుల నెత్తిన రుద్దారు. దీన్ని నిరసిస్తూ ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమయ్యారు. పాత పెన్షన్ సాధనకు ఈ నెల 18 తేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదాన్ని మోతమోగిస్తున్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి వెంటనే ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఈ కార్యక్రమంపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. విజయవాడకు సీపీఎస్ ఉద్యోగులు వస్తారన్న ఉద్దేశంతో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగులకు, ఉద్యోగ సంఘ నాయకులకు పోలీసులు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 149 ప్రకారం నోటీసులు ఇస్తున్నారు. సీపీఎస్ ఉద్యోగుల ఇళ్లకు, వారు పనిచేసే ప్రదేశాలకూ వెళ్లి నేరుగా వెళ్లి నోటీసులు అందజేస్తున్నారు. చలో విజయవాడకు పోలీసు శాఖ నుంచి కానీ, ప్రభుత్వం నుంచి కానీ అనుమతులు లేవని, నోటీసులను కాదని విజయవాడ వెళ్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో ఇదే విధంగా నోటీసులిచ్చి, ఆపై విచారణ పేరిట స్టేషన్లకు పిలిపించి రోజంతా ఉంచేశారు. ఉద్యోగులను ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేశారు. అదే పంథాలో తాజా కార్యక్రమానికి కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులపై నిర్బంధ కాండ ప్రయోగిస్తున్నారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సీపీఎస్ ఉద్యోగులకు ఎక్కడికక్కడ నోటీసులు ఇస్తున్నారు. నోటీసులివ్వడంతోపాటు పోలీసులు పదేపదే ఫోన్లు చేసి ఇబ్బందులు పెడుతున్నారని సీపీఎస్ ఉద్యోగులు వాపోతున్నారు. తాము శాంతియుతంగా చేపట్టే కార్యక్రమంలో పాల్గొనకుండా ఎందుకు నిర్బంధం ప్రయోగిస్తున్నారో అర్థం కావటం లేదని మండిపడుతున్నారు. మరోవైపు కేవలం 500 మందితోనే నిర్వహించుకోవటానికి తమకు అభ్యంతరం లేదని విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా సీపీఎస్ఈఏ అగ్రనేతలను పిలిచి చెప్పారు. ఇదే సందర్భంలో ప్రమాణ పత్రాలపై అగ్రనేతలతో సంతకాలు చేయించినట్లు తెలుస్తోంది. కానీ, కార్యక్రమానికి అనుమతి లేదని, వెళ్లటానికి వీలు లేదంటూ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా నోటీసులు జారీ చేయటం గమనార్హం. ప్రభుత్వం ద్వంద్వ విధానాలపై ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు అనుమతులు ఇచ్చామని మౌఖికంగా చెప్పారని, మరోవైపు అనుమతులు లేవంటూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నోటీసులు ఇవ్వటం, గృహ నిర్బంధాలను సాగించటం అన్యాయమని పేర్కొన్నారు. ఓపీఎస్ పునరుద్ధరించకుండా ఐదేళ్లలో ఏ విధంగా మోసం చేశారో ఇంటింటికీ చేరేలా కార్యాచరణ రూపొందిస్తామని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సీఎం దాస్ చెప్పారు. ఓపీఎస్ పునరుద్ధరించే వారికే తమ ఓట్లు వేస్తామని ప్రకటించారు. ఓపీఎస్ అమలు కోరుతూ ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో నిర్వహించే చలో విజయవాడకు ఉద్యోగులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. చేసిన మోసానికి వచ్చే ఎన్నికల్లో సర్కారుకు గుణపాఠం చెప్పడానికి ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న ఏపీ జేఏసీ నాయకులు బండి శ్రీనివాసరావు తదితరులు

ప్రభుత్వానికి 26 వరకు గడువు

» 27న భారీగా 'చలో విజయవాడ': బండి... మూడోరోజు కొనసాగిన నిరసనలు

అమరావతి, విజయవాడ, పార్వతీపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి)గుంటూరు(తూర్పు): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి 26 వరకు సమయం ఇస్తున్నామని, స్పందించకుంటే 27న భారీగా 'చలో విజయవాడ'ను నిర్వహిస్తామని ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గతంలో నిర్వహించిన 'చలో విజయవాడ'ను మించి ఈ కార్యక్రమం ఉంటుందని హెచ్చరించారు. ఏపీ జేఏసీ ఉద్యమ శంఖారావ కార్యాచరణలో భాగంగా మూడో రోజైన శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విజయవాడలోని రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నిర్వహించిన ధర్నాలో బండి శ్రీనివాసరావు మాట్లాడారు. ఇటీవల మంత్రుల బృందంతో జరిగిన చర్చల్లో 49 సమస్యలను నివేదించామని, ఏ ఒక్క సమస్యకూ ప్రభుత్వం పరిష్కారం చూపలేదన్నారు. బకాయిలు విడుదల చేసేవరకు ఉద్యమం కొనసాగుతుందని ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ హృదయరాజు స్పష్టంచేశారు. ఐదేళ్ల నుంచి రావాల్సిన రూ.23,500 కోట్ల బకాయిలు మాత్రమే అడుగుతున్నామని ఏపీ జేఏసీ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు గుంటూరులో అన్నారు. పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర నాయకుడు కిశోర్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది ఉద్యోగులు నిరసన చేపట్టారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

హామీలపై నిర్ణయం ప్రకటించండి!

» లేదంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: ఏపీజేఏసీ అమరావతి



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని, బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించకపోతే, 22న జరిగే సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి, ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని శుక్రవారం హెచ్చరించారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ సెక్రటేరియట్ అత్యవసరంగా భేటీ అయింది. బొప్పరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, వీవీ మురళీకృష్ణంనాయుడులతో పాటు సభ్య సంఘాల అగ్రనాయకులంతా పాల్గొన్నారు. మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించిన అంశాలను బొప్పరాజు వివరించారు. ఉద్యోగులకు సుమారు రూ.20వేల కోట్లు బకాయిలు చెల్లించాలని, మార్చి నెలాఖరు నాటికి జీపీఎఫ్, సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర రూ.5000వేల కోట్ల వరకు చెల్లిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారని తెలిపారు. ఐఆర్ చెల్లించాల్సిందేనని పట్టుబట్టామని సీఎంతో చర్చించి మళ్లీ తెలియజేస్తామని చెప్పారన్నారు. 2004కు ముందు చేరిన ఉద్యోగులకు పాత పింఛను విధానం వర్తింపజేయాలని కోరినట్లు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని కోరామన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని, ఆర్థికేతర అంశాలపై వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు బొప్పరాజు చెప్పారు.

అయ్యో.. అన్నదాతా!

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాలకు గాను 37.6 లక్షల (67%) ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. దాదాపు 20 లక్షల ఎకరాలు బీడుగా మిగిలిపోయాయి. రెండు సీజన్లలో వ్యవసాయ శాఖ 146.87 లక్షల ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించగా, కోటి ఎకరాల్లోనే సాగయ్యాయి. 2023 ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 440 మండలాల్లో వానలోటుతో చాలామంది రైతులు విత్తనమే వేయలేదు. మరికొందరు వేసిన పంటలకు నీటి తడులు అందించలేక అవస్థలు పడ్డారు. అయినా ప్రభుత్వం కరువు మండలాలు కేవలం 103 అనే ప్రకటించింది.

అటు కరువు.. ఇటు తుఫాన్

రాష్ట్రంలో ఓవైపు వర్షాభావంతో నష్టపోగా, మరోవైపు తుఫాన్‌తో పంటలు దెబ్బతిన్నాయి. సార్వా వరి కోతల ప్రారంభంలోనే మిచౌంగ్ తుఫాన్‌తో ధాన్యం రైతులు నష్టపోయారు. పత్తి, మిర్చి, పొగాకు, శనగ, ఉద్యాన రైతులూ నష్టాలు చవిచూశారు. రబీ సాగు మొదలైన సమయంలోనే తుఫాన్ రావడంతో అప్పటివరకు వేసిన విత్తనం దెబ్బతిని, మళ్లీ పంట వేసుకోవాల్సి వచ్చింది. నిరుడు కాలువలకు సకాలంలో నీరు విడుదల చేయని కారణంగా సార్వా వరి సాగు ఆలస్యమైంది. దాంతో వరి కోతలు ఆలస్యం కావడంతో దాళ్వా పంటకు వాతావరణం అనుకూలించక రైతులు వరి సాగు తగ్గించారు. దీంతో 2023-24లో దాదాపు 15లక్షల ఎకరాల్లో వరిసాగు తగ్గింది. ఏపీలో ఇంత భారీగా వరి సాగు తగ్గడం గతంలో ఎప్పుడూలేదు. రాయలసీమలో వర్షాభావం వల్ల చిరుధాన్యాలు 3.50 లక్షల ఎకరాలు, అపరాలు 10 లక్షల ఎకరాలు, వేరుశనగ 11 లక్షల ఎకరాలు పైన తగ్గాయి. నూనెగింజలు, పత్తి, పొగాకు, చెరకు పంటలు కూడా తగ్గాయి.

2023-24లో పంటల సాగు వివరాలు (లక్షల ఎకరాల్లో)

పంట	లక్ష్యం	సాగు
వరి	60.2	45.4
చిరుధాన్యాలు	13.72	10.27
అపరాలు	31.15	21.2
వేరుశనగ	19.7	7.87
నూనెపంటలు	2.55	2.42
పత్తి	15.7	12.0
పొగాకు	2.17	1.97
మిర్చి	6.25	6.42

ఖరీఫ్‌లో అన్ని పంటల్లోనూ దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయారు. రబీ పంటలు ఏ మేరకు దిగుబడి వస్తాయో తెలియని పరిస్థితి. ఈ ఏడాది ప్రధాన పంటలే సాగు తగ్గడంతో లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తికి గండిపడింది. కరువు, తుఫాన్‌తో పంట నష్టపోయిన ప్రాంతాలను కేంద్ర బృందాలు పరిశీలించి నివేదికలు అందించినా, రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసినా.. రైతులకు నయాపైసా నష్టపరిహారం అందలేదు. మిచౌంగ్ సమయంలో రాష్ట్రానికి దాదాపు 493 కోట్లు మంజూరు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. కరువు, తుఫాన్‌తో పంటనష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రగల్భాలు పలికారు. కానీ ఇంత వరకు ఒక్క రైతుకూ సాయం చేయలేదు. కనీసం పంట రుణాలు రీషెడ్యూల్ చేయాలని రైతు సంఘాలు కోరుతున్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదు.

ఎన్నికల సిబ్బంది జాబితా సిద్ధం చేయండి

» కలెక్టర్లు, ఎస్పీలకు సీఈవో మీనా ఆదేశం



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బంది జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా ఆదేశించారు. ప్రతి జిల్లాలో ఎన్నికల సిబ్బంది సంఖ్య ప్రాథమిక అంచనా కంటే 20 శాతం అదనంగా ఉండాలని సూచించారు. పోలీసుశాఖలో సిబ్బంది కొరత ఉన్న జిల్లాలు అదనపు సిబ్బందిని సమకూర్చుకునే అవకాశాలపై వెంటనే రిపోర్టు సమర్పించాలన్నారు. పోలింగ్ కాకుండా ఇతర విధులకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది నిర్వహణ, ఓటర్ లిస్టు, ఓటర్ కార్డుల పంపిణీ, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులు, లా అండ్ ఆర్డర్ నిర్వహణలపై సమీక్షించారు. ఈ నెలాఖరులోగా సమస్యాత్మక ప్రాంతాల నివేదిక అందించాలని ఎస్పీలను ఆదేశించారు. జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టుల ఏర్పాటు విషయంలో ఆయా జిల్లాల ఎస్పీలు సమన్వయం చేసుకుని సాధ్యమైనంత ఎక్కువ రూట్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రజాస్వామ్యంలో తులనాత్మక న్యాయవ్యవస్థ కీలకం


» సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రవీంద్ర భట్

» కంపారిటివ్ లాపై విట్-ఏపీలో మూడు రోజుల సదస్సు



అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అంతర్జాతీయ, ఆర్థిక ప్రపంచీకరణ, ప్రజాస్వామ్యీకరణలో కంపారిటివ్ లా (తులనాత్మక న్యాయవ్యవస్థ) కీలక పాత్ర పోషిస్తుందని సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రవీంద్ర భట్ అన్నారు. విట్-ఏపీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా (వీఎస్ఎల్), విట్-ఏపీ యూనివర్సిటీ, బర్మింగ్‌హామ్ స్కూల్ ఆఫ్ లా, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కంపారిటివ్ లా' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తులనాత్మక న్యాయవ్యవస్థను వివిధ దేశాల న్యాయవ్యవస్థల మధ్య వ్యత్యాసాలు, సారూప్యతల అధ్యయనంగా అభివర్ణించారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ సదస్సు విట్-ఏపీ క్యాంపస్‌లో గురువారం ప్రారంభమైంది. శనివారం ముగుస్తుంది. కార్యక్రమంలో విట్-ఏపీ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్వీ కోట రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర, విట్-ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరికరంతో 5 రకాల ఆరోగ్య పరీక్షలు



ఐదు రకాల పరీక్షలు చేసే చిన్న పరికరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్‌లో మరో కొత్త వైద్య పరికరాన్ని తయారుచేశారు. అరచేతిలో ఇమిడిపోయే ఈ పరికరంతో ఐదు రకాల కీలక పరీక్షలు ఇంటి దగ్గరే చేసుకోవచ్చు. శరీర ఉష్ణోగ్రత (టెంపరేచర్), రక్తపోటు (బీపీ), గుండె కొట్టుకునే వేగం (హార్ట్ రేట్), రక్తంలో ఆక్సిజన్ శాతం (ఎస్‌పీఓ2), ఎలక్ట్రో కార్డియోగ్రఫీ (ఈసీజీ)... ఈ ఐదింటినీ ఇంటి వద్దనే చేసుకునేలా మెడ్‌టెక్ జోన్‌లోని 'ఆరోగ్య యంత్ర టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్' సంస్థ చిన్న పరికరాన్ని రూపొందించింది. దీనిలోని సెన్సర్లపై వేలు పెట్టగానే ఒక్కో పరీక్ష చేసి ఫలితాలను డిస్‌ప్లే చేస్తుంది. ఈసీజీ కోసమైతే రెండు చేతుల బొటనవేళ్లను పెట్టి రెండు నిమిషాలపాటు పరికరాన్ని నొక్కి పట్టుకుంటే ఈసీజీ గ్రాఫ్ వస్తుంది. ఈ పరికరం కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని పరికరానికి అనుసంధానం చేసుకుంటే... అన్ని పరీక్షల ఫలితాలు మొబైల్‌లోనే రికార్డ్ అవుతాయని కంపెనీ ఎండీ కేవీ కాశ్యప్, సీటీవో ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. దీనికి పేటెంట్ హక్కులు రాగానే మార్కెట్‌లోకి విడుదల చేస్తామని చెప్పారు. ధర సుమారు రూ.16 వేలు ఉంటుందన్నారు.



టీడీపీ కౌన్సిలర్ నారాయణరావు ఇంటి వద్ద ఉన్న వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

'బయటికి రా.. నీ అంతు చూస్తాం'

» పార్వతీపురంలో వైసీపీ శ్రేణుల వీరంగం

» అర్ధరాత్రి టీడీపీ కౌన్సిలర్ ఇంటిపై దాడికి యత్నం

పార్వతీపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో గురువారం అర్ధరాత్రి వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు వీరంగం సృష్టించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే భూదందాలు, కబ్జాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టీడీపీ కౌన్సిలర్ ఇంటిపై దాడికి యత్నించారు. తలుపులు, గేట్లు కొట్టి.. దుర్భాషలాడుతూ.. భయభ్రాంతులకు గురి చేశారు. 'బయటికి రా.. నీ అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. జిల్లా కేంద్రంలోని కొత్తవలస, గిజబ కాలనీ, గోపాలపురం సమీపంలోని జగనన్న కాలనీల్లో ఎమ్మెల్యే సహకారంతో కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు గుడి, బడికి సంబంధించిన స్థలాలను ఆక్రమించి, యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిపై బహిరంగంగానే కాకుండా పత్రికలు, సోషల్ మీడియా ద్వారా టీడీపీ కౌన్సిలర్ నారాయణ ప్రజలకు తెలియజేస్తున్నారు. రెండు రోజుల కిందట పార్వతీపురం మండలం వెంకంపేటలో నిర్వహించిన శంఖారావం సభలో టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ కూడా పట్టణంలో ఆక్రమణలు, ఎమ్మెల్యే కబ్జాలపై ధ్వజమెత్తారు. ఇది ఎమ్మెల్యేతో పాటు ఆ పార్టీ శ్రేణులకు మింగుడుపడలేదు. దీంతో గురువారం అర్ధరాత్రి సమయంలో 8వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కోరాడ నారాయణరావు ఇంటిపై దాడికి యత్నించారు. 7, 9 వార్డులకు చెందిన వైసీపీ కౌన్సిలర్లు ఆనంద్, జయంతితో పాటు కో ఆప్షన్ సభ్యుడు వెంకటరావుతో పాటు కొందరు వైసీపీ నాయకులు, వారి అనుచరులు నారాయణరావు ఇంటి గేటు, తలుపులు కొడుతూ తిట్ల పురాణం అందుకున్నారు. 'మా ఎమ్మెల్యేపై అభాండాలు వేస్తూ మమ్మల్ని ఆక్రమణ దారులంటావా?' అంటూ గట్టిగా కేకలు వేస్తూ.. కౌన్సిలర్ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై నారాయణరావు వెంటనే పట్టణ పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. తనను, తన కుటుంబాన్ని రక్షించాలని కోరారు. తర్వాత ఇంటినుంచి బయటకు వచ్చిన నారాయణరావుపై అధికార పార్టీ నేతలు విరుచుకుపడ్డారు. ఆయన చొక్కా పట్టుకుని వాగ్వాదానికి దిగారు. ఇంతలో స్థానిక టీడీపీ నేతలు, పోలీసులు అక్కడకు రావడంతో వైసీపీ శ్రేణులు మెల్లగా జారుకున్నారు. టీడీపీ కౌన్సిలర్ ఇంటిపై దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్థానికంగా ఉన్నా ఓటుపై వేటు!

(మొదటి పేజీ తరువాయి)

పది మందిపై పీపుల్స్ యాక్ట్-1950 సెక్షన్ 31 కింద క్రిమినల్ కేసులు నమోదుచేయాలని శుక్రవారం విశాఖ పోలీసులకు లేఖ రాశారు. మరో 13 మందిని హెచ్చరించి విడిచిపెట్టాలని నిర్ణయించారు. గత ఏడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం.. దానిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 4,409 ఓట్లు తొలగించాలని 163 మంది (ఒక్కొక్కరు పది అంతకంటే ఎక్కువ సంఖ్యలో) ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు అప్‌లోడ్ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్ల తొలగింపునకు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఒక వ్యక్తి ఐదు వరకు మాత్రమే దరఖాస్తు చేయాలి. అది కూడా తాను ఓటరుగా ఉండే బూత్‌లో ఎవరైనా చనిపోయినా, శాశ్వతంగా వలస వెళ్లినా, లేదా ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నప్పుడే అభ్యంతరం వ్యక్తం చేస్తూ దరఖాస్తు చేయాలి. అయితే పశ్చిమ నియోజకవర్గంలో ఒక బూత్‌లో ఉండే వ్యక్తి మరో బూత్‌లో ఉన్న ఓట్లను తొలగించాలని దరఖాస్తు చేసినట్టు ఎమ్మెల్యే గణబాబుకు సమాచారం అందింది. ఆయన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పశ్చిమ రిటర్నింగ్ అధికారి/విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావు దృష్టికి కూడా తీసుకువెళ్లడంతో విచారణకు ఆదేశించారు.

ఉద్దేశపూర్వకంగా అభ్యంతరాలు

ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ క్షేత్రస్థాయిలో విచారించింది. ఓట్ల తొలగింపునకు 163 మంది నుంచి వచ్చిన 4,409 అభ్యంతరాలపై పరిశీలన చేశారు. అందులో 3,476 మంది ఓటర్లు స్థానికంగా నివాసం ఉండడం లేదని, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లాలని తేలింది. మిగిలిన 933 మందిలో 183 ఓట్లకు సంబంధించి ఓటర్లే స్వయంగా తమ పేర్లు తొలగించాలని దరఖాస్తులు అందజేసినట్లు తేలింది. కాగా మరో 750 అభ్యంతరాల్లో 540 మంది ఓటర్ల జాబితాలో ఉన్న చిరునామాలో ఉంటున్నారు. అయితే సొంత కారణాల వల్ల తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళుతుంటారని విచారణలో తేలింది. దీంతో 540 అభ్యంతరాలను తిరస్కరించిన కమిటీ.. వారి ఓట్లు యథాతథంగా జాబితాలో ఉంచాలని సూచించింది. మరో 205 మంది ఓటర్లు జాబితాలో పేర్కొన్న చిరునామాల్లోనే నివాసం ఉంటున్నారు. అయినా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఉద్దేశపూర్వకంగా అభ్యంతరాలు తెలిపారని నిర్ధారించారు. ఆ 205 మంది ఓట్లు తొలగించాలని దరఖాస్తు చేసిన వారిలో (ఎక్కువ అభ్యంతరాలు ఇచ్చిన) పది మందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, మరో 13 మందిని హెచ్చరించాలని సిఫారసు చేస్తూ కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారికి విశాఖ పశ్చిమ రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ నివేదిక ఇచ్చారు. ఆ పది మందిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు లేఖ రాశారు. కలెక్టర్ మల్లికార్జున కూడా కేసులు నమోదు చేయాలని పోలీసులకు లేఖ రాశానని తెలిపారు.

కేసులు వీరిపైనే...

ఓటర్ల జాబితాలో పేర్కొన్న చిరునామాలో ఓటర్లు ఉన్నప్పటికీ లేరంటూ అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారిలో జి.నూకరాజు అనే వ్యక్తి ఉన్నారు. ఆయన మొత్తం 114 అభ్యంతరాలు వ్యక్తంచేయగా, అందులో 29 మంది అదే అడ్రస్‌లో ఉంటున్నట్టు తేలింది. అదే మాదిరిగా గొల్లపల్లి కావ్య, సక్కురి సత్యవతి 26 చొప్పున, కొలాచిన రవి 23, నమ్మి లీలానాగవల్లి 20, సుండి సుజాత 15, కె.యశ్వంతరావు 12, కాండ్రేగుల సత్తిబాబు 11, బత్తుల రంగనాయకమ్మ, రొంగలి సుధ ఏడు దరఖాస్తులు చొప్పున చేసినట్టు నిర్ధారించారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

మిగిలిన వారిపైనా చర్యలు తీసుకోవాలి: గణబాబు

"విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని దరఖాస్తులు చేసినట్టు ఫిర్యాదు చేశాం. దీనిపై అధికారులు విచారించి పది మందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మిగిలినవారిని ఎందుకు విడిచిపెడుతున్నారు? ఓటర్ల జాబితాలో పేర్కొన్న అడ్రస్‌లో ఉన్న వ్యక్తి ఓటు తొలగించాలని దరఖాస్తు చేయడం పీపుల్స్ యాక్టు 1950 ప్రకారం నేరం. మాకు వచ్చిన సమాచారం మేరకు ఫామ్-7 దరఖాస్తులపై కొన్నింటిపై మాత్రమే వివరాలు అందించాం. మరికొన్ని అభ్యంతరాలు ఇచ్చి ఉంటారనే అనుమానం ఉంది. ఇలాంటి ఘటనలు రాష్ట్రమంతా భారీఎత్తున జరిగి ఉంటాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం లోతుగా విచారణ చేయాలి" అని టీడీపీ ఎమ్మెల్యే గణబాబు కోరారు.

వృద్ధులపై వల

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఐదు రోజుల్లోపు ఆయా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వారు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేందుకు శరీరం సహకరించనందున ఇంట్లో నుంచే ఓటు వేసే అవకాశం ఇస్తారు. ఆయా రిటర్నింగ్ అధికారి ఓటర్ల జాబితాలో ఆయా దరఖాస్తుదారుల పేర్లు పరిశీలించి పోస్టల్ బ్యాలెట్‌ను జారీచేస్తారు. పోలింగ్ రోజు కంటే ముందే ఎన్నికల అధికారులు ఆయా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్లలో వారి ఓట్లు వేయిస్తారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా ఆయా కుటుంబాల వద్దకు వెళ్లే అవకాశం ఉంది. వయోవృద్ధులు, దివ్యాంగులు సొంతంగా ఓటు వేసుకోలేని పరిస్థితుల్లో తాము సూచించిన వారి సాయంతో నచ్చిన పార్టీకి ఓట్లు వేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ కేటగిరీ ఓటర్లపై వైసీపీ నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. జగన్‌కు ఓటేయకపోతే పెన్షన్ రాదని భయపెట్టడంతో పాటు పలు రకాలుగా ప్రభావితం చేయాలని వ్యూహం పన్నుతున్నారు.

ప్రతిచోటా కీలకం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం. గత ఎన్నికల్లో సుమారు 30 నుంచి 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5 వేల లోపు మెజారిటీతోనే గెలిచారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వయోవృద్ధులు, దివ్యాంగుల ఓట్లు కీలకం కానున్నాయి. ఈ కేటగిరీ ఓటర్లు పోలింగ్ బూత్‌కు వెళ్లి రహస్యంగా ఓట్లు వేసే పరిస్థితి ఉండదు. ఇంట్లో నుంచి ఓట్లు వేసే 12 డీ ఫామ్ ఓటర్లు ఎవరికి ఓటు వేస్తారో తెలుసుకునే అవకాశముంది. దీంతో ఎన్నికల ముందు ఈ ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం కూడా ఉంది. అధికార పార్టీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చూస్తోంది. వలంటీర్లను ఉపయోగించి ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయించుకోవాలని వైసీపీ నేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆయా కుటుంబాలతో వలంటీర్లకు ఉన్న పరిచయాలను వాడుకోవాలని యోచిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.5 వేలకు అదనంగా రెట్టింపు జీతాలు, మరిన్ని రాయితీలు ఇచ్చి వలంటీర్లను పార్టీ సేవలకు వాడుకుందామన్న ధోరణిలో వైసీపీ పెద్దలు ఉన్నారు. కుదిరితే వలంటీర్లనే ఏజెంట్లుగా నియమించి పథకాల లబ్ధిపొందిన వారితో వైసీపీకి ఓట్లు వేయించేలా చూడాలని యోచిస్తున్నారు.

అక్రమాలపై అదే ఆందోళన...

ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం వైసీపీకి కొత్తేమీ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పట్ల వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. అధికార యంత్రాంగాన్ని జగన్ సర్కారు అడ్డగోలుగా వినియోగించుకుంది. తిరుపతి ఉపఎన్నికల్లో సైతం ఇదే పరిస్థితి. ఏకంగా ఓటర్ల జాబితాలను తారుమారు చేశారు. రాష్ట్రంలో జరిగిన ప్రతిఎన్నికల్లో వైసీపీ అక్రమాలకు పాల్పడింది. పలువురు అధికారులు అధికార పార్టీ అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంట్లో నుంచి ఓటు వేసే వయోవృద్ధులు, దివ్యాంగుల ఓటర్లను వైసీపీ నేతలు ప్రభావితం చేసే అవకాశముంది. సామాజిక పెన్షన్ పొందుతున్నవారు జగన్‌కు ఓటేయకపోతే పెన్షన్ రాదని ఇప్పటికే భయపెడుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు పోలింగ్ ఆఫీసర్‌తో పాటు ఆయా పార్టీల ఏజెంట్లు కూడా వెళ్లవచ్చని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. అధికార నేతలు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశముందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

డిప్.. డిప్.. డిప్

డిప్.. ఇది పచ్చడి కాదు.. అలాగని సాస్ కూడా కాదు. ఈ మధ్యకాలంలో ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ బాగా పెరిగిన తర్వాత వినిపిస్తున్న పేరు. ఈ డిప్‌లను చిప్స్, చికెన్ లాలీపాప్స్ వంటి వాటితో పాటుగా దోసెలతో తిన్నా బానే ఉంటుంది. ఇలాంటి కొన్ని డిప్‌లను ఎలా చేయాలో తెలుసుకుందాం.

వంటిల్లు

1 స్మోకీ ఎగ్‌ప్లాంట్ డిప్

కావాల్సిన పదార్థాలు: రెండు పెద్ద వంకాయలు, రెండు టీస్పూన్ల ఆలీవ్ నూనె, ఒక టేబుల్ స్పూన్ రాళ్ల ఉప్పు, ఆరు టీస్పూన్ల ఆవాల పేస్ట్, ఒక స్పూను జీలకర్ర పౌడర్, రెండు వెల్లుల్లి రెబ్బలు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మ రసం, రుచికి తగ్గట్టుగా మిరియాల పొడి, ఒక టేబుల్ స్పూన్ బాగా తరిగిన కొత్తిమీర

తయారుచేసే విధానం: వంకాయలను స్టౌ మీద బాగా కాల్చాలి. చల్లారిన తర్వాత పై తొక్క తీయాలి. లోపల ఉన్న గుజ్జును బయటకు తీసి- ఆవాల పేస్ట్‌లో కలపాలి. ఆ తర్వాత ఆ మిశ్రమంలో ఉప్పు, జీలకర్ర పౌడర్, వెల్లుల్లి రెబ్బలు, మిరియాల పొడిని వేసి మిక్సీలో మెత్తగా తిప్పాలి. దీనిలో ఆలీవ్ నూనెను, కొత్తిమీరను కలపాలి. దీనిని చిప్స్‌లో మాత్రమే కాకుండా దోసెలలో తిన్నా బానే ఉంటుంది.



2 మింట్ పీస్ డిప్

కావాల్సిన పదార్థాలు: ఒక కప్పుడు పచ్చి బఠానీలు, మూడు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, పది వెల్లుల్లి రెబ్బలు, ఒక పావు కప్పు తరిగిన పుదీనా, రెండు టేబుల్ స్పూన్ల ఆలీవ్ ఆయిల్, అర టేబుల్ స్పూన్ రాళ్ల ఉప్పు

తయారు చేసే విధానం: పచ్చి బఠానీలను కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడకపెట్టాలి. ఇవి చల్లారే లోపులో వెల్లుల్లి రెబ్బలు, పుదీనాను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. ఆ తర్వాత ఉడకపెట్టిన బఠానీలను, రాళ్ల ఉప్పును కూడా కలిపి మళ్లీ మిక్సీలో వేసి తిప్పాలి. ఆ మిశ్రమంలో నిమ్మరసాన్ని, ఆలీవ్ ఆయిల్‌ను కలపాలి. దీనిని నాన్‌వెజ్ స్టార్టర్స్‌తో కలిపి తింటే చాలా బావుంటుంది.



3 క్యారెట్ కొరియాండర్ డిప్

కావాల్సిన పదార్థాలు: మూడు క్యారెట్లు (చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి), రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, అల్లం ముక్కలు (రుచికి సరిపడా), ఒక స్పూను గరమ్ మసాలా, ఒక స్పూను జీలకర్ర పొడి, ఒక టేబుల్ స్పూన్ సన్నగా తరిగిన కొత్తిమీర, తగినంత ఉప్పు


తయారుచేసే విధానం: క్యారెట్‌లను మిక్సీలో వేసి ముద్దలా చేయాలి. దీనిలో గరమ్ మసాలా, జీలకర్ర పొడి, అల్లం ముక్కలు, నిమ్మరసం, ఉప్పు వేసి మరో సారి బాగా తిప్పాలి. ఆ మిశ్రమంలో సన్నగా తరిగిన కొత్తిమీరను కలపాలి. దీనిని ఫ్రిజ్‌లో ఉంచుకొని తింటే చాలా బావుంటుంది.



4 స్పైసీ కేషు డిప్

కావాల్సిన పదార్థాలు: రెండు కప్పుల వేయించిన జీడిపప్పు, రెండు వెల్లుల్లి రెబ్బలు, పావు కప్పు నువ్వులు, ఒక పెద్ద గ్లాసు కొబ్బరి పాలు, మూడు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, ఒక టేబుల్ స్పూన్ ఆలీవ్ నూనె, అర టేబుల్ స్పూన్ మిరియాల పొడి, తగినంత ఉప్పు

తయారు చేసే విధానం: జీడిపప్పును నాలుగు గంటలు నీళ్లలో నానబెట్టాలి. తర్వాత మిక్సీలో వేసి ముద్ద చేయాలి. ఈ ముద్దలో కొబ్బరి పాలు, వెల్లుల్లి రబ్బలు, నువ్వులు, మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా మెత్తగా చేయాలి. ఈ మిశ్రమంలో దీనిలో నిమ్మరసం, ఆలీవ్‌నూనెలను కలపాలి. దీనిని నాచోస్, క్యారెట్ స్టిక్‌లతో కలిపి తింటే చాలా బావుంటుంది.



నువ్వుల నూనె పచ్చడి

క్షేమ కుతూహలం

తిలనింబాది సంయుక్తం
కల్కో బలప్రదః
వహ్నిసంజననః ప్రోక్తో విశే
షేణానిలాపహః

అని క్షేమకుతూహలంలో క్షేమశర్మ నువ్వులకు ఉన్న విశిష్టతలను వర్ణిస్తాడు. అతి పురాతనమైన ఆయుర్వేద శాస్త్రంలో కూడా నువ్వులకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం అందరూ పామోలిన్ లేదా పొద్దుతిరుగుడు నూనెను వాడుతున్నారు కానీ ఒకప్పుడు నువ్వుల నూనెను విరివిగా ఉపయోగించేవారు.

నువ్వులు చాలా ప్రాచీనమైనవి. సెసేమమ్ ఇండికమ్ అనే గింజల నుంచి తొలిసారి నూనెను తీశారట. ఈ గింజలను తిలలు అనేవారు. ఈ తిలల నుంచి తీసినది కాబట్టి తైలం అయింది. ఆ తర్వాతి కాలంలో తైలం అంటే నూనె అనే అర్థం స్థిరపడింది. పౌష్టికాహార నిపుణుల అధ్యయనాల ప్రకారం చూస్తే- పొట్టు తీయని నువ్వుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రస్తుతం మనకు పొట్టు తీసిన నూనె ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. దీనినే పప్పునూనె అని కూడా పిలుస్తారు. నువ్వులు తీయగా మిగిలిన పదార్థాన్ని దంచగా వచ్చిన దాన్ని తెలగపిండి అని ఉంటారు. ఇలా నువ్వుల నుంచి తీసిన నూనెనే కాకుండా.. నువ్వులతో కూడా రకరకాల వంటలు చేస్తారు. అవేమిటో చూద్దాం.

నువ్వుల నూనె పచ్చడి: వినటానికే వింతగా అనిపించే వంటకం ఇది. అధిక జీర్ణశక్తి కావాలనుకొనేవారికి ఈ నూనె పచ్చడి బాగా ఉపకరిస్తుంది. అరకప్పు నల్లనువ్వుల నూనెను తీసుకోవాలి. దానిలో అర కప్పు నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమంలో సన్నగా తరగిన అల్లం ముక్కలను కలపాలి. దీనిని మిక్సీలో వేసి ముద్దగా చేసుకుంటే- దానినే నువ్వుల నూనె పచ్చడి అంటారు. సాధారణంగా దీనిని అన్నం తినే సమయంలో మొదటి ముద్దలో కలుపుకొని తింటారు. దీని వల్ల జీర్ణశక్తి బాగా పెరుగుతుంది. వాతం అదుపులో ఉంటుంది. గ్యాస్ ఉత్పత్తి తగ్గుతుంది.

నువ్వుల పొడి: నువ్వుల పొడిని మన పూర్వీకులు తప్పనిసరిగా తినేవారు. అందుకే క్షేమశర్మ తన క్షేమకుతూహలంలో నువ్వుల పొడిని ఎలా చేసుకోవాలో వివరించాడు. నల్ల లేదా పొట్టు తీసిన నువ్వులను దోరగా వేయించాలి. వాటిలో సైంధవ లవణం, మిరియాలు, జీలకర్ర కలిపి మిక్సీలో పొడి చేయాలి. దానిలో వేడి అన్నంలో నిమ్మరసం వేసుకొని తింటే శరీరానికి బలమిస్తుంది. సాధారణంగా నువ్వు పొడి తింటే వేడి చేస్తుంది కాబట్టి నిమ్మరసం కలుపుకోమంటారు



నువ్వుల కట్టుపొంగలి: బియ్యం, నువ్వులు, మినపప్పులను తగు పాళ్లలో కలిపి అన్నం మాదిరిగా వండితే దాన్ని నువ్వుల పులగం లేదా కట్టుపొంగలి అంటారు. దీన్ని తింటే వాత వ్యాధులు తగ్గుతాయి. శరీరానికి శక్తి సమకూరుతుంది. దీనిలో కొందరు అల్లం ముక్కలు కూడా కలుపుతారు. ఈ విధంగానే మన పూర్వీకులు నువ్వులను రకరకాల వంటల్లో భాగం చేశారు.

ప్రయోజనాలెన్నో..

నువ్వులు వేడి చేసే స్వభావం కలిగినవి. చలిప్రాంతాల వారికి ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. కానీ, ఉష్ణమండలం అయిన మన దగ్గర ఎక్కువ పండుతాయి. నువ్వులు మూత్రం ఎక్కువ కాకుండా ఆపుతాయి. జీర్ణశక్తిని పెంచుతాయి. శరీరానికి నీరు పడితే- తగ్గటంలో ఉపకరిస్తాయి. వెంటుక్రల కుదుళ్లను బలోపేతం చేస్తాయి. దంతాలను బలపరుస్తాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆర్థిక పాఠసారి

డిజిటల్ స్టార్

పెట్టుబడులు... రాబడులు... ఆదాయాలు... పన్నులు... ఆర్థిక లావాదేవీల నిర్వహణే కాదు... వాటిని అర్థం చేసుకోవడం కూడా క్లిష్టమైనదే... అంటుంది అనుష్కా రాథోడ్. అందుకే ఆ సంక్లిష్టమైన విషయాలను సులువుగా అర్థమయ్యేలా... పొట్టి వీడియోల్లో పెట్టి లక్షలమందికి అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా మహిళలను దృష్టిలో పెట్టుకొని 'ఫైనాన్స్ పాఠాలు' చెబుతోంది. ట్యాక్సేషన్‌లో పీజీ చేసిన ఈ గుజరాత్ అమ్మాయి... తాజాగా ప్రతిష్ఠాత్మక 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ ప్రకటించిన '30 అండర్ 30'లో చోటు సంపాదించుకుంది.

"చిన్నప్పటి రోజులు ఇంకా నా కళ్ల ముందు మెదులుతున్నాయి. గుజరాత్‌లోని సూరత్ మాది. మార్వాడీ కుటుంబం కావడంతో అందరూ వ్యాపార కార్యకలాపాల్లో క్షణం తీరిక లేకుండా గడిపేవారు. రాత్రి భోజన సమయంలో కూడా డైనింగ్ టేబుల్ దగ్గర నాన్న, తాతయ్య, మావయ్యలు కూర్చొని బిజినెస్ ప్రాజెక్ట్‌ల గురించే మాట్లాడుకునేవారు. ఉన్న వ్యాపారాన్ని ఎలా విస్తరించాలి? ఎంతమొత్తంలో పెట్టుబడి పెట్టాలి? కొత్తగా ఎలాంటి బిజినెస్ ప్రాజెక్టులు చేపట్టాలి? ఇలా అన్నీ వ్యాపార సంబంధమైన చర్చలే వారి మధ్య నడిచేవి. ఇవన్నీ నాకు డబ్బుని పరిచయం చేశాయి. దాని ప్రాథమిక సూత్రాలు వంటబట్టాయి. ప్రధానంగా అర్థమైంది ఏమిటంటే... వ్యాపార కుటుంబం కావడంవల్ల స్థిరమైన ఆదాయం ఉండేది కాదు. కొన్ని నెలలు అద్భుతంగా డబ్బు కనిపించేది. మరికొన్ని మాసాలు వచ్చింది ఖర్చులకు సరిపోయేది. దానివల్ల మేం ఎప్పుడూ బడ్జెట్ దాటకుండా చూసుకోవాల్సి వచ్చేంది. వ్యాపారంలో రేపు ఎంత సంపాదిస్తామన్నది అంచనా వేయలేం. కనుక ఉన్నదాంట్లోనే పొదుపుగా ఖర్చు చేయాలి. ఇంట్లోనే భవిష్యత్తుకు ఉపయోగపడే ఎన్నో పాఠాలు నేర్చుకున్నా.

అనుకున్నది ఒకటి...

మా కుటుంబ నేపథ్యానికి భిన్నంగా నా జీవితాన్ని మలుచుకోవాలని అనుకున్నా. అందుకే అమెరికాలోని ప్రపంచ ప్రసిద్ధ 'డ్యూక్ యూనివర్సిటీ'లో మాస్టర్స్ చదవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. దాని కోసం ఎంతో కష్టపడ్డాను. సీఎఫ్ఏ లెవల్ వన్ పూర్తయిన తరువాత ఆ వర్సిటీకి దరఖాస్తు చేసుకున్నా. స్కాలర్‌షిప్‌తో సీటు కూడా వచ్చింది. అక్కడే కథ అడ్డం తిరిగింది. అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది? అదే సమయంలో కరోనా విలయం మొదలైంది. ప్రపంచమంతా లాక్‌డౌన్. ఆశలన్నీ ఆవిరయ్యాయి. ఎన్నో కలలు కని సీటు సాధించుకున్నా వెళ్లలేని పరిస్థితి. చివరికి విధి మరోలా తలచిందని సరిపెట్టుకున్నా.

రూటు మార్చిన కొవిడ్...

దానికి మూడేళ్ల ముందర, అంటే 2017లో 'డమోస్ కేపిటల్ ప్రైవేట్ లిమిటెడ్'లో, తరువాత ఏడాదిపాటు 'పరాగ్ పారిఖ్ ఫైనాన్షియల్ అడ్వైజరీ సర్వీసెస్ లిమిటెడ్'లో ఇంటర్న్‌షిప్ చేశాను. అది అవ్వగానే 'ప్రొఫిషియో అడ్వైజర్స్'లో కొన్నాళ్లు 'ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఎనలిస్ట్'గా చేరాను. అక్కడ కంపెనీలు, వాటి ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి అవకాశం లభించింది. ఇవన్నీ నాకు సంతృప్తినివ్వలేదు. అందుకే 'డ్యూక్ యూనివర్సిటీ'కి వెళ్లి చదవాలనుకున్నా. కొవిడ్‌తో ఆ లక్ష్యం పక్కకు వెళ్లిపోయింది. ఖాళీగా ఇంట్లో కూర్చుంటే.. స్నేహితులు, సన్నిహితులు కొందరు సలహాలు అడగడం మొదలుపెట్టారు. 'ఎక్కడ పెట్టుబడి పెట్టాలి? పన్ను ఆదా ఎలా చేసుకోవాలి?' లాంటి వాటికి నాకున్న పరిజ్ఞానంతో సలహాలు ఇచ్చేదాన్ని. వారిలో ఎక్కువగా మహిళలే ఉండేవారు. ఆలోచిస్తే అర్థమైంది ఏంటంటే... ఆర్థిక వ్యవహారాల పట్ల చాలామంది మహిళలకు సరైన అవగాహన లేదని. ఎక్కువగా ఇళ్లలోని మగవారే ఈ వ్యవహారాలన్నీ చూసుకోవడంవల్లనేమో... గృహిణులు వాటిని పెద్దగా పట్టించుకోవడంలేదు. దాంతో చిన్నపాటి సమాచారానికే వేరొకరిపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో కొంతైనా మార్పు తేవాలనుకున్నాను.



నాతోనే మొదలు...

అనుకున్నదే తడవుగా 'అనుష్కా రాథోడ్ ఫైనాన్స్' పేరుతో వెంటనే ఒక యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. అందులో ఆర్థిక లావాదేవీలు, అమలవుతున్న పన్నులు, ఎవరు ఎంత కట్టాలి తదితర వివరాలన్నీ సూటిగా, సుత్తి లేకుండా చెప్పడం మొదలుపెట్టాను. నా ప్రత్యేకత ఏంటంటే ఎంత క్లిష్టమైన అంశమైనా ఎవరికైనా ఇట్టే అర్థమైపోయేట్టు వివరించడం. సహజంగా ఆర్థికపరమైన కంటెంట్ పట్ల ఎవరికీ అంత ఆసక్తి ఉండదు. కనుక దానికి కొంత వినోదం జోడించి విపులంగా చెబుతున్నా. అంటే 'ఇన్ఫోటైన్‌మెంట్' అన మాట. యూట్యూబ్‌లో వెతికితే అప్పటివరకు షార్ట్ వీడియోలతో ఫైనాన్స్ కంటెంట్ ఇచ్చే మహిళలు కనిపించలేదు. బహుశా భారత్‌లో ఆ ట్రెండ్ నాతోనే మొదలైందని అనుకొంటున్నా.

అవహేళనలు తప్పలేదు...

సరిగ్గా కరోనా మొదటి దశలో చానల్ ప్రారంభించా. ఆశించిన స్థాయిలో ఆదరణ లభించలేదు. ఏడాదంతా అదే పరిస్థితి. నా కంటెంట్ చూసి చాలామంది చులకనగా మాట్లాడేవారు. ఎందుకో తెలియదు... కొందరు అకారణంగా దూషిస్తూ కామెంట్లు పెట్టేవారు. ఇవిచాలవన్నట్టు నా వీడియోల మీద లీగల్ నోటీసులు కూడా పంపించినవారు ఉన్నారు. కానీ వేటికీ భయపడలేదు. అవి నా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేశాయి. ఎందుకంటే నా కంటెంట్‌లో నేను ఎవరినీ కించపరచడంలేదు. ద్వేషించడంలేదు. అలాంటప్పుడు నేనెందుకు వెనక్కి తగ్గాలి? మనం సామాజిక మాధ్యమం అనే ఒక బహిరంగ వేదికపై ఉన్నాం. ఎన్నో రకాల మనుషులు వారికి తోచినట్టు స్పందిస్తుంటారు. అవన్నీ పట్టించుకొంటే ఎవరూ ముందడుగు వేయలేరని గ్రహించాను. మరింత కొత్తగా, ఆసక్తిగా, ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా కంటెంట్ ఇవ్వడం మొదలుపెట్టాను. యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా రీల్స్ చేస్తూ వచ్చాను. వంద... వెయ్యి... పదివేలు... లక్ష... క్రమంగా ఆదరణ పెరుగుతూ పోయింది. ఇవాళ నా యూట్యూబ్ చానల్‌ను ఆరు లక్షలకు పైచిలుకు సబ్‌స్క్రైబ్ చేశారు. ఇన్‌స్టాలో ఎనిమిదిన్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇవికాకుండా 'లింక్డ్ ఇన్, ఫేస్‌బుక్' తదితర మాధ్యమాల్లో కలిపి దాదాపు ఇరవై లక్షల మంది నా కంటెంట్‌ను చూస్తున్నారు.

గర్వంగా ఉంది...

ప్రస్తుతం నేను 75కు పైగా బ్రాండ్స్‌తో కలిసి పని చేస్తున్నాను. నా చానల్ ద్వారా వాటికి ప్రచారం కల్పిస్తున్నాను. మా అమ్మ ఎప్పుడూ ఒకటి చెబుతూ ఉండేది.. 'ప్రతి పోటీలో పాల్గొనాలి. గెలిచినా గెలవకపోయినా... దాని నుంచి ఏదో ఒకటి నేర్చుకొంటావు' అని. అదే నేను అనుసరిస్తున్నది. 'పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్' అన్నీ సేకరిస్తూ వచ్చాను. ఇవాళ..! నేను గెలిచాను. ప్రతిష్ఠాత్మక 'ఫోర్బ్స్ 30 అండర్ 30' జాబితాలో నాకూ చోటు దక్కింది. తొమ్మిదేళ్లు హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నాను. కానీ సంగీతంలో ఎదగలేకపోయాను. ఏడేళ్లు త్రైక్వాండో సాధన చేశాను. అనారోగ్య కారణాలతో వదిలేశాను. పోటీ పరీక్షలకు వెళ్లాను... రాష్ట్ర స్థాయి దాటలేకపోయాను. కలల కాలేజీలో సీటు సంపాదించాలనే ఏకైక లక్ష్యంతో రాత్రింబవళ్లు కష్టపడి చదివాను. కానీ కరోనాతో అటు వెళ్లలేకపోయాను. ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కంటెంట్ క్రియేషన్ మొదలుపెట్టాను. చివరకు అదే నాకు విజయాన్ని అందించింది. 'ఫోర్బ్స్' కవర్ పేజీ మీద నా చిత్రం ప్రచురించే స్థాయికి నన్ను తీసుకువెళ్లింది. నాలానే ప్రతి ఒక్కరి జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. సవాళ్లు ఎదురవుతాయి. అంతమాత్రం చేత పోటీ నుంచి తప్పుకొంటే ఏదీ సాధించలేం. వాటిని పాఠాలుగా మలుచుకుని ముందుకు సాగితేనే విజయం వరిస్తుంది."




నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Ru2R8MX లో చదవండి.

శరీరం చెప్పుచేతల్లో...

యోగా

శరీరానికి వ్యాయామం కరువైతే చిన్న చిన్న పనులకే ఎముకలు, నరాలు పట్టేస్తూ ఉంటాయి. ఈ ఇబ్బందులు తొలగాలంటే ఫ్లెక్సిబిలిటీ పెంచే ఈ యోగాసనాలు సాధన చేయాలి.



ఉత్తనాసనం

ఈ ఆసనం వెన్ను కింది భాగం సాగేలా చేస్తుంది. ఆసనం నెమ్మదిగా ఊపిరి పీల్చి వదులుతూ చేయాలి. పూర్తి ఆసనానికి కనీసం 30 సెకండ్ల నుంచి 3 నిమిషాల సమయం తీసుకోవచ్చు. ఈ ఆసనం ఎలా వేయాలంటే...

- కాళ్ల మధ్య అర అడుగు ఎడం ఉండేలా నిలబడి మోకాళ్లను కొద్దిగా వంచి, చేతులు పైకి లేపి, నడుము దగ్గర్నుంచి శరీరాన్ని ముందుకు వంచాలి.
- రెండు చేతులు పాదాలను తాకించాలి.
- ఇలా చేసే సమయంలో మోకాళ్ల వెనక లాగినట్టు అనిపించడం సహజం. ఈ నొప్పి ఆసనం అలవాటయ్యేకొద్దీ తగ్గుతుంది.
- అలాగే ప్రారంభంలో కాళ్లను నిలువుగా ఉంచలేం. కాబట్టి మోకాళ్లు కొద్దిగా వంచి ఆసనం అలవాటు చేసుకోవచ్చు.

బద్ధకోణాసనం

ఈ ఆసనంతో తొడలు, కటి ప్రదేశం, మోకాళ్లు సాగుతాయి. ఆ ప్రదేశాల్లో ఉన్న ఇబ్బందులు తొలగి సంబంధిత అవయవాలను తేలికగా, ఎటువంటి ఆటంకం లేకుండా కదిలించగులగుతారు. ఈ ఆసనం ఎలా వేయాలంటే...

- కాళ్లను ఎదురుగా ఉంచి కూర్చోవాలి.
- కాళ్లను శరీరానికి దగ్గరగా మడిచి, రెండు పాదాలను సాధ్యమైనంతగా దగ్గరకు చేర్చాలి.
- రెండు చేతులతో రెండు పాదాల బొటనవేళ్లను పట్టుకోవాలి.
- వెన్ను నిటారుగా ఉంచాలి.
- మోకాళ్లను నేలకు తాకించే ప్రయత్నం చేయకూడదు.
- తొడలు, పిరుదులు నేలకు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి.



వైసీపీపై ఈసీ చర్యలు తీసుకోవాలి

» వలంటీర్లను రోడ్డున పడేశాలా జగన్ వ్యాఖ్యలు: బొండా ఉమ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వలంటీర్లే వైసీపీ భవిష్యత్తు నేతలన్న జగన్‌పైన, వైసీపీపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఐదేళ్లుగా ప్రజాసేవకులని చెప్పిన వలంటీర్లు ఎన్నికలకు రెండు నెలల ముందు వైసీపీ నాయకులు ఎలా అయ్యారో? జగన్ ఐదేళ్లలో వారికి రూ.9,663 కోట్లు ప్రజల సొమ్ము ఎలా దోచిపెట్టాడో ఈసీ ప్రశ్నించాలి. ఐదేళ్లుగా వలంటీర్ల సేవలు పొందిన వైసీపీ గుర్తింపు రద్దు చేసి, ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవాలి. వలంటీర్లు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి జగన్‌పై, వైసీపీ నేతలపై తిరగబడాలి. లోకేశ్ వలంటీర్లను రెగ్యులరైజ్ చేసి వారికి వేతనాలు పెంచుతామని ఇప్పటికే హామీ ఇచ్చారు. ఆయన చెప్పింది జరగకూడదన్న దురుద్దేశంతో జగన్ వలంటీర్లను పూర్తిగా రోడ్డున పడేసేలా వ్యాఖ్యానిస్తున్నారు' అని విమర్శించారు.

ధర్మారెడ్డీ.. తిరుమలలో ధర్మమేదీ: సప్తగిరి ప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో ధర్మం ఎక్కడుందని టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్‌రెడ్డి పాలనలో తిరుమలలో భూకబ్జాలు, అక్రమణలు పెచ్చుమీరాయి. వైసీపీ నేతలు తిరుమల, తిరుపతిలో ఎక్కడా సెంటు భూమి వదలకుండా కబ్జా చేస్తున్నారు. విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు చేస్తున్నారు. శారదా పీఠం భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు టీటీడీ ఈవో ధర్మారెడ్డికి కనిపించడం లేదా? రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ కమిషన్ నియమించే వరకు నిద్రపోయాడా? శారదా పీఠం ఆక్రమించిన 4,817 చ.అడుగుల భూమిని ఏ చట్టప్రకారం రెగ్యులరైజ్ చేశారో జవాబు చెప్పరా? స్వామి వారి గోపురం ఎత్తుని మించి శారదాపీఠం నిర్మాణాలు జరుగుతుంటే టీటీడీ ఇంజనీరింగ్, విజిలెన్స్ విభాగాలు ఏం చేస్తున్నాయి? తిరుమల కొండపై చిన్న చిన్న దళారుల స్థానంలో వైసీపీ ఎమ్మెల్యేలు రంగప్రవేశం చేసిన మాట నిజం కాదా? వీఐపీ బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవా టికెట్లను తన వర్గం ఎమ్మెల్యేలకు ఎక్కువగా ఇచ్చి, ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు తక్కువగా కేటాయించిన మాట నిజం కాదా? వీటిపై శ్వేతపత్రం ఇస్తారా? తిరుమల కొండపై అక్రమాలను స్వామి చూడలేదనుకుంటున్నారేమో.. వ్యవస్థల్ని మేనేజ్ చేసినట్లు స్వామి వారిని మేనేజ్ చేయలేరు' అని హెచ్చరించారు.

ఈ ఏడాది ఏపీ అప్పు 1,05,200 కోట్లు: జీవీ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం 24వ సారి ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటిందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీరెడ్డి తెలిపారు. ఈ వారం ఆర్బీఐ నుంచి మరో రూ.900 కోట్లకు ఇండెంట్ పెట్టింది. ఈ ఏడాది తెచ్చిన అప్పు రూ.1,05,200 కోట్లు. దీంతో అప్పు 347.48 శాతానికి చేరింది. ఇది గిన్నిస్ బుక్‌లో ఎక్కించాల్సిన రికార్డు అని శుక్రవారం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

కూర్చున్న శునకాన్ని తరిమేస్తాం: బుద్దా వెంకన్న

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'ఇక్కడున్నది సింహాసనం.. కుర్చీ కాదు మడత పెట్టడానికి' అని మంత్రి అంబటి రాంబాబు ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలకు టీడీపీ నేతలు శుక్రవారం స్ట్రాంగ్‌గా కౌంటర్లు ఇచ్చారు. 'గతంలో అది సింహాసనమే. ప్రస్తుతం అది గ్రామ సింహాసనం. దానికి ఆ పేరు తెచ్చిన ఘనత ఎవరిదో నీకు తెలుసుగా అంబటి?' అంటూ మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కౌంటర్ ఇస్తూ... 'మేం కూడా అదే చెబుతున్నాం అంబటి.. కుర్చీ అయితే మడత పెడతాం. సింహాసనం అయితే.. దాని మీదున్న శునకాన్ని తరిమేస్తాం. ఇది ఓకేనా?' అని ప్రశ్నించారు.

జగన్ సింహం కాదు.. చిట్టెలుక: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సింహం కాదు.. చిట్టెలుక అని ఎంపీ రఘురామకృష్ణరాజు ఎద్దేవా చేశారు. గంగ చంద్రముఖిగా మారడం రొటీనే కానీ సింహం చిట్టెలుకగా మారడమే వెరైటీ అని అపహాస్యం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓటు వేస్తే, మీ ఇంటికి చంద్రముఖి వస్తుందని జగన్ ముద్దుముద్దుగా మాట్లాడుతున్నారని, చంద్రముఖి అంత చెడ్డ క్యారెక్టర్ ఏమీ కాదని సెటైర్లు వేశారు. 'రాజధాని ఫైల్స్' సినిమా బాటలోనే ఇంకా చాలా సినిమాలు రావచ్చని చెప్పారు. మనసున్న ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా ఈ సినిమాను చూసి అమరావతి రైతులకు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

'ఎడెక్స్'తో ప్రభుత్వం ఒప్పందం

ఆన్‌లైన్‌లో 2 వేల విదేశీ వర్సిటీల కోర్సులు చదివేందుకు అవకాశం

12 లక్షల మందికి లబ్ధి: సీఎం జగన్



ఎడెక్స్‌తో ఒప్పంద కార్యక్రమంలో సీఎం జగన్, సంస్థ ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీల్లోని కోర్సులను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు ఈ-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎడెక్స్' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సీఎం జగన్ సమక్షంలో శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నత విద్య చదువుతున్న 12 లక్షల మంది విద్యార్థులకు 2 వేల ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉండే కోర్సులను విద్యార్థులు ఎంపిక చేసుకుని, ఇక్కడి యూనివర్సిటీ ద్వారా ఆన్‌లైన్‌లో చదవొచ్చని తెలిపారు. 'ఎడెక్స్' సీఈవో అనంత్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ఈ ఒప్పందం ఒక గేమ్ చేంజర్ అవుతుందని అభిప్రాయపడ్డారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన దళిత కుటుంబాలు

రాయదుర్గం, ఫిబ్రవరి 16: అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో 1,144 దళిత కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఇది చరిత్రాత్మకమని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం పట్టణంలో శుక్రవారం దళిత గర్జన నిర్వహించారు. ఈ వేదిక మీద నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,144 దళిత కుటుంబాలు పసుపు కండువా కప్పుకున్నాయి. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, కాల్వ శ్రీనివాసులు వారిని సాదరంగా ఆహ్వానించారు. అంతకు మునుపు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దళితులకు వైఎస్ జగన్ చేస్తున్న అన్యాయాన్ని జీర్ణించుకోలేక, రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చాలా అవసరమని భావించి పార్టీలో చేరామని దళితులు తెలిపారు.

పేదల విద్యపై చిన్నచూపు

విద్యాహక్కు చట్టంపై ప్రచారమేదీ?

» ప్రభుత్వం అవగాహన కల్పించకపోవడంతో మిగిలిపోతున్న సీట్లు

» ఈ సంవత్సరం 71 వేల సీట్లు ఖాళీ

» సర్కారు తీరుతో పేద విద్యార్థులకు నష్టం

» బటన్ నొక్కే పథకాలకు భారీగా ప్రచారం

» చిన్నారుల చదువును పట్టించుకోని వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బటన్ నొక్కే పథకాలు, రాజకీయ లబ్ధి చేకూర్చే కార్యక్రమాలకు రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రకటనలు గుప్పిస్తున్న జగన్ ప్రభుత్వం.. పేద విద్యార్థుల చదువులపై వివక్ష చూపుతోంది. విద్యా హక్కు చట్టం అమలు గురించి ఎవరికీ తెలియకుండా తూతూ మంత్రంగా అడ్మిషన్లు చేపడుతోంది. విద్యాహక్కు చట్టం కింద ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయి? ఎలా దరఖాస్తు చేసుకోవాలి? సీటు ఎలా పొందాలి? అనే అంశాలపై అవగాహన కల్పించాలన్న విషయాన్ని పాఠశాల విద్యాశాఖ పూర్తిగా మర్చిపోయింది. కనిపించీ కనిపించకుండా ఒక ప్రతికా ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకొంటోంది. చివరికి పత్రికలకు ప్రకటనలు ఇచ్చే విధానాన్ని కూడా విద్యాహక్కు చట్టం విషయంలో విస్మరించింది. దీంతో విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీట్లు పొందే అవకాశం ఉందన్న విషయం ప్రజలకు తెలియడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ విద్యా సంవత్సరంలో 90 వేల సీట్లు అందుబాటులో ఉంటే కేవలం 18,749 మంది పేద విద్యార్థులు మాత్రమే సీట్లు పొందారు. 71 వేలకు పైగా ఉచిత సీట్లు మిగిలిపోయాయి. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ చట్టం కింద అడ్మిషన్లు పొందే విషయాన్ని కూడా ప్రభుత్వం ప్రచారం కల్పించకుండా వదిలేసింది. ఈ నెల 12న దీనిపై నోటిఫికేషన్ జారీచేసినా మీడియాకు ప్రకటన కూడా ఇవ్వలేదు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా పేద విద్యార్థులు ఈ సీట్లను ఉపయోగించుకపోయినా పరవాలేదన్నట్టుగా పాఠశాల విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి.



25 శాతం సీట్లు వారికే!

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. వీటిని ఉచితంగా ఇవ్వాలి. ఆ ఫీజులను విద్యా సంస్థలకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. విద్యాహక్కు చట్టం ఎప్పుడో అమల్లోకి వచ్చినా రాష్ట్రంలో అమలు చేయలేదు. చివరికి హైకోర్టు ఆదేశాలతో 2022-23 నుంచి అమల్లోకి తెచ్చారు. అప్పుడు కూడా సరైన ప్రచారం కల్పించకపోవడంతో కేవలం 3% సీట్లే భర్తీ అయ్యాయి. ఇక 2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 90 వేల సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ, కేవలం ఒకట్రెండు నామమాత్రపు ప్రకటనలు జారీచేసి వదిలేసిన పాఠశాల విద్యాశాఖ ఎక్కడా దానిపై విస్తృత ప్రచారం చేపట్టలేదు. దీంతో 45,372 మంది దరఖాస్తు చేసుకోగా, చివరికి 18,749 మందికి సీట్లు దక్కాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ సీట్లు పేదలకు చేరువకాలేక పోయాయి.

ఐబీ ఎక్కడుంది?

పాఠశాల విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్టేట్ సిలబస్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలతో పాటు ఐబీ పాఠశాలల్లో కూడా అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొంది. విచిత్రం ఏంటంటే 2025-26 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఐబీ సిలబస్‌ను ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అలాంటప్పుడు 2024-25 సంవత్సరంలో ఐబీ సిలబస్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఎలా సాధ్యం అన్నది పాఠశాల విద్యాశాఖ అధికారులకే తెలియాలి. కాగా, ఈ నెల 23 నుంచి విద్యార్థులు అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, మార్చి 20 నుంచి 22 వరకు అర్హతలను పరిశీలిస్తారని ప్రభుత్వం తెలిపింది. ఏప్రిల్ 1న తొలి విడత లాటరీ తీస్తారని, ఏప్రిల్ 2న సీట్ల కేటాయింపు జరుగుతుందని నోటిఫికేషన్‌లో వివరించింది.

అమ్మఒడితో ముడి

విద్యాహక్కు చట్టం నిబంధనల ప్రకారం పేద విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే సీట్లకు ప్రభుత్వం ఫీజులు చెల్లించాలి. కానీ, ఆ ఫీజులకు నిధులు ఇవ్వడం ఇష్టంలేని ప్రభుత్వం.. అమ్మఒడి నిధులతో ఆ ఫీజులు కట్టుకోవాలని మెలిక పెట్టింది. అంటే అమ్మఒడి కింద ఇచ్చే రూ.13 వేలలోనే ఈ ఫీజును చెల్లించుకోవాలని చెప్పి చేతులు దులుపుకొంది. ఈ నేపథ్యంలోనే ఫీజులను బాగా తక్కువగా ఖరారు చేసింది. పట్టణాల్లోని పాఠశాలల్లో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100గా నిర్ణయించింది. అయితే ఇది ఆర్టీఈ చట్టానికి వ్యతిరేకమని ప్రైవేటు విద్యా సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. మరోవైపు ప్రభుత్వం తక్కువే ఖరారు చేసినా కొన్నిచోట్ల యాజమాన్యాలు అనధికారికంగా అదనంగా వసూలు చేస్తున్నాయి. చివరికి అమ్మఒడి పథకం పేరుతో వచ్చిన డబ్బును తల్లులు ఈ రూపంలో చెల్లించాల్సి వస్తోంది.

జగన్ పర్యటన ఉందని... లోకేశ్ సభకు అనుమతి నిరాకరణ!

విశాఖపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఉందని, టీడీపీ శంఖారావం సభకు విశాఖ పోలీసులు అనుమతి నిరాకరించారు. దాంతో టీడీపీ తన కార్యక్రమం మార్చుకోవలసి వచ్చింది. శారదా పీఠం వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ఈ నెల 19న సీఎం విశాఖపట్నం రానున్నారు. ఇదిలావుండగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం శనివారం (17వ తేదీ) నుంచి విశాఖపట్నంలో మొదలవుతోంది. ఈ పర్యటన ముందుగానే ఖరారైంది. ఈ నెల 19వ తేదీ ఉదయం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో లోకేశ్ సభ నిర్వహించాల్సి ఉంది. అదే మార్గంలో సీఎం శారదా పీఠానికి వెళతారు కాబట్టి ఎవరికీ ఆ ప్రాంతంలో సభల నిర్వహణకు అనుమతి ఇవ్వబోమని పోలీసులు చెప్పారు. దాంతో లోకేశ్ పశ్చిమ నియోజకవర్గం సభను 19 నుంచి 18వ తేదీ రాత్రికి మార్చుకున్నారు. 19వ తేదీన విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పర్యటన ఏర్పాటు చేసుకున్నారు.

టీడీపీ హామీలకు భారీ స్పందన: కూన

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను విశ్వసించి వాటిని పొందడం కోసం రాష్ట్రంలో 95 లక్షల కుటుంబాలు నమోదు చేయించుకున్నాయని మాజీ విప్ కూన రవి కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టీడీపీ ఆరు హామీలు ఇచ్చింది. టీడీపీ శ్రేణులు రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి వీటి గురించి వివరించి ఏ ఇంటికి ఎంతెంత ప్రయోజనం కలుగుతుందో ఒక హామీ పత్రం కూడా ఇస్తున్నాం. వీటిని విశ్వసించి ఈ హామీ పత్రం తీసుకోవడానికి 95 లక్షల కుటుంబాలు ముందుకు వచ్చి నమోదు చేయించుకొన్నాయి. ఏ నియోజకవర్గంలో ఏ రోజు ఎంత మంది నమోదు చేయించుకొన్నారో మాకు ప్రతి రోజూ సమాచారం అందుతోంది. టీడీపీ పట్ల, పార్టీ అధినేత చంద్రబాబు పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం' అని కూన చెప్పారు. ఈ హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో విజయవంతమైన టీడీపీ శ్రేణులు జనసేనతో కలిసి ఇరు పార్టీల విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వలంటీర్లను ఎదురుగా పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి హింసాత్మక వ్యాఖ్యలు చేశారని, ఆయన భాషపై ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని కూన డిమాండ్ చేశారు.

కొండపిలో అధికారుల మార్పుపై ఎస్ఈసీకి ఫిర్యాదు: డోలా

అమరావతి, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఆదిమూలపు సురేశ్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కొండపి నియోజకవర్గంలో దొంగ ఓట్లతో గెలవటానికి ప్రయత్నిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి మండిపడ్డారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'జగన్‌రెడ్డి రాజకీయ బదిలీల్లో యర్రగొండపాలెం నుంచి కొండపి వచ్చిన మంత్రి సురేశ్... అధికారులను ఒత్తిడి చేసి, టీడీపీ శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు. మంత్రి పదవిని ఉపయోగించి, పక్క జిల్లాల నుంచి తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఎంపీడీవోలను రప్పించి కొండపి నియోజకవర్గంలో నియమించారు. కలెక్టర్‌కు తెలియకుండా మంత్రే స్వయంగా తన సామాజిక వర్గం వారిని, తనకు అనుకూలంగా పని చేసే వారిని ఎన్నికల విధుల్లో నియమిస్తున్నారు. కొండపిలో అధికారుల మార్పుపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశా. కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకెళ్లి, మంత్రి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేస్తా' అని డోలా తెలిపారు.

పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యకు పతీ వియోగం



రామకృష్ణారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్య జీవిత భాగస్వామి, కవి, నవ్య ప్రింటింగ్ ప్రెస్ సంస్థ యజమాని రామకృష్ణారెడ్డి (62) శుక్రవారం ఉదయం మృతిచెందారు. గత కొంత కాలంగా 'మల్టిపుల్ ఆర్గాన్ డిజార్డర్'తో బాధపడుతున్న ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని ఆపోలో ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఉదయం 11 గంటలకు చిట్యాల సమీపంలోని నేరడ గ్రామంలోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తారు. విప్లవ సాహిత్యాన్ని ముద్రిస్తున్నారనే కారణంతో పోలీసులు రెండేళ్ల క్రితం నవ్య ప్రింటింగ్ ప్రెస్‌పై దాడి చేసి సీజ్ చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో చురుకుగా పాల్గొన్న రామకృష్ణారెడ్డి అదే యూనియన్‌లో పనిచేస్తున్న ఉద్యమ సహచరురాలు వి.సంధ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వై.వెంకటేశ్వర్లు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ, సీపీఐ(ఎంఎల్), సీపీఎం, సీపీఐ నాయకులు, కవులు, ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పంట పొలాల్లోకి యురేనియం వ్యర్థాలు



పులివెందుల నియోజకవర్గం కేకే కొట్టాల సమీపంలో లీకైన యూసీఐఎల్ వ్యర్థాలు, యురేనియం వ్యర్థాలు కనిపించకుండా ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

» యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ పైప్‌లైన్ లీకేజీ

» ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించిన అధికారులు

పులివెందుల, ఫిబ్రవరి 16: యురేనియం వ్యర్థాల విషయంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్‌లో నాలుగు రోజులుగా భద్రతా వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ కావడం కలకలం రేపుతోంది. యురేనియం వ్యర్థాలను నిల్వ చేసే టెయిలింగ్ పాండ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. కానీ ఇక్కడ పదేపదే పైప్‌లైన్ లీక్ కావడం పరిపాటిగా మారింది. గురువారం యూసీఐఎల్ నుంచి టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ అయింది. దాదాపు 12 నుంచి 15గంటల పాటు వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. దీనిని గమనించిన కొందరు రైతులు యూసీఐఎల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. ఆ వ్యర్థాలను పొరపాటున ఎవరైనా తాకితే చర్మం పూర్తిగా ఊడిపోతుందని చెబుతున్నారు. ఇలాంటి ప్రమాదం జరుగుతుందనే ఆందోళనతో అప్పటికప్పుడు ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. ఈ పనులను ఫొటోలు తీస్తున్న కేకేకొట్టాల వాసులను యూసీఐఎల్ సిబ్బంది అడ్డుకొని అక్కడినుంచి పంపేశారు. దీనిపై యూసీఐఎల్ అధికారులను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. టెయిలింగ్ వ్యవహారాన్ని యూసీఐఎల్ గాలికి వదిలేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



వైసీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్‌ను నిలదీస్తున్న ట్యాంకర్ల యజమానులు

నీళ్ల బిల్లులు చెల్లించండి మహాప్రభో!

» మా జేబులు గుల్ల చేసుకొని జనం గొంతులు తడిపాం

» రోడ్డెక్కిన వైసీపీ సర్పంచులు, ట్యాంకర్ల యజమానులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 16: 'గ్రామాల్లో నాలుగేళ్ల నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశాం. జేబులు గుల్ల చేసుకొని జనం గొంతు తడిపాం. మాకు బిల్లులు ఇప్పించండి మహాప్రభో' అంటూ వైసీపీ సర్పంచ్‌లు, ట్యాంకర్ల యజమానులు శుక్రవారం రోడ్డెక్కారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట 20 నిమిషాల పాటు రాస్తారోకో చేశారు. దీంతో మార్కాపురం నుంచి మాచర్ల వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ట్యాంకర్ల యజమానుల సమన్వయకర్త రమణారెడ్డి మాట్లాడుతూ.. తమకు నాలుగేళ్లుగా బిల్లులు రాలేదన్నారు. దీంతో నీటిని సరఫరా చేయకలేకపోతున్నామని తెలిపారు. తమను గ్రామాల్లో జనంతో పాటు పార్టీ కార్యకర్తలు కూడా విశ్వసించని పరిస్థితి నెలకొందని వాపోయారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో 3 నెలలకే బిల్లులు వచ్చేవని, తమ ప్రభుత్వంలో అసలు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ బిల్లులు రాకపోతే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్‌ను చుట్టుముట్టి తమ బిల్లులు ఎప్పుడు ఇప్పిస్తారో తేల్చాలని నిలదీశారు. ప్రభుత్వం నుంచి వెంటనే బిల్లులు ఇప్పిస్తానని చంద్రశేఖర్ హామీ ఇవ్వడంతో వైసీపీ నాయకులు ఆందోళన విరమించారు.

కర్నూలు జీజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు విజయవంతం



కిడ్నీ మార్పిడి చేయించుకున్న కర్నూలు, కడప జిల్లాల రోగులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి

కర్నూలు (హాస్పిటల్), ఫిబ్రవరి 16: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. కడప పట్టణానికి చెందిన ఎస్తేర్ రాణి (44) కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన వీరన్న (26)లకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు వైద్యులు నిర్వహించారు. కడపకు చెందిన ఎస్తేర్ రాణి ఈ నెల 5న కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. ఇదే సమయంలో కర్నూలు నగరానికి చెందిన పావనిలత (26) అనే మహిళ బ్రెయిన్ డెడ్ అయింది. ఆమె తల్లిదండ్రులు కిడ్నీలతో పాటు కళ్లు, లివర్, ఊపిరితిత్తులను దానం సేందుకు అంగీకరించారు. వాటిలో కిడ్నీని కర్నూలు కిమ్స్‌కు ఇవ్వగా, మరో కిడ్నీని కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ దాన్ని ఈ నెల 6న కడప మహిళకు అమర్చారు. అలాగే కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలానికి చెందిన ఈరన్న (26)కు ఆయన తల్లి ఈరమ్మ కిడ్నీ ఇవ్వడంతో గత నెల 29న ఆ కిడ్నీని వైద్యులు అమర్చారు. కిడ్నీ మార్పిడి చేయించుకున్న ఇద్దరు రోగులు శుక్రవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి, యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే తొలిసారిగా బ్రెయిన్ డెడ్ అయిన రోగి నుంచి సేకరించిన కిడ్నీని మరో రోగికి కడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా అమర్చినట్లు తెలిపారు.

విశాఖ రాజధాని వెనుక భారీ కుట్ర: రమేశ్‌నాయుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైందని బీజేపీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌నాయుడు ఆరోపించారు. విశాఖను రాజధానిని చేయాలనే జగన్ ఆలోచన వెనుక భారీ కుట్ర దాగుందన్నారు. శనివారం నుంచి ఢిల్లీలో రెండు రోజుల పాటు బీజేపీ జాతీయ మండలి సమావేశాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విశాఖలో సీఎం జగన్‌కు 6,000 ఎకరాల భూమి ఉంది. అందుకే విశాఖను రాజధానిని చేయాలని అనుకున్నారు. ఏపీలో భూములను వైసీపీ నేతలకు కట్టబెట్టేందుకు అధికారులు అన్నివిధాలా సహకరించారు' అని ఆరోపించారు.

గిట్టుబాటు ధరపై చట్టం తేవాలి

» రోడ్డెక్కిన రైతులు, కార్మికులు.. వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు

ఒంగోలు, నెల్లూరు, ఫిబ్రవరి 16: రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు వెంటనే చట్టం తీసుకురావాలని వామపక్ష, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో వారు తలపెట్టిన గ్రామీణ, పట్టణ బంద్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. నెల్లూరు నగరంతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరుల్లో బంద్ జరిగింది. సీపీఎం సీపీఐ, న్యూడెమోక్రసీ నేతలు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది.

12 పాలిటెక్నిక్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 12 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించిందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకూ 31 పాలిటెక్నిక్‌లలో 60 విభాగాలకు ఎన్‌బీఏ దక్కిందన్నారు. కొత్తగా అనంతపురం, శ్రీశైలం, తిరుపతి, పిల్లరిపట్టు, శ్రీకాకుళం, రాజమండ్రి, జమ్మలమడుగు, కదిరి పాలిటెక్నిక్‌లున్నాయని.. నందిగామ, పలమనేరు, కడప మహిళా పాలిటెక్నిక్‌లతో పాటు మదనపల్లె మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌కు గుర్తింపు దక్కిందన్నారు.

భీమవరంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభలు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభలు శని, ఆదివారాల్లో భీమవరంలో జరుగుతాయని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ఓ ప్రకటనలో తెలిపారు. 300 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇందులో పాల్గొంటారన్నారు.

ఎక్కడ పుడితేనేం.. జగన్‌లా జనం రక్తం పీల్చలేదు

» మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలపై సత్యకుమార్ ధ్వజం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'ఎక్కడ పుడితేనేమి... జగన్‌లా జనం రక్తమేమీ పీల్చలేదు. ఆంధ్రప్రదేశ్ ఏమైనా మీ సామ్రాజ్యమా? లేక బీసీలందరూ మీ బానిసలా..!' అంటూ బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ నిలదీశారు. సత్యకుమార్ ఎక్కడో పుట్టి ఏపీలో ఎలా పోటీ చేస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. దీనిపై సత్యకుమార్ శుక్రవారం ఎక్స్‌లో స్పందించారు. ఎక్కడ పుట్టారు? ఎక్కడ పెరిగారని జగన్ తన తల్లిని విశాఖపట్నంలో ఎంపీగా నిలబెట్టారు? నెల్లూరు ఎమ్మెల్యేను నరసరావుపేట ఎలా పంపారని నిలదీశారు.


కోస్తాలో చలిగాలులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది నుంచి మధ్య భారతం మీదుగా రాష్ట్రంలోని కోస్తా వరకు చలిగాలులు వీచాయి. దీంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు చలి కొనసాగింది. దీనికితోడు మంచు దట్టంగా కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా శుక్రవారం పగటిపూట ఎండ తీవ్రత కొనసాగింది. నందిగామలో 36.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

చంద్రబాబుపై మరో చార్జిషీటు

ఈసారి 'ఫైబర్‌నెట్' కేసులో!.. ఇప్పటికే ఐఆర్ఆర్ కేసులో దాఖలు

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై సీఐడీ అధికారులు కోర్టులో మరో చార్జిషీటు దాఖలు చేశారు. ఈసారి ఫైబర్‌నెట్ కేసులో ఆయన్ను ప్రధాన నిందితుడిగా చేర్చుతూ.. ఐపీసీ 166, 167, 418, 465, 468, 471, 409, 506, రెడ్‌విత్ 120(బి), ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టంలోని 13(2), రెడ్‌విత్ 13(1)(సీ)(డీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సంబంధిత చార్జిషీటును శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేశారు. ఫైబర్‌నెట్ మొదటిదశలో కుంభకోణం జరిగిందని అందులో పేర్కొన్నారు. 'చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నేరపూరిత ఆలోచనతో వి.హరికృష్ణప్రసాద్‌ను గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించారు. ప్రాజెక్టు అంచనా, పరికరాలకు మార్కెట్‌లో ఉన్న ధరలను పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చారు. ఈ విషయంలో ఆయన ప్రభుత్వ సీనియర్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. టెండర్ల కమిటీలో హరికృష్ణ ప్రసాద్ ఉన్నారు. నిబంధనలను ఉల్లంఘించి బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న టెరాసాఫ్ట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి టెండర్‌ను కట్టబెట్టారు. మిగిలిన టెండరుదారులు గొడవ చేయకుండా టెర్రాసాఫ్ట్ కంపెనీ.. వారికి ముడుపులు ముట్టజెప్పింది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న కోగంటి సాంబశివరావు లోగడ ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీగా, ఇన్‌క్యాప్ వీసీ అండ్ ఎండీగా వ్యవహరించారు. ఆయన టెండర్ ప్రక్రియను తారుమారు చేశారు. టెండర్ల ప్రక్రియ ముగిసే రోజున బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న టెరాసాఫ్ట్‌ను అందులో నుంచి తొలగించారు. టెరాసాఫ్ట్ కంపెనీకి, హరికృష్ణప్రసాద్‌కు మధ్య జరిగిన ఒప్పందంతోనే ఇదంతా చేశారు. ఈ కంపెనీకి అధికారులు టెండర్ కట్టబెట్టారు. ఇది ఎలాంటి నాణ్యత లేకుండా పనులు నిర్వహించింది. ఫైబర్‌నెట్‌లో ఈ కంపెనీకి రూ.330 కోట్ల వరకు మేలు చేసేలా అధికారులు వ్యవహరించారు. టెండర్ కమిటీ నిర్వాకంతో ప్రభుత్వానికి రూ.114 కోట్ల నష్టం కలిగింది. వివిధ కంపెనీలకు సంబంధించిన నకిలీ ఇన్వాయిస్‌లతో నిధులను దుర్వినియోగం చేశారు. టెరాసాఫ్ట్ కంపెనీకి ప్రభుత్వం రూ.333 కోట్లు కట్టబెట్టింది. ఈ కంపెనీ టెరామీడియా క్లౌడ్ కంపెనీకి అనుబంధం. టెరామీడియా క్లౌడ్‌లో హరికృష్ణప్రసాద్ భాగస్వామి. చంద్రబాబు చెప్పినట్లే హరికృష్ణ ప్రసాద్ చేశారు. కేసులో ఉన్న సీనియర్ అధికారులను కోర్టు ముందు ప్రవేశపెట్టాం. తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేశాం. ఫైబర్‌నెట్ కేసులో విచారించడానికి అనుమతి ఇవ్వాలని పీటీ వారెంట్ దాఖలు చేశాం. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్ కేసులు ఏసీబీ కోర్టులో ఉన్నాయి. చంద్రబాబు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు, హైకోర్టు తోసిపుచ్చాయి. ఆ తర్వాత ఆయన సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణ పెండింగ్‌లో ఉంది' అని సీఐడీ చార్జిషీటులో తెలిపింది. దీనిపై ఏసీబీ కోర్టు ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించలేదు. చంద్రబాబుపై ఇదివరకే ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) కేసులో చార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.



ఫ్యూచర్ ట్రెండ్

'ఆర్టిఫీషియల్' బాయ్‌ఫ్రెండ్!

తరం మారుతోంది జగం మారుతోంది అంటే ఇదే. మనిషి స్థానంలో రోబో సేవలు అందించడం తెలిసిన విషయమే. అయితే హ్యూమన్ రోబో ఏకంగా బాయ్‌ఫ్రెండ్ అవతారం ఎత్తుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సహకారంతో ఈ పని జరుగుతోంది.

చైనాకు చెందిన స్టార్టప్ కంపెనీ రూపొందించిన యాప్ 'మినీమాక్స్' అమ్మాయిలకు అనువైన రోబోలను అంటే బాయ్‌ఫ్రెండ్స్‌ను అందిస్తోంది. రొమాంటిక్ పార్టనర్ దొరికాడంటూ ఒక చైనీస్ అమ్మాయి సంతోషం వ్యక్తం చేస్తోంది. అంతే కాదు, అంతా యాప్ మహిమ అంటోంది. గంటల కొద్దీ మాట్లాడుతోంది, సానుభూతి వర్షమే కురిపిస్తోందంటూ ఆ భామ మురిసిపోతోంది. అంటే సదరు యాప్ ఏ స్థాయిలో యువతులకు సహకరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రక్రియలో బాయ్ ఫ్రెండ్ ఒక చాట్ బోట్ 'గ్లో'. ఈ యాప్‌తో ఫ్రెండ్లీ - రొమాంటిక్ - హ్యూమన్ రోబోట్ సంబంధాలకు తెర లేపింది. నిజానికి ఒక సగటు మగాడు కంటే బెటర్‌గా ఆ రోబో వ్యవహరిస్తోంది. పీరియడ్స్ సమయంలో కలిగే పెయిన్ నుంచి కూడా బైటపడి సౌకర్యవంతంగా ఉండేలా సహకరిస్తోంది. ఈ యాప్ ఉచితం. అలాగే ఇందులో పెయిడ్ కంటెంట్‌ను కూడా అందిస్తోంది. వాట్సాప్ చానల్ కూడా ఉంది. నిజ జీవితంలో ఐడియల్ బాయ్ ఫ్రెండ్ లభించడం అసాధ్యం. అయితే ఈ యాప్ ఆ సౌకర్యాన్ని అందిస్తోంది. తనను ఉపయోగిస్తున్న అమ్మాయిల అవసరాలను అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టు వ్యవహరిస్తోంది. ఎమోషనల్ సపోర్ట్ అద్వితీయం. ఇలాంటిదే మరో యాప్ 'వాంటాక్'. మొదటి యాప్‌లో ఉన్న బాయ్ ఫ్రెండ్స్ ఇందులోనూ కనిపిస్తున్నారని ఒకామె ఈ సందర్భంలో తెలిపింది. మొత్తమ్మీద ఈ రకం యాప్‌లు మరిన్ని ఉనికిలో వస్తే, రాబోయే తరాలను ఎలా ఊహించుకోవాలన్నది ప్రశ్నార్థకం కానుంది.

5 యూజ్‌ఫుల్ యాప్స్



ప్రయోజనం లేని పనులకు అత్యధికులు దూరంగానే ఉంటారు. అయితే రోజువారీ అలవాట్లు మొదలుకుని వివిధ ఇతర పనులను అర్థవంతంగా చక్కబెట్టుకునేందుకు వీలైనవి ఈ ఐఫోన్ యాప్స్ అని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే...

స్క్రైవనర్: రైటర్లను ఉద్దేశించిన యాప్ ఇది. రైటింగ్ టూల్స్‌ను కలుపుతుంది. వివిధ డ్రాఫ్ట్ అంటే స్క్రాప్‌బుక్స్, మాన్యుస్క్రిప్ట్, డాక్యుమెంట్స్, స్క్రీన్‌ప్లే వంటివి స్క్రిప్ట్‌రైటింగ్ మోడ్‌లో రాసుకుంటే వాటి రూపకల్పనలో సహకరిస్తుంది. కస్టమైజబుల్ కీబోర్డ్‌ను అందిస్తుంది. ఫార్మింగ్, నేవిగేషన్, పంక్చుయేషన్‌కు అవసరమైన బటన్స్‌ను అనువుగా మారుస్తుంది. మ్యాక్‌ఓఎస్, విండోస్ వెర్షన్స్ మధ్య సింక్ కోసం యూజర్లు ఇందులోని డ్రాప్‌బాక్స్‌ని ఉపయోగించుకోవచ్చు.

పాకెట్ : వీలున్నప్పుడు చదువుకునేందుకు వీలుగా ఆర్టికల్స్, లింక్స్‌ని ఇది సేవ్ చేస్తుంది. ఆఫ్‌లైన్ స్టోరేజీ ఫీచర్‌తో ఇది వచ్చింది. ఫలితంగా ఇంటర్నెట్, వైఫై కనెక్షన్ లేకుండానే సేవ్ చేసుకున్న ఆర్టికల్స్ తదితరాలను చదువుకోవచ్చు. టోగింగ్ ఫంక్షనాలిటీస్ - టెక్స్ట్ టు స్పీచ్ ఫీచర్, బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్స్ కూడా ఈ యాప్‌లో ఉన్నాయి.

5 మినిట్ జర్నల్ సెల్ఫ్ కేర్ : నిజానికి ఉద్వేగాలను అక్నాలెడ్జ్ చేయడం, కృతజ్ఞతలు తెలియజేసుకోవడం మంచి పని. ఈ విషయంలో అయిదు నిమిషాల్లోనే సంతోషంగా సదరు పనిపూర్తి చేసే అవకాశాన్ని ఈ యాప్ కలుగజేస్తుంది. రిమైండర్లు, డైలీ కోట్స్, వీక్లీ సవాళ్ళు వంటివి కూడా ఇది యూజర్లకు పంపుతుంది.

నూమ్: వెయిట్ తగ్గడం, రోజూ ఆరోగ్యకర స్థాయిలో కేలరీలు తీసుకోవడం వంటి విషయాల్లో ఉపయోగపడే యాప్ ఇది. పది డైలీ టాస్కులను ఇస్తుంది. రోజులో ఆహారం తీసుకోవడం నుంచి ఎక్సర్‌సైజుల వరకు ఉంటాయి. బిహేవియరల్ సైకాలజీ, బయాలజీపై అకడమిక్ పేపర్లను కూడా అందిస్తుంది.

ప్రొక్రియేట్ పాకెట్: ఆర్ట్ క్రియేషన్ కోసం దీన్ని ఉద్దేశించారు. హ్యాండ్‌మేడ్ బ్రష్‌లు, ఆర్టిస్టిక్ టూల్స్, అడ్వాన్స్‌డ్ లేయర్ సిస్టమ్, వాల్కైరి గ్రాఫిక్స్ ఇంజన్ వంటివి ఇందులో ఉన్నాయి. వీటితో స్కెచ్చ్‌ల డిజైనింగ్, పెయింటింగ్స్ ఇలస్ట్రేషన్స్, యానిమేషన్స్ చేసుకోవచ్చు.



ఫిట్నెస్ యాప్ జంట్లర్ స్ట్రీక్‌కు అప్డేట్

పాపులర్ ఫిట్‌నెస్, వెల్‌నెస్ యాప్ 'జంటిల్ స్ట్రీక్‌'కు ముఖ్యమైన అప్డేట్ ఒకటి వచ్చింది. సవివరంగా ఫిట్‌నెస్ స్టేటస్‌లు, కొత్త కస్టమ్ ఐకాన్, రీబిల్డ్ చేసిన వాచ్ యాప్ ఈ అప్డేట్‌లో ఉన్నాయి. పునర్వ్యవస్థీకరించిన వాచ్‌ఓఎస్ యాప్ - బ్యాటరీని తక్కువగా వినియోగించుకుంటుంది. 14 వరకు ఫిట్‌నెస్ స్టాటస్‌లు ఇందులో ఉంటాయి. ఈ వాచీని ధరించిన వ్యక్తికి చెందిన వాస్తవిక ఆరోగ్య పరిస్థితితో మమేకం కావడం ఈ స్టాటస్‌లకు సంబంధించి విశేషమని డెవలపర్లు చెబుతున్నారు. కొత్తగా ఆరు కస్టమ్ ఐకాన్స్‌ని తీసుకువచ్చారు. ఇందులో మూడింటిని జంటిల్ స్ట్రీక్ టీమ్ రూపొందించింది. మిగిలిన మూడింటిని ఐకాన్ చాలెంజ్‌లో బాగంగా వచ్చిన వాటి నుంచి ఎంపిక చేసింది. ఒక్క విషయం, ఈ యాప్ వ్యక్తి ఫిజికల్ కండిషన్‌కు అద్దంపడుతుంది. వర్కౌట్స్ ఇంప్రూవ్ అయ్యేందుకు తోడ్పడుతుంది.



నెట్‌పరంగా ట్రాప్‌లు అనేకం. ఇందులో సబ్‌స్క్రిప్షన్ ట్రాప్స్ ఎక్కువ అని తేలింది. అంతే కాదు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఏకంగా పదమూడు రకాల సంబంధిత డార్క్ ప్యాట్రన్లను నిషేధించింది. అందులో సబ్‌స్కిప్షన్ ట్రాప్ కూడా ఒకటి. తమ సర్వేలో పాల్గొన్న కన్స్యూమర్లలో సగం మంది సబ్‌స్క్రిప్షన్ ట్రాప్స్ బాధితులేనని 'లోకల్‌సర్కిల్స్' పేర్కొంది.

రహస్య చార్జీలు, కొనుగోలుకు ఉద్దేశించిన డార్క్ ప్యాటర్న్ లేదా మొబైల్ అప్లికేషన్ స్టోర్స్ నుంచి తీసుకునే మరో సాఫ్ట్‌వేర్ మోసాలకు కారణమవుతున్నాయని వివరించింది. ఉచిత యాప్ లేదా వన్ టైమ్ సర్వీస్ కాస్తా సబ్‌స్క్రిప్షన్ సేవగా మారి మోసాలకు తెరలేపుతోందని తెలిసింది. అలాగే ప్రభుత్వం గుర్తించిన ప్యాటర్న్‌లో అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, ఫోర్స్‌డ్ యాక్షన్ సబ్‌స్క్రిప్షన్ ట్రాప్, ఇంటెర్‌ఫెరెన్స్, బెయిట్ అండ్ స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్గయిజ్డ్ అడ్వర్టయిజ్‌మెంట్ వంటివి ఉన్నాయి. 67 శాతం మంది యాప్ ప్లాట్‌ఫారాల ద్వారానే మోసపోతున్నారు. 25 శాతం మంది కన్స్యూమర్లు డౌన్‌లోడ్ చేసిన యాప్‌ల నుంచే మాల్వేర్ ఇన్‌స్టాల్ అవుతోందని, అది వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తోందని తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 1 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు 44,000 మంది నుంచి రాబట్టిన సమాచారం ఆధారంగా సర్వే ఫలితాలను లోకల్‌సర్కిల్స్ నివేదించింది. ఇండియాలో 331 జిల్లాల నుంచి సమాచారాన్ని రాబట్టారు.



ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ప్రత్యేకించి ఏఐ పవర్డ్ క్యాండీ కెమెరా యాప్ ఉనికిలోకి వచ్చింది. ఇమేజ్‌లను నిమిషాల్లోనే అందంగా ఇది మలుస్తుంది.

ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ఏఐ ఎడిటింగ్ యాప్

- ఇమేజ్‌లను చాలా సులువుగానే అందంగా మలిచేందుకు ఉపయోగపడే ఫీచర్లు ఈ యాప్‌లో ఉన్నాయి. ఎడిటింగ్ ప్రాసెస్ సుదీర్ఘంగా ఏమీ ఉండదు. మల్టీ ఫీచర్స్ అలాగే బ్యూటిఫయింగ్ ఫిల్టర్స్‌తో ఎడిటింగ్ టూల్స్ ఉంటాయి. గూగుల్ ప్లే స్టోర్ 4.5 రేటింగ్‌తో ఉన్న ఈ కెమెరా యాప్‌నకు వంద మిలియన్ల మేర డౌన్‌లోడ్స్ ఉన్నాయి.
- రెండు విధులను ఈ కెమెరా నిర్వర్తిస్తుంది. ఒకటి ఏఐ కెమెరా కాగా మరొకటి రెగ్యులర్ వన్. స్టాండర్డ్ ఫొటోల నుంచి ఏఐ ఇన్‌స్పయిర్డ్ ఆర్ట్‌ని ఏఐ కెమెరా క్రియేట్ చేస్తుంది. రెగ్యులర్ కెమెరాలో ఎడిటింగ్ ఆప్షన్స్ అంటే క్రాపింగ్, బ్రైట్‌నెస్ అడ్జస్ట్‌మెంట్, ఇమేజ్ రేషియో అడ్జస్ట్‌మెంట్ ఉంటాయి.
- కెమెరా ఫిల్టర్లు సహా వందకు పైగా ఆప్షన్లు రెగ్యులర్ కెమెరాలో ఉంటాయి. ఇమేజ్ టోన్‌ను మారుస్తాయి. స్కిన్ టోన్‌ను పెంచి మొత్తమ్మీద ఫొటో కంటికి ఇంపుగా ఉండేలా చేస్తాయి.
- అదనంగా ఎడిటింగ్ ఫీచర్లు కొన్ని ఉన్నాయి. ఇమేజ్‌ని పెంపొందించే పనిలో భాగంగా డిజిటల్ మేకప్ అంటే కన్సీలర్, లిప్‌స్టిక్, బ్లష్, ఐలైనర్, మస్కర వంటివి ఉపయోగించుకోవచ్చు. అప్పుడు ఫొటోలో ప్రొఫెషనలిజం కనిపిస్తుంది.
- ఇమేజ్ డెకరేషన్ కోసం వేర్వేరు స్టిక్కర్లను ఉపయోగించుకునే వీలు కూడా ఉంటుంది. స్టిక్కర్ల సెట్స్ ఇందులో ఉంటాయి. వేర్వేరు గ్రిడ్ టెంప్లేట్స్ అందుబాటులో ఉంటాయి. తద్వారా మల్టిపుల్ ఇమేజ్‌లను సృష్టించుకోవచ్చు.

యాపిల్ నుంచి కిమీ యాప్ తొలగింపు



యాపిల్ తన యాప్ స్టోర్ నుంచి కిమీ యాప్‌ను తొలగించింది. ఐఓఎస్, ఐప్యాడ్‌ఓఎస్, మ్యాక్‌ఓఎస్ నుంచి యాప్ స్టోర్‌లో ఉన్న ఈ యాప్‌ను యాపిల్ తొలగించిందని 'ద వెర్జ్' ప్రకటించింది. విజన్ టెస్టింగ్ యాప్‌గా భావించే ఇది స్మార్ట్ ఫోన్లలో పైరేటెడ్ మూవీలను చూసే వీలు కల్పిస్తుంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇది కనిపిస్తోంది. కిమి వాస్తవానికి విజన్ టెస్టింగ్ యాప్ కానేకాదు. మసకమసకగా గోచరిస్తుంది. అయినప్పటికీ యాప్ స్టోర్‌లో ట్రెండింగ్‌లో అంటే ఫ్రీ ఎంటర్‌టైన్‌మెంట్ యాప్‌లలో ఇది ఎనిమిదో స్థానంలో ఉంది. సినిమాలు, టీవీ షోలను వీక్షించేందుకు దీనిని ఉపయోగిస్తారు. అయితే ఈ యాప్‌లో స్ప్లాష్ స్క్రీన్ లేదా అన్‌లాక్ చేసేందుకు ట్రిక్ లేవు. చూడటానికి ఈ యాప్ పాత పాప్‌కార్న్ టైమ్ యాప్‌లా ఉంటుంది. టొరెంట్స్ నుంచి సినిమాలు స్ట్రీమ్ చేసుకునే వీలు కూడా ఇది కల్పిస్తుంది. అసలు కిమ్ - టొరెంట్‌ను ఉపయోగిస్తుందా లేదా అన్నది రూఢి కాలేదు.

వన్ క్లిక్ కాలింగ్‌తో హానర్ చాయిస్ వాచ్



వన్ క్లిక్ ఎస్‌ఓఎస్ కాలింగ్‌తో హానర్ చాయిస్ వాచీ కూడా బైటకు వచ్చింది. 1.95 ఇంచీల రెక్టాంగ్యులర్ అమోల్డ్ డిస్‌ప్లే, మెటాలిక్ బాడీ, ఇంటర్‌చేంజబుల్ సిలికాన్ స్ట్రాప్స్ ఉన్నాయి. 60హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, 550 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్, 332పీపీఐ పిక్సెల్ డెన్సిటీ, 75 శాతం స్క్రీన్ - టు - బాడీ రేషియో ఉన్నాయి. 5.3 కనెక్టివిటీతో బ్లూటూత్ కాలింగ్ సపోర్ట్ ఉంది. 5 ఏటీఎం వాటర్ రెసిస్టెన్స్, 45 గ్రాముల బరువు, 10.2ఎంఎం మందంతో వచ్చింది. రెండు కలర్ ఆప్షన్స్ నలుపు తెలుపు రంగుల్లో లభ్యమవుతుంది. 100 వాచీ ఫేసులు, 120 వరకు స్పోర్ట్స్ మోడ్స్ ఉన్నాయి. దీని బ్యాటరీ లైఫ్ 12 రోజులు. దీని రేటు రూ.6,499 కాగా ఆరంభ ఆఫర్‌గా రూ. 500 డిస్కౌంట్ ఇస్తోంది. ఫిబ్రవరి 24 నుంచి అమెజాన్ నుంచి దీన్ని పొందవచ్చు.

మోటోరోలా నుంచి కొత్త ఫోన్



మోటోరోలా ఇండియాలో 'మోటోరాలా మోటో జీ04'ని విడుదల చేసింది. ఇది బడ్జెట్ ఫోను. లేటెస్ట్ ఫీచర్స్ అన్నీ ఉన్న దీన్ని పదివేల రూపాయలకు లోపు సెగ్మెంట్‌లో దీనిని ఉంచింది. 6.6 ఇంచీల ఐపీఎస్ ఎల్‌సీడీ పంచ్-హోల్ డిస్‌ప్లే, 90 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, 537 నిట్స్‌మేర పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. ఆండ్రాయిడ్ 14 వెర్షన్‌పై రన్ అవుతోంది. స్మార్ట్‌ఫోన్ సాఫీగా రన్ అయ్యేందుకు వీలున్న యుఎన్‌ఐఎస్‌ఓసీ టీ606 చిప్‌సెట్ ఉంది. 64జీబీ 128జీబీతో రెండు వేరియంట్లు వచ్చాయి. దీన్లో ట్రిపుల్ కార్డ్ స్లాట్ ఉంది. రెండు సిమ్స్‌కు తోడు ఒక మైక్రో ఎస్‌డీ అదీ ఒక టీబీ మేరకు విస్తరించుకునేందుకు వీలుగా ఉంది. 16ఎంపీ ఎఐ పవర్డ్ కెమెరా, 5ఎంపీ ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. హెచ్‌డీఆర్, పోర్ట్రయిట్ మోడ్‌తో హై క్వాలిటీ ఇమేజెస్‌ను పొందవచ్చు. 5000ఎంఏహెచ్ బ్యాటరీ అదీ 15వాట్స్ చార్జింగ్ సదుపాయం ఉంది. కాన్‌కోర్డ్ బ్లాక్, సీ గ్రీన్, సాటిన్ బ్లూ, సన్‌రైజ్ ఆరెంజ్ రంగుల్లో లభిస్తుంది. 64 జీబీ స్టోరేజీ ఉన్న ఫోన్ రేటు రూ.6,999. 128 జీబీ ఫోన్ రేటు రూ.7,999. ఈ నెల 22 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటోరోలా.ఇన్, రిటైల్ స్టోర్స్‌లలో ఇది లభ్యమవుతుంది.

హానర్ చాయిస్ ఇయర్ బడ్స్



హానర్ సరికొత్త ఇయర్ బడ్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. హానర్ చాయిస్ ఇయర్ బడ్స్ ఎక్స్5 పేరిట విడుదల అయ్యాయి. యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్‌కు తోడు సింగిల్ చార్జింగ్‌తో 35 గంటల సేవ బ్యాటరీ లైఫ్ ఉంటుంది. నిరంతరాయంగా తొమ్మిది గంటల ప్లేబ్యాక్, 18 గంటల మేర కాలింగ్ సదుపాయం ఉన్నాయి. ఇన్-ఇయర్ రూపంలో వచ్చిన ఇవి 30డెసిబల్స్ యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ ఫీచర్ కలిగి ఉంది. ఫ్రీ కాల్ ఆన్సరింగ్ సదుపాయం ఉంది. డ్యూయల్ మైక్రోఫోన్స్ ఉన్నాయి. లో-లెటెన్సీ గేమ్ మోడ్ ఫీచర్ ఉంది. 10ఎంఎం డ్రైవర్స్‌అదీ ఎస్‌బీసీ, ఏఏసీ బ్లూటూత్ కొడెక్స్ సపోర్ట్ ఉంది. 45 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. చార్జింగ్ కేసు 460ఎంఏహెచ్ బ్యాటరీతో వచ్చింది. యూఎస్‌బి టైప్-సి పోర్ట్‌తో బ్యాటరీ చార్జ్ అవుతుంది. రెండు గంటల్లో ఫుల్ చార్జింగ్ అవుతుంది. దీని బరువు 50 గ్రాములు. దీని ధర రూ.1,999 కాగా అమెజాన్ సహా మెయిన్‌లైన్ రిటైల్ స్టోర్స్‌లో లభ్యమవుతుంది. ఒక్క తెలుపు రంగులో మాత్రమే ఇవి లభిస్తాయి.



ప్రొడక్ట్

టెంపరేచర్‌ను తెలిపే చెవి రింగ్

మొబైల్, వాచీ తాజాగా చెవి రింగు కూడా పలు ఫీచర్ల సమాహారాలుగా రూపొందుతున్నాయి. మహిళలు ధరించే నగల్లో ఒకటైన చెవిరింగు తాజాగా ఆ వ్యక్తి శరీర ఉష్ణోగ్రతను పట్టేస్తుంది అంటే ఆశ్చర్యపోవద్దు. ఈ థెర్మల్ రింగ్‌ను యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ శాస్త్రవేత్తలు డెవలప్ చేశారు.

స్మార్ట్ వాచీల కంటే మిన్నగా ఈ రింగుకు ఉండే ఇయర్‌లోబ్ - దాన్ని ధరించిన వ్యక్తి శరీర ఉష్ణోగ్రతను తెలియజేస్తుంది. ఈ రింగ్‌లో ఉండే టెంపరేచర్ సెన్సర్ ఆ పనిచేసి పెడుతుంది. మనిషి ఒత్తిడి స్థాయిల నుంచి ఫీవర్, వ్యాయామం, న్యూట్రిషనల్ అలవాట్లు, చివరకు ఫీమేల్ ఫిట్‌నెస్‌లో వచ్చే మార్పులను ట్రాక్ చేయగలుగుతుంది. దీనికి ఉండే బ్యాటరీ లైఫ్ 28 రోజులు. భవిష్యత్తులో కైనటిక్ చార్జింగ్ సామర్థ్యాలను కూడా చేకూర్చుకోవచ్చు. ఎక్కువమంది తమకు నచ్చేవాటి కోసం, అందంగా ఉండే విషయంలో శ్రద్ధ చూపుతారు. వారి స్టయిల్‌కు అనుగుణంగానూ ఈ చెవి రింగులను రూపొందించుకోవచ్చు. అయితే ఈ థెర్మల్ ఇయర్ రింగ్ ఇంకా ప్రొటోటైప్ దశలోనే ఉంది. వాస్తవ ఉపయోగంలో తలెత్తే సమస్యలపై అనుమానాలు ఉన్నాయి.





పిక్సెల్ వాచీకి బదులు డిస్కౌంట్‌లో కొత్త వాచీ

గూగుల్ పిక్సెల్ వాచీలకు సంబంధించి బంపర్ ఆఫర్ ప్రకటించింది. వారెంటీలో లేని, క్లెయిమ్ కవర్ కాని వాటికి కొత్త వాచీలను డిస్కౌంట్ రేటుపై ఇస్తామని తెలిపింది. దీన్ని డిస్కౌంటెడ్ రీప్లేస్‌మెంట్‌గా పేర్కొంది. ఒక్క మాటలో చెప్పాలంటే వాచీ పాడైనపక్షంలో డిస్కౌంట్ రేటుకు కొత్త వాచీని వినియోగదారులు పొందవచ్చు. ఇకపై వారెంటీ పరిధిలో లేని వాచీలుగల వ్యక్తులు గూగుల్ పిక్సెల్ వాచ్ కస్టమర్ కేర్ టీమ్‌ని ఆన్‌లైన్‌లో సంప్రదిస్తే సరిపోతుంది. పిక్సెల్ బడ్స్ ప్రొ మాదిరిగా సెల్ఫ్ సర్వీస్ ఆప్షన్ కూడా ఉంది. store.google.com/repair విజిట్ చేసి డివైజ్ సీరియల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఈ రోజుకు ఇంకా చేరలేదని వస్తుంది. చివరకు రీచ్ అయినట్టు కూడా వస్తుంది. అక్కడ డిస్కౌంట్ చేసి ధర వెల్లడి అవుతుంది. ఆ మొత్తం చెల్లించి కొత్త వాచీని పొందవచ్చు.

ఐఐటీ జోధ్‌పూర్‌లో ఎమ్మెస్సీ

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- ఎమ్మెస్సీ కంప్యూటేషనల్ సోషల్ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ను సంస్థ ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నిర్వహిస్తుంది. ఇందులో సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ సంబంధిత అంశాలతోపాటు వాటి మధ్య సమన్వయాన్ని బోధిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి మూడు/నాలుగేళ్ల వ్యవధి గల డిగ్రీ(ఎకనామిక్స్/సోషియాలజీ/సైకాలజీ/పొలిటికల్ సైన్స్/కంప్యూటర్ సైన్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఇంజనీరింగ్ విభాగాలు) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. గేట్ స్కోర్ ఉన్నవారికి నిబంధనల మేరకు ఫెలోషిప్ ఇస్తారు.

ఎంపిక : వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి సెలెక్షన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. కేంద్రప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **దరఖాస్తుల పరిశీలన:** మార్చి 29న
- **సెలెక్షన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 7న
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 25న
- **రెండో లిస్ట్ విడుదల:** మే 6న
- **అడ్మిషన్స్‌కు ముగింపు తేదీ:** మే 17
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐపీఎంలో పీజీ డిప్లొమాలు



బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్(ఐఐపీఎం)- రెండేళ్ల వ్యవధిగల పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ఇవి రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. ఒక్కో ప్రోగ్రామ్‌లో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పన్నెండు వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ సహా ఇంటెన్సివ్-ఇండస్ట్రీ-ఇన్‌స్టిట్యూట్-ఇంటరాక్షన్స్, క్లాస్ రూమ్ లెక్చర్స్, కేస్ అనాలిసిస్-రోల్‌ప్లే, ఫీల్డ్/లైవ్ ప్రాజెక్టులు, ఫీల్డ్ విజిట్స్, వింటర్ ప్రాజెక్టులు, గెస్ట్ లెక్చర్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 102 క్రెడిట్లు నిర్దేశించారు. సంస్థ నిర్వహించే ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐప్యాట్), గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్‌లు

- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-అగ్రిబిజినెస్ అండ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఏబీపీఎం)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఎఫ్‌పీబీఎం)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-అగ్రికల్చరల్ ఎక్స్‌పోర్ట్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఏఈబీఎం)

అర్హత

పీజీడీఎం(ఏబీపీఎం/ఏఈబీఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి డిగ్రీ(అగ్రికల్చర్ అండ్ అలైడ్ సైన్సెస్-హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరీకల్చర్/పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ/కామర్స్); పీజీడీఎం(ఎఫ్‌పీబీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ(ఫుడ్ సైన్స్/ఇంజనీరింగ్/న్యూట్రిషన్/ఫిషరీస్/హోమ్‌సైన్స్/వెటర్నరీ సైన్స్/కెమికల్ ఇంజనీరింగ్/ఏహెచ్&ఎల్ఎస్/డెయిరీ/పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/సీమ్యాట్/ గేట్/ఎక్స్ఏటీ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ వివరాలు

ఈ పరీక్షలో లాజికల్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ టెక్నిక్, లాంగ్వేజ్ కమ్యూనికేషన్, అగ్రికల్చర్ అండ్ అలైడ్ సైన్సెస్ అంశాలనుంచి మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర.

- పదోతరగతి మార్కులకు అయిదు శాతం, ఇంటర్ మార్కులకు అయిదు శాతం, డిగ్రీ మార్కులకు 20 శాతం, డైవర్సిటీ ఫ్యాక్టర్‌కు అయిదు శాతం, ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్‌నకు 30 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 25 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1250; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 625
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** iipmb.edu.in

ప్రిపరేషన్‌కు తోడ్పడే ‘టోఫెల్ టెస్ట్ రెడీ’

విదేశాల్లో చదువుకోవడానికి తోడు అక్కడ కొన్ని ఉద్యోగాల కోసం తప్పకుండా రాయాల్సిన పరీక్షల్లో టోఫెల్ ఒకటి. టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్ దీని పూర్తి రూపం. ఈ పరీక్షను నిర్వహించే సంస్థ ఈటీఎస్(ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్). కాగా అదే సంస్థ టోఫెల్ రాసే వ్యక్తులకు టెస్ట్ ప్రిపరేషన్‌లో సహకరించేందుకు ‘టోఫెల్ టెస్ట్ రెడీ’ని ప్రకటించింది. ఇదో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్లాట్‌ఫారం. ఈ వేదిక ఔత్సాహికులకు నేరుగా పర్సనలైజ్డ్ స్టడీ ప్లాన్స్, ప్రాక్టీస్ టెస్ట్, ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీకి సంబంధించి ఫీడ్‌బ్యాక్ అందిస్తుంది. దీన్లో ఫ్రీ, పెయిడ్ సర్వీసులు రెండూ ఉన్నాయి. ఇంగ్లీష్‌లో నైపుణ్యాలు అంటే రీడింగ్, లిజనింగ్, స్పీకింగ్, రైటింగ్ కాంపోనెంట్స్ నాలుగూ ఉంటాయి. టోఫెల్ ప్రిపరేషన్ విషయంలో సర్వసమగ్రంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దారు. వినూత్న ఫీచర్లు, ప్రిపరేషన్ రిసోర్సులతో ఉంది. అందుకోసం ప్రస్తుతం ఉన్న టోఫెల్ ఐబీటీతో కలిపేశారు. ఇందులో ప్రధానంగా పర్సనలైజ్డ్ ప్రిపరేషన్ ప్లాన్స్ ఉంటాయి. వ్యక్తుల అవసరాలను అనుసరించి టైలర్డ్ స్టడీ షెడ్యూల్స్ ఉంటాయి. వీడియోలు, కోర్సులు, బుక్స్, టిప్స్, ప్రోగ్రెస్ ట్రాకింగ్ టూల్స్‌కు యాక్సెస్ కూడా కల్పిస్తారు.

పెయిడ్ సర్వీస్‌లో ప్రధానంగా సెక్షన్ టెస్ట్స్ ఉంటాయి. టెస్ట్ సెక్షన్లన్నీ పూర్తి చేసిన తరవాత స్కోర్స్‌కు తోడు గుర్తించిన లోపాలు, సరిదిద్దుకోవాల్సిన తప్పులతో సమగ్రంగా ఇన్‌సైట్స్ కూడా అందిస్తారు. సెక్షన్ ప్రాక్టీస్ కింద క్వశ్చన్/ ఒక సెక్షన్ పరిధిలో టాస్క్ లెవెల్‌పై ఫీడ్‌బ్యాక్, ఇన్‌సైట్స్ అందిస్తుంది. శాంపుల్ రెస్పాన్సెస్ కూడా ఉంటాయి. ఫోకస్డ్ ప్రాక్టీస్ కింద టార్గెటెడ్ ఇంప్రూవ్‌మెంట్‌కు ఆస్కారం కల్పిస్తుంది. ఇది కూడా సెక్షన్ ప్రాక్టీస్ మాదిరిగానే ఉంటుంది. అయితే లక్ష్య కేంద్రీకృతంగా ఉంటుంది. ఏఐని ఉపయోగించడం ద్వారా వ్యక్తిగతంగా సూచనలు, సలహాలు అందించే వీలు ఉంటోంది. తద్వారా ప్రొఫెసియెన్సీ విషయంలో గరిష్ఠీకరణకు తోడ్పడుతుంది.

ఉచిత వెర్షన్‌లో డైలీ స్కోరింగ్ యాక్టివిటీ, పర్సనలైజ్డ్ ప్రిపరేషన్స్, పూర్తి స్థాయిలో స్టడీ మెటీరియల్ అంటే వీడియోలు, కోర్సులు, పుస్తకాలు, ప్రోగ్రెస్ ట్రాకింగ్ ఉంటాయి. మొత్తమ్మీద ఇదో కాంప్రహెన్సివ్ టెస్ట్ ప్రిపరేషన్ ప్లాట్‌ఫారం అని ఈటీఎస్ అధికారిక ప్రకటనలో తెలిపింది.

కేంద్రీయ హిందీ సంస్థాన్ కోర్సులు



ఆగ్రాలోని కేంద్రీయ హిందీ సంస్థాన్- డీఈఎల్ఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఒక్కో దానిలో 44 సీట్లు ఉన్నాయి. వీటిని హిందీ భాషేతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. పూర్తి సమాచారం కోసం ఫిబ్రవరి 17 నాటి ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ చూడవచ్చు.

హిందీ శిక్షణ్ ప్రవీణ్(డీఈఎల్ఈడీ)

గుర్తింపు పొందిన బోర్డు నుంచి హిందీ ఒక సబ్జెక్ట్‌గా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో హిందీ సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు హిందీలో ఇంటర్ లెవెల్ సర్టిఫికెట్ కోర్సులైన కోవిద్, భూషణ్ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. హిస్టరీ(ఇండియన్ హిస్టరీ), జాగ్రఫీ, సివిక్స్(ఇండియన్ పాలిటీ, పొలిటికల్ సైన్స్), సోషియాలజీ(ఇండియన్ సొసైటీ అండ్ కల్చర్), ఎకనామిక్స్(ఇండియన్ ఎకానమీ, బిజినెస్ ఎకనామిక్స్) సబ్జెక్టుల్లో ఒకదాన్ని ఇంటర్ స్థాయిలో చదివి ఉండాలి.

హిందీ శిక్షణ్ పారంగత్(బీఈడీ)

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హిందీ ప్రధాన సబ్జెక్ట్‌గా కనీసం 50 శాతం మార్కులతో బీఏ/ఎంఏ పూర్తి చేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. హిందీ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై హిందీలో బీఏ లెవెల్ డిప్లొమాలైన విద్వాన్, రత్న, శాస్త్రి పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. హిస్టరీ(ఇండియన్ హిస్టరీ), జాగ్రఫీ, సివిక్స్ (ఇండియన్ పాలిటీ, పొలిటికల్ సైన్స్), సోషియాలజీ (ఇండియన్ సొసైటీ అండ్ కల్చర్), ఎకనామిక్స్ (ఇండియన్ ఎకానమీ, బిజినెస్ ఎకనామిక్స్) సబ్జెక్టుల్లో ఒకదాన్ని డిగ్రీ స్థాయిలో చదివి ఉండాలి.

హిందీ శిక్షణ్ నిష్ణాత్(ఎంఈడీ)

హిందీ మెథడ్ స్పెషలైజేషన్‌తో బీఈడీ కోర్సు ఉత్తీర్ణులైనవారు; హిందీ శిక్షణ్ పారంగత్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 26
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, గువహటి, మైసూర్, నాగ్‌పూర్, భువనేశ్వర్, బరోడా, కోల్‌కతా
- **చిరునామా:** రిజిస్ట్రార్, కేంద్రీయ హిందీ సంస్థాన్, హిందీ సంస్థాన్ మార్గ్, ఆగ్రా-282005
- **వెబ్‌సైట్:** www.hindisansthan.in

జాబ్ కార్నర్

బామర్‌లో జూనియర్ ఆఫీసర్లు

ప్రభుత్వ సంస్థ బామర్ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో రెగ్యులర్/ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టులు: 16

1. మేనేజర్(సేల్స్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ మేనేజర్: **2 పోస్టులు**
3. ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్(ట్రావెల్స్): **11 పోస్టులు**
4. జూనియర్ ఆఫీసర్(కమర్షియల్): 1 పోస్టు
5. జూనియర్ ఆఫీసర్(ఫారెక్స్): 1 పోస్టు

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ/ఎంబీఏ/గ్రాడ్యుయేట్ ఇంజనీర్

దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 1

వెబ్‌సైట్: www.balmerlawrie.com

ఆర్ఎఫ్‌సీఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

రామగుండంలోని ఎన్ఎఫ్ఎల్, ఈఐఎల్, ఎఫ్‌సీఐఎల్ జాయింట్ వెంచర్ అయిన రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్(ఆర్ఎఫ్‌సీఎల్)... కింద పేర్కొన్న నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 35

1. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ప్రొడక్షన్): **11 పోస్టులు**
2. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ప్రొడక్షన్): **6 పోస్టులు**
3. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(మెకానికల్): **3 పోస్టులు**
4. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఎలక్ట్రికల్): **1 పోస్టు**
5. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఇన్‌స్ట్రుమెంటేషన్): **4 పోస్టులు**
6. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఇన్‌స్ట్రుమెంటేషన్): **2 పోస్టులు**
7. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(కెమికల్ ల్యాబ్): **2 పోస్టులు**
8. ఆఫీస్ అసిస్టెంట్ గ్రేడ్-3: **6 పోస్టులు**

అర్హతలు: పోస్టులను అనుసరించి నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఉండాలి. పూర్తి సమాచారం నోటిఫికేషనల్‌లో చూడవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: http://wwe.rfcl.co.in/



డీఆర్‌డీవోలో జేఆర్ఎఫ్

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, అహ్మద్‌నగర్...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 13

పోస్టులు: జూనియర్ రీసెర్చ్ ఫెలో

అర్హతలు: బీఈ/బీటెక్, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ(ఎంఈ/ఎంటెక్/ఎంఎస్), నెట్, గేట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్.

వేతనం: నెలకు రూ.37,000 **వయోపరిమితి:** 28 సంవత్సరాలు

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 4 నుంచి మార్చి 7 వరకు

ప్రదేశం: వీఆర్‌డీఈ, పీఓ: వహన్ననగర్, అహ్మద్‌నగర్-414006(మహారాష్ట్ర)

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

ఏపీలో అసిస్టెంట్ డైరెక్టర్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)...ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీసులో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 7

అర్హత: బీఆర్క్ లేదా బీఈ, బీటెక్(సివిల్) లేదా బీప్లానింగ్/బీటెక్(ప్లానింగ్) లేదా ఎంఏ(జాగ్రఫీ), పీజీ లేదా టౌన్ ప్లానింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.61,960 - రూ.1,51,370

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.370. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: మార్చి 21 నుంచి ఏప్రిల్ 10 వరకు

వెబ్‌సైట్: psc.ap.gov.in/

రైట్స్‌లో ఇంజనీర్లు

గురుగావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్ లిమిటెడ్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 19

1. డిజైన్ ఇంజనీర్: **1 పోస్టు**
2. సెక్షన్ ఇంజనీర్: **2 పోస్టులు**
3. ఎగ్జిక్యూటివ్: **1 పోస్టు**
4. డ్రాయింగ్ అండ్ డిజైన్ ఎక్స్‌పర్ట్: **1 పోస్టు**
5. అసిస్టెంట్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎక్స్‌పర్ట్: **2 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.

విభాగాలు: సివిల్, అకౌంట్స్, ఎస్అండ్‌టీ, ఎలక్ట్రికల్ తదితరాలు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22

ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 21 నుంచి 23 వరకు

ప్రదేశం: శిఖర్, ప్లాంట్ నెం.1, లైజర్ వాలీ, రైట్స్ భవన్, సెక్టార్ 29, గురుగ్రాం, హరియాణా

వెబ్‌సైట్: www.rites.com/Career

చిట్టీల్స్




మీకు తెలుసా?

- కోతి జాతికి చెందిన ఈ జంతువును ‘బ్రౌన్ థ్రోటెడ్ స్లాత్’ అని పిలుస్తారు. 42 సెం.మీ. నుంచి 82 సెం.మీ. వరకు పెరుగుతాయి.
- బరువు మాత్రం రెండున్నర కేజీలనుంచి ఆరున్నర కేజీల వరకు ఉంటాయి.
- ఇవి రాత్రి, పగలు తేడా లేకుండా రోజుకు పద్దెనిమిది గంటలు నిద్రపోతాయి. ఎక్కువగా చెట్లమీదనే జీవిస్తాయి. ఒక్కోసారి వారం పాటు నేలమీదకు దిగవు. ఇవి స్విమ్ చేయటంలో ముందుంటాయి.
- ఇవి నిదానంగా ఉంటాయి. సోమరులు అనమాట. అయితే చిటారు కొమ్మల్లో ఉండటానికి ఇష్టపడతాయి.
- రెయిన్ ఫారెస్టుల్లోని రబ్బరు చెట్ల ఆకులను తింటాయివి. మెల్లగా అరుగుతాయివి. ఆవు మాదిరి దీని కడుపులో మూడు గదులు ఉండటం వల్ల అరగని ఆకులు ఒక గదిలో నిలబడతాయి. తర్వాత తింటుంది.



- ఈ జంతువులు మధ్య దక్షిణ అమెరికాల్లో కనిపిస్తాయి. అంటే బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్, పనామా, పెరు, వెనిజులా.. లాంటి దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- వీటి గర్భధారణ సమయం 5 నుంచి 8 నెలలు. పిల్లను కనీసం పది నెలల వరకూ పెంచుతాయి. ఆ తర్వాత వదిలేస్తాయి.
- బ్రౌన్ కలర్‌తో పాటు లైట్ గ్రీన్ ఉండేట్లు కూడా కొన్ని ఉంటాయి.
- ఇవి చూడటానికి అవేక్- అలెర్ట్‌గా ఉంటాయి. అంటే నిద్రపోవటానికి రెడీగా ఉన్నట్లు వీటి ముఖాలుంటాయి. జస్ట్ చిన్న చప్పుడు వస్తేనే నిద్రలేచేంత చురుగ్గా ఉంటాయి.
- మగవాటికంటే ఆడ జంతువులు గట్టిగా అరుస్తాయి.
- స్లాత్ గోళ్లు పొడవుగా ఉంటాయి. వేగంగా చెట్లు ఎక్కగలవు. వీటి శరీరం పెద్దగా ఉన్నట్లు కనపడుతుంది. అందుకు జుట్టే కారణం.
- ఈ జంతువులు 65 మిలియన్ల సంవత్సరాల నుంచి ఉన్నాయని పరిశోధనల్లో తేలింది.
- వీటి జీవనకాలం 40 ఏళ్లకంటే ఎక్కువ ఉండదు.

దారి కనుక్కోండి





10 తేడాలను గుర్తించండి

సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 232

	6	1				4		
4	7		6	3				
					2		5	
	4							7
		3	7	9	8	1		
7							9	
	8		9					
				4	1		7	5
		7				6	4	

సుడోకు - 231 సమాధానం

2	3	9	8	7	1	5	4	6
7	8	4	6	5	2	1	9	3
6	1	5	4	3	9	7	8	2
3	2	1	9	8	5	4	6	7
5	4	7	3	2	6	9	1	8
8	9	6	7	1	4	2	3	5
9	5	3	2	4	8	6	7	1
4	7	2	1	6	3	8	5	9
1	6	8	5	9	7	3	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.